ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం, మే 10, 2026 | సంపుటి - 22 | సంచిక 221 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam



## వెనక్కి తిరిగి చూడను..

### తర్వాతి పేజీ మాత్రమే చూస్తాను

- కీలక మలుపుగా 'ఈ వేళలో నాలో ' పాట
- సంగీతంలో లోతు తగ్గిపోయింది
- సాధారణ సంభాషణలే నేడు పాటలవుతున్నాయి
- గాయని సునీత ఉపద్రష్ట

తెలుగు సినీ సంగీత ప్రపంచంలో తన మధుర గాత్రంతో మూడు దశాబ్దాలుగా కోట్లాది సంగీతాభిమానులను అలరిస్తున్న ప్రముఖ గాయని సునీత ఉపద్రష్ట. ప్లేబ్యాక్ సింగర్‌గా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారు. స్వరంలోని సున్నితత్వం, భావ వ్యక్తీకరణలోని ప్రత్యేకతతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ఆమె చిరస్థాయిగా నిలిచారు. అనేక హిట్ పాటలతో సంగీత ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన సునీత, కాలాను గుణంగా వచ్చిన మార్పులను అర్థం చేసుకుంటూనే తన ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు.నేటి ఆమె పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ముఖాముఖీలో సుస్వరాల సునీత తన మూడు దశాబ్దాల సంగీత ప్రస్థానాన్ని 'నినాదం' తో పంచుకున్నారు.ఇండస్ట్రీలో మార్పులు, ఏఐ ప్రభావం, వ్యక్తిగత అనుభవాలు, భవిష్యత్ ఆలోచనలపై ఆసక్తికర విషయాలను వివరించారు "గతాన్ని లెక్కపెట్టుకోను. తర్వాతి పేజీ ఏంటో మాత్రమే చూస్తాను" అంటూ తన జీవిత తత్వాన్ని వెల్లడించారు.

- పూర్తి ఇంటర్వ్యూ 12 లో..



## అంతరిక్షమంత అమ్మ ప్రేమ..

### నేడు అంతర్జాతీయ మాతృ దినోత్సవం




విశ్వసృష్టిలో వెలకట్టలేని ఏకైక పదం 'అమ్మ'. కాలాలు మారినా, నాగరికతలు రూపాంతరం చెందినా, విలువల సమీకరణలు తారుమారైనా నిశ్చలంగా, నిస్వార్థంగా నిలిచే శక్తి మాతృత్వం. తల్లి అంటే కేవలం ఒక వ్యక్తి కాదు, అది ఒక అనుభూతి, ఒక అపురూప కావ్యం, సకల జీవకోటికి ప్రాణాధారమైన అమృతధార. భారతీయ సంస్కృతిలో "మాతృ దేవోభవ" అని తల్లిని దైవం కంటే ముందే స్మరించుకోవడం మన సంస్కారానికి నిదర్శనం. ఆధునిక కాలంలో ప్రతి ఏటా మే నెల రెండో ఆదివారాన్ని 'అంతర్జాతీయ మాతృ దినోత్సవం'గా జరుపుకోవడం ఒక ఆనవాయితీగా మారింది. 2026 సంవత్సరంలో మే 10వ తేదీన ఈ వేడుకను జరుపుకుంటున్న తరుణంలో, మాతృత్వంలోని అంతరార్థాన్ని, దాని చారిత్రక పరిణామక్రమాన్ని, సమాజ నిర్మాణంలో తల్లి పోషిస్తున్న అసాధారణ పాత్రను లోతుగా విశ్లేషించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(స్పెషల్ స్టోరీ 7 లో..)

# తమిళనాడు సీఎంగా విజయ్

## నేడు 10 గంటలకు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం

- ఎట్టకేలకు తమిళనాట ఉత్కంఠకు తెర
- విజయ్‌ను నియమిస్తూ గవర్నర్ ఉత్తర్వులు
- మద్దతు లేఖలు సమర్పణ..గంటన్నరకు పైగా చర్చలు
- గవర్నర్ లేఖతో బయటకు వచ్చిన టివికె అధినేత
- 13లోగా మెజార్టీ నిరూపించుకోవాలని గవర్నర్ సూచన
- ప్రభుత్వానికి బయట నుంచి మద్దతుకు చిన్న పార్టీల నిర్ణయం




*తమిళనాడు రాజకీయాల్లో అనిశ్చితి వీడింది. సిఎంగా జోసెఫ్ విజయ్ నియమితులయ్యారు. దీంతో ఆయన నేడు ఉదయం పది గంటలకు తమిళనాడు సిఎంగా ప్రమాణం చేయనున్నారు. నెహ్రూ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. గత నాలుగు రోజుల ఉత్కంఠకు తెరదించుతూ శనివారం గవర్నర్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ప్రకటన చేశారు. అంతకుముందు విజయ్ తన అనుచరులతో కసలి గవర్నర్ను కలిసి చర్చించారు. తనకు మద్దతు ఇస్తున్న పార్టీల లేఖలను అందించారు. దీంతో సంతృప్తి చెందిన గవర్నర్ జోసెఫ్ విజయ్‌ను సిఎంగా నియమిస్తూ లేఖలను అందించారు. దాదాపు గంటా నలభై నిముషాలు వీరి భేటీ జరిగింది.*

**చెన్నై,మే9(నినాదం):**

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కీలక మలుపులు తిరిగిన అత్యధిక స్థానాలు గెలిచిన విజయ్ నేతృత్వంలోని టీవీకేకు కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయ ఎంఎల్ మద్దతు తెలపడంతో ప్రభుత్వం ఏర్పా టుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ లైన్ క్లియర్ చేశారు. ఈ మేరకు తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్‌ను నియమిస్తూ లోక్‌భవన్ ఓ ప్రకటన విడుదల చేసింది. శనివారం గవర్నర్‌ను కలిసి తమకు మద్దతిచ్చిన పార్టీల లేఖలను అందజేసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజయ్ కోరారు. మెజార్టీ మార్క్ (118)కు చేరుకోవడంతో గవర్నర్ సమ్మతించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియం వేదికగా టీవీకే చీఫ్ విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మే 13వ తేదీలోగా బల నిరూపణ చేసుకోవాలని సూచించారు. దీంతో ఇక తమిళనాడులో విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం ఈనెల 10న కొలువు తీరనుంది.

▸▸తరువాయి 2లో..



## బండి కొడుకుపై పోక్సో కేసు

- మైనర్ బాలిక ఫిర్యాదుతో పేట్ బషీరాబాద్ లో నమోదు
- మద్యం తాగించి అత్యాచారం : బాలిక కుటుంబం
- మూడు ప్రాంతాల్లో లైంగిక దాడి జరిగిందని ఫిర్యాదు
- రూ.5 కోట్లకోసం హనీట్రాప్ అంటున్న భగీరథ్
- తప్పించుకునేందుకే తమపై ఆరోపణలంటున్న బాలిక కుటుంబం
- పరస్పర ఆరోపణలు
- రాజకీయ, సామాజిక వర్గాల్లో సంచలనం

2

**హైదరాబాద్ ప్రతినిధి, మే 9(నినాదం) :**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ చుట్టూ వివాదం మరింత ముదురుతోంది. ఇప్పటికే బ్లాక్మెయిలింగ్, బెదిరింపుల ఆరోపణలతో కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన భగీరథ్‌పై తాజాగా పోక్సో కేసు నమోదవడం సంచలనంగా మారింది. తమ 17 ఏళ్ల మైనర్ కుమార్తెకు మద్యం తాగించి లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. మొయినాబాద్ ప్రాంతంలోని ఓ ఫార్మ్ హౌజ్తో పాటు మరో రెండు ప్రాంతాల్లో కూడా అత్యాచారం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. పోలీసులు భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 74, 75తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 11 r/w 12 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసు తీవ్రత దృష్ట్యా పోలీసులు పలు కోణాల్లో ఆధారాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

## లేగదూడను రక్షించే క్రమంలో..

### - బావిలో పడి చనిపోయిన తండ్రీ కొడుకులు



**ములుగు, నినాదం:**
ప్రమాదవశాత్తు బావిలో పడ్డ లేగదూడను రక్షించే క్రమంలో తండ్రీ కొడుకులిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకర ఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం కర్లపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. తండ్రీకొడుకులైన రస్పుత్ రాజు, పవన్‌లు కర్లపల్లి గ్రామంలోని సుమారు 35 అడుగుల లోతైన బావిలో లేగదూడ పడిపోవడంతో దానిని కాపాడేందుకు ఆ బావిలోకి దిగారు.

2

## అక్కా చెల్లెళ్లను ఢీకొన్న కారు

### • అక్క మృతి.. ఆస్పత్రిలో చెల్లెలు..




**హైదరాబాద్, నినాదం:**
గరంలోని వనస్థలిపురం పీఎస్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. అక్కాచెల్లెళ్లను కారు ఢీకొట్టింది. చింతల్‌కుంట వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో అంజలి (19) మృతి చెందగా, ఆమె సోదరి పూజిత (17)కు తీవ్రగాయాలయ్యాయి.

2

## అమెరికాలో హైదరాబాద్ యువతి మృతి

### కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు



**హైదరాబాద్, నినాదం:**
అమెరికాలో స్విమ్మింగ్ పూల్‌లో మునిగి ఓ తెలుగు యువతి ప్రాణాలు కోల్పోయిన ఘటన తీవ్ర విషాదం రేపింది. వర్జీనియాలో నివాసముంటున్న వీణ అనే యువతి మరణంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. రెండు రోజుల క్రితం ఓ ఫంక్షన్‌లో పాల్గొనేందుకు ఫ్లోరిడా వెళ్లిన ఆమె.. అక్కడే స్విమ్మింగ్ పూల్ వద్ద జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.

2

## క్లాస్‌లో డెమో ఇస్తూ కుప్పకూలిన టీచర్

### • గుండెపోటుతో మృతి చెందినట్లు గుర్తింపు

**ఖమ్మం, నినాదం:**
జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. క్లాస్ రూమ్ లో డెమో ఇస్తూ గుండెపోటుతో కుప్పకూలాడు ఓ ఉపాధ్యాయుడు. శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా మధిరలో చోటు చేసుకుంది ఈ విషాద ఘటన. జిల్లాలోని మధిర పట్టణం






## కేరళంపై కాంగ్రెస్ మల్లగుల్లాలు

- సిఎం ఎవరనేదానిపై తేల్చుకోలేని పార్టీ
- నేడు స్పష్టత వచ్చే అవకాశం ఉందన్న పార్టీ నేతలు

**న్యూఢిల్లీ/ తిరువనంతపురం,మే9(నినాదం):**

తమిళనాట ముఖ్యమంత్రి పదవిపై ఏర్పడిన సందిగ్ధత వీడడంతో ఇప్పుడు అందరి దృష్టి పొరుగు రాష్ట్రం కేరళపై పడింది. ఫలితాలు వెలువడి ఐదు రోజులు గడుస్తున్నా.. సీఎం ఎవరనే దానిపై ఇంకా స్పష్టతరాలేదు. సీఎం ఎంపికపై దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం జరిగినప్పటికీ.. సీఎం పేరును మాత్రం వెల్లడించలేదు. దీంతో ఆదివారం దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యడీఎఫ్ విజయఢంకా మోగించిన సంగతి తెలిసిందే.

▸▸తరువాయి 2లో..

## పట్టణ జనాభాకు అనుగుణంగా వసతులు

- సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ అభివృద్ధి
- రోడ్ల విస్తరణతో పాటు మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సిఎం రేవంత్

2 వివరాలు



## బెంగాల్ సిఎంగా సువేందు అధికారి

- ఆయనతో పాటు ఐదుగురు మంత్రుల ప్రమాణం
- ప్రమాణం చేయించి గవర్నర్ ఆర్ఎన్ రవి
- హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు
- చంద్రబాబు సహా పలు రాష్ట్రాల సిఎంలు హాజరు

▸▸వివరాలు 2లో..



## కాళేశ్వరంను తక్కువ చేసే యత్నం

- అధికారంలో ఉండగా ప్రాణహిత కోసం చేసిందేమీ లేదు
- కెసిఆర్ ముందుచూపుతోనే కాళేశ్వరం నిర్మాణం
- బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు

2

## హర్మూజ్ వద్ద నావలో మంటలు

### భారతీయ నావికుడు దుర్మరణం

2

*న్యూఢిల్లీ, నినాదం: హోర్ముజ్ జలసంధికి సమీపంలో ఒక నావలో మంటలు చెలరేగడంతో ఒక భారతీయ నావికుడు కన్నుమూసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ ఘటనలో మరో నలుగురు గాయాలపాలైనట్టు తెలిసింది. ప్రమాద సమయంలో నావలో 18 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు.*

2

## నేడు ప్రధాని రాక

- హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు విధింపు
- డ్రోన్లు, కెమెరాలు, బ్యాగులపై నిషేధం
- 2వేలమంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు
- మల్కాజిగిరి డిసిపి సుమతి వెల్లడి



# బండి కొడుకుపై పోక్సో కేసు

## "మా కుమార్తె రెండు సార్లు ఆత్మహత్యాయత్నం చేసింది"

బాలిక తల్లిదండ్రులు చేసిన ఆరోపణలు ఇప్పుడు మరింత కలకలం రేపుతున్నాయి. బండి సాయి భగీరథ్ ప్రవర్తన కారణంగా తమ కుమార్తె రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని వారు ఆరోపిస్తున్నారు. మానసిక ఒత్తిడి, వేధింపుల కారణంగానే తమ కూతురు తీవ్ర ఆవేదనకు గురైందని చెబుతున్నారు. అంతేకాకుండా.......... ఇప్పుడు కేసు నుంచి బయటపడేందుకే తమ కుమార్తెపైనే తప్పుడు కేసులు మోపే ప్రయత్నం చేస్తున్నారని బాలిక కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. "బాధితురాలినే నిందితురాలిగా చూపించే ప్రయత్నం జరుగుతోంది" అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**మరోవైపు 'హనీ ట్రాప్' వాదన**

ఇక భగీరథ్ వర్గం మాత్రం పూర్తి భిన్నమైన వాదనను ముందుకు తీసుకొస్తోంది. స్నేహం పేరుతో దగ్గరై.. తర్వాత పెళ్లి పేరుతో బ్లాక్మెయిల్ చేస్తూ రూ.5 కోట్లు డిమాండ్ చేశారని ఆరోపిస్తోంది. డబ్బు ఇవ్వకపోతే తప్పుడు కేసులు పెడతామని బెదిరించారని, ఇప్పటికే ఒత్తిడితో రూ.50 వేల రూపాయలు కూడా ఇచ్చామని చెబుతోంది. అయితే ఈ వాదనలపైనా ఇప్పుడు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "ఏ తప్పూ చేయనప్పుడు రూ.50 వేలు ఎందుకు ఇచ్చారు..?" అన్న ప్రశ్న సోషల్ మీడియా, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. భగీరథ్ వర్గం చెబుతున్న 'హనీ ట్రాప్' కథనంలో పలు సందేహాలు ఉన్నాయంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.

**రెండు కేసులు... రెండు వాదనలు**

ఒకవైపు భగీరథ్ ఫిర్యాదు ఆధారంగా కరీంనగర్ లో బ్లాక్మెయిలింగ్ కేసు......... మరోవైపు హైదరాబాద్ పరిధిలో పోక్సో కేసు నమోదు కావడంతో ఈ వ్యవహారం మరింత క్లిష్టంగా మారింది. రెండు వర్గాలు పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకుంటుండటంతో అసలు నిజం ఏంటన్న దానిపై ఆసక్తి పెరుగుతోంది. పోలీసులు ఇప్పుడు కాల్ డేటా, చాట్ రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, ప్రయాణ వివరాలు, సీసీ ఫుటేజీలు తదితర అంశాలపై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. బాధితురాలి స్టేట్మెంట్, వైద్య పరీక్షల నివేదికలు కూడా కేసులో కీలకంగా మారనున్నాయి. కేంద్ర మంత్రికి సంబంధించిన కుటుంబం పేరు ఈ కేసులో రావడంతో రాజకీయంగానూ ఇది సెన్సిటివ్ అంశంగా మారింది. సోషల్ మీడియాలో ఇప్పటికే రెండు వర్గాల మధ్య వాదోపవాదాలు తీవ్రంగా సాగుతున్నాయి. ప్రతిపక్షాలు కూడా ఈ వ్యవహారంపై స్పందించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బ్లాక్మెయిలింగ్ ఆరోపణలా..? లేక పోక్సో కేసులో ఉన్న ఆరోపణలే నిజమా..? అన్నది ఇప్పుడు పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# భూముల ధరల పెంపు నిర్ణయం

**రిజిస్ట్రేషన్లకు భారీగా డిమాండ్**

**హైదరాబాద్ :**

భూముల ధరల సవరణ నిర్ణయంతో తెలంగాణలో రిజిస్ట్రేషన్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. స్థిరాస్తుల మార్కెట్ విలువ పెంచేందుకు కసరత్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విలువలు పెరగకముందే రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ప్రజలు చొరవ చూపుతున్నారు. ఈ నెల 12 నుంచి 15 వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అదనంగా పని చేయనున్నాయి. ఆయా రోజుల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు పనివేళలుగా ప్రభుత్వం నిర్ణయించింది. రిజిస్ట్రేషన్లకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్బీ నగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ ఆర్వో, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్ కార్యాలయాల్లో అదనపు పనివేళలు ఉంటాయని ప్రభుత్వం తెలిపింది. అవసరమైతే మరింత సమయం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొంది. స్లాట్ బుకింగ్‌ల సంఖ్య పెంచాలని అధికారులను ఆదేశించింది.

## లేగదూడను రక్షించే క్రమంలో..

అయితే ఇద్దరూ ఒకే తాడుతో బావిలోకి దిగే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తాడు ఒక్కసారిగా తెగిపోవడంతో ఇద్దరు బావిలో పడిపోయి నీటిలో చిక్కుకున్నారు. గోవిందరావుపేట సీఐ దయాకర్, ఎస్సై తాజుద్దీనులు ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రస్పుత్ రాజు మృతదేహాన్ని బయటకు తీశారు. పవన్ మృతదేహం కోసం గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు కొనసాగిస్తున్నారు. తండ్రీకొడుకులు గొప్ప మనుసుతో ఓ మూగజీవిని రక్షించాలనుకుని ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## అక్కా చెల్లెళ్లను ఢీకొన్న కారు

స్థానికులు డయల్ 100కు కాల్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. సోదరి పూజితను అంజలి ఎప్‌సెట్ ఇంజినీరింగ్ పరీక్షకు తీసుకెళ్లింది. పరీక్ష అనంతరం విజయవాడ హైవే సర్వీసు రోడ్డులో నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా వారిద్దరినీ కారు ఢీకొట్టింది. అతివేగమే ఈ ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన పూజితను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అమెరికాలో హైదరాబాద్ యువతి మృతి

వీణ తల్లిదండ్రులు దేవేందర్ రెడ్డి`సునీత ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని లింగోజిగూడ డివిజన్‌లో నివాసం ఉంటున్నారు. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న తమ కుమార్తె మరణ వార్తతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ విషాదం గురించి తెలుసుకున్న ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నేరుగా వీణ తల్లిదండ్రులు ఉంటున్న నివాసానికి వెళ్లారు. వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వీణ భౌతిక కాయాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకొచ్చేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఆ కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు.

## క్లాస్‌లో డెమో ఇస్తూ కుప్పకూలిన టీచర్

రెండోవార్డు ఎంఎ`లాయిస్ కాలనీకి చెందిన ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు గారపాటి జయరాజ్ ఖమ్మంలోని మమతా రోడ్ లో ఉన్న శ్రీ చైతన్య ఒలంపియాడ్ స్కూల్ లో వర్క్ షాప్ కి హాజరయ్యాడు. వర్క్ షాప్ లో భాగంగా క్లాస్ రూమ్ లో డెమో ఇస్తుండగా గుండెపోటుతో కుప్పకూలాడు జయరాజ్. డెమో ఇస్తున్న జయరాజ్ ఒక్కసారిగా కుప్పకూలడంతో అతనిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు సహ ఉపాధ్యాయులు. అయితే.. అప్పటికే జయరాజ్ మరణించినట్లు తెలిపారు డాక్టర్లు. జయరాజ్ డెమో ఇస్తూ కుప్పకూలిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. జయరాజ్ మరణంతో అతని కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. అప్పటిదాకా హుషారుగా పాఠం చెబుతున్న జయరాజ్ ఒక్కసారిగా కుప్పకూలడం జీర్ణించుకోలేక పోతున్నామని అంటున్నారు తోటి ఉపాధ్యాయులు. ఈ ఘటనతో మధిర పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## కేరళంపై కాంగ్రెస్ మల్లగుల్లాలు

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పర్యటించిన ఏఐసీసీ పరిశీలకులు ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు శుక్రవారం నివేదిక సమర్పించారు. ఈ క్రమంలోనే శనివారం సాయంత్రం 4 గంటలకు ఖర్గే నివాసంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి రాహుల్ గాంధీ, కేపీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్, సీఎం పదవి రేసులో ఉన్న వీడీ సతీషన్, కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితల హాజరయ్యారు. కీలక సమావేశం ముగిసిన అనంతరం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీ వి□డియాతో మాట్లాడారు. సీఎం అభ్యర్థి ఎవరనే దానిపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు సంయమనం పాటించాలని కోరారు. నాయకత్వ ఎంపికపై అధిష్ఠానం సమష్టిగా నిర్ణయం తీసుకుంటుందన్నారు. మరోవైపు సీఎం ఎవరనేది ప్రకటించే ముందు మరోసారి చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.





# పట్టణ జనాభాకు అనుగుణంగా వసతులు

**హైదరాబాద్ :**

ఆధునీకరణ, పట్టణీకరణతో భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే త్రీ లెవెల్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించు కున్నామని చెప్పారు.ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే సరిపోదని.. మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీఎం వెల్లడించారు. పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని మ□డు భాగాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ప్యూర్,క్యూర్, రేర్ అభివృద్ధిని మ□డు భాగాలుగా విభజించుకున్నామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు ఏరియాను సర్వీస్ సెక్టార్‌గా గుర్తించా మన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు బయట, రీజనల్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ఏరియాను మాన్యూఫ్యాక్చర్ సెక్టార్‌గా గుర్తించామని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు బయట ఉన్న ఏరియాను అగ్రికల్చర్ సెక్టార్‌గా గుర్తించామని అన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి సంబంధించి తెలంగాణ రైజింగ్`2047 మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించుకున్నామని ముఖ్యమంత్రి అన్నారు. మ□సీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు మన సంస్కృతికి అనుసంధానం చేయబోతున్నట్లు తెలిపారు. నగరంలో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఆర్టీసీలో ఈవీ బస్సులను తీసుకొస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఈవీ వాహనాలుగా మార్చబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.ఆధునికీకరణ, పట్టణీకరణతో భవిష్యత్‌లో మరిన్ని కొత్త సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాలపై సమావేశంలో చర్చించారు.

# తమిళనాడు సిఎంగా విజయ్




గవర్నర్ అపాయిమెంట్ ఇవ్వడంతో శనివారం సాయంత్ర లోక్‌భవన్‌లో ఆయనను విజయ్ కలుసుకున్నారు. టీవీకేకు మద్దతిస్తున్న కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, వీసీకే, ఐయ□ఎంఎల్ నేతలు కూడా విజయ్ వెంట గవర్నర్‌ను కలిశారు. ఎమ్మెల్యేల మద్దతు లేఖలను విజయ్ గవర్నర్‌కు అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించాలని కోరారు. ఇందుకు గవర్నర్ సమ్మతించారు.

చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ప్రమాణస్వీకార కార్యక్రమం ఏర్పాటు చేశారు. విజయ్‌తో పాటు 9 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. తదుపరి మంత్రివర్గ విస్తరణలో భాగస్వామ్య పార్టీలకు అవకాశం కల్పిస్తారని తెలుస్తోంది. ఈనెల 4న వెలువడిన ఫలితాల్లో విజయ్ టీవీకే 108 సీట్లతో ఏకైక పెద్దపార్టీగా నిలిచింది. అయితే ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల సంఖ్యా బలం లేకపోవడంతో ప్రభుత్వం ఏర్పాటుకు సంబంధించిన గవర్నర్ మ□డుసార్లు విజయ్‌కు అనుమతి నిరాకరించారు. ఈనెల 10వ తేదీతో గవర్నర్ ఇచ్చిన గడువు ముగియనుండటంతో ఉత్కంఠ కొనసాగుతూ వచ్చింది. రెండు చోట్ల నెగ్గిన విజయ్ ఒకచోట వదులుకోవాల్సి ఉండటంతో టీవీకే బలం 107కు చేరింది. కాంగ్రెస్ పార్టీ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు, వామపక్షాల నుంచి నలుగురు ఎమ్మెల్యేలు మద్దతు ఇవ్వడంతో అది 116కు చేరింది. అయితే మరో ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతుపై సస్పెన్స్ కొనసాగుతూ వచ్చింది. ఎట్టకేలకు ఇద్దరు ఎమ్మెల్యేలున్న వీసీకే బేషరుతుగా టీవీకేకు మద్దతు తెలిపింది. దీంతో పూర్తి సంఖ్యాబలం చేకూరిన విజయ్ నాలుగోసారి గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరారు. అయితే అప్పుడు కూడా సస్పెన్స్ కొనసాగింది. కేరళ పర్యటన ఉండటంతో గవర్నర్ అందుబాటులో లేరని చెప్పిన లోక్‌భవనన్ వర్గాలు ఆ తర్వాత కొద్దిసేపటికే గవర్నర్ పర్యటన రద్దయిందంటూ అపాయింట్‌మెంట్ ఖరారు చేసింది. దీంతో నాలుగోసారి గవర్నర్‌ను కలిసిన విజయ్ పూర్తి సంఖ్యాబలాన్ని గవర్నర్ ముందుంచారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటుకు లైన్ క్లియర్ అయింది. ప్రభుత్వ ఏర్పాటులో టీవీకేకు మద్దతు ఇస్తున్న వీసీకే.. క్యాబినెట్ బెర్త్‌లు మాత్రం వద్దని చెప్పింది. 'మేం ప్రభుత్వంలో చేరబోం. వెలుపలి నుంచే మద్దతు ఇస్తాం. భవిష్యత్‌లో ప్రభుత్వంలో భాగం అవుతామా లేదా..? అన్నది చెప్పలేం. రాష్ట్రపతి పాలనను నివారించేందుకు, ప్రజల తీర్పును నెరవేరేలా చేసేందుకు ప్రభుత్వ ఏర్పాటులో భాగం అవుతున్నాం' అని వీసీకే చీఫ్ తిరుమావళవన్ వి□డియాకు వెల్లడించారు. తాము ఇప్పటికీ డీఎంకే నేతృత్వంలోని కూటమిలోనే ఉన్నామని వీసీకే, ఐయ□ఎంఎల్ వెల్లడించడం గమనార్హం. ఇప్పటికే వామపక్షాలు కూడా క్యాబినెట్ పదవులు వద్దని చెప్పిన విషయం తెలిసిందే. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో చెన్నై సవి□పంలో టీవీకే ఎమ్మెల్యేలు ఉంటున్న రిసార్ట్ బయట భద్రతను భారీగా పెంచారు. ప్రస్తుతం విజయ్‌కు మద్దతు ఇస్తున్న సభ్యుల సంఖ్య 120కి చేరింది.పార్టీల వారీగా సంఖ్యాబలం ఇలా ఉన్నాయి. టీవీకే : 107, కాంగ్రెస్ : 5, సీపీఐ : 2, సీపీఎం : 2, వీసీకే : 2, ఐయ□ఎంఎల్: 2 ఉన్నాయి.

## ఎలుకల మందుతాగి డ్రైవింగ్

**ప్రమాదానికి గురైన ఆటో డ్రైవర్**

సంగారెడ్డి : జిల్లాలోని చౌటకూర్ వద్ద జాతీయ రహదారి 161పై శనివారం రోడ్డు ప్రమాదం చోటు జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఎలుకల మందు తాగి ఆటో నడపడం.. ప్రమాదానికి దారితీసింది. మందు ప్రభావంతో ఆటోను కంట్రోల్ చేయలేక రోడ్డు పక్కన ఆరబోసిన వరి కుప్పలను ఢీకొట్టడంతో వాహనం బోల్తా పడింది. సదరు ఆటో □డైవర్ గత కొంతకాలంగా కుటుంబ సమస్యలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన అతను ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని, ఎలుకల మందు తాగి ఆటో నడిపాడు. ఆటో చౌటకూర్ శివారులోకి రాగానే □డైవర్ అస్వస్థతకు గురవడంతో వాహనం నియంత్రణ కోల్పోయింది. రోడ్డుపైనే ఉన్న వరి కుప్పలపైకి దూసుకెళ్లడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని □డైవర్‌ను బయటకు తీశారు. అతని వద్ద ఉన్న కాగితాలను పరిశీలించగా, తన ఆత్మహత్యాయత్నానికి కారణమైన కొందరు వ్యక్తుల పేర్లను అందులో రాసి ఉన్నట్లు గుర్తించారు.

# కాళేశ్వరంను తక్కువ చేసే యత్నం

**అధికారంలో ఉండగా ప్రాణహిత కోసం చేసిందేమీ లేదు**

**కెసిఆర్ ముందుచూపుతోనే కాళేశ్వరం నిర్మాణం**

**బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు**

సిద్దిపేట :

కటిక చీకట్లోనూ కారుదీపం లాంటిది కాళేశ్వరం అని హరీశ్‌రావు తెలిపారు. ఎంత కరవు వచ్చినా నదిలో నీళ్లు ప్రవహించే సత్తా మేడిగడ్డకు ఉందని పేర్కొన్నారు. కేసీఆర్ ముందుచూపుతో ఆలోచించి కాళేశ్వరం నిర్మాణం చేపట్టారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును తక్కువ చేసి మాట్లాడితే తెలంగాణకు ద్రోహం చేసినట్లే అవుతుందని అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ నీటి సౌలభ్యతను తక్కువ చేసి మాట్లాడకండి అని హితవు పలికారు. జలహారతి అంటూ డ్రామాలు తప్ప కాంగ్రెస్‌లో నిజాయితీ లేదని విమర్శించారు. ఆనాడు ఏడున్నరేళ్లు.. ఈనాడు రెండున్నరేళ్లు కాంగ్రెస్ డ్రామాలు చేసిందని మండిపడ్డారు. మేడిగడ్డ మరమ్మతు చేసి సాగు, తాగు నీళ్లు ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. నాలుగేళ్లలో ప్రాణహితను పూర్తి చేస్తామని చెప్పి.. ఇప్పటివరకు తట్టెడు మట్టి తీయలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. 2024`25 బడ్జెట్‌లో ప్రాణహితకు రూ.2కోట్లు కేటాయించారని హరీశ్‌రావు తెలిపారు. 2025`26 బడ్జెట్‌లో ప్రాణహితకు రూ.30కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రాణహిత చేవెళ్లకు పెట్టింది రూ.50కోట్లు అని అన్నారు. తిప్పి తిప్పి రూ.84 కోట్లే కేటాయించారని.. వీటితో ప్రాణహిత పూర్తవుతుందా అని ప్రశ్నించారు. నిజంగానే కట్టే ఆలోచన ఉంటే బడ్జెట్‌లో నిధులు పెంచాలి కదా అని నిలదీశారు. ప్రాణహితకు సంబంధించి రూ.11వేల కోట్ల పనులు పూర్తయ్యాయని నిన్న రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పాడని మండిపడ్డారు. అసలు కాంగ్రెస్ హయాంలో భూసేకరణ, పనులకు అయిన ఖర్చు రూ.3708 కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి చెబుతున్న అబద్దాలకూ హద్దూ పద్దూ ఉండాలని అన్నారు. ఆనాడు జలయజ్ఞం కాదు.. ధన యజ్ఞం అన్న రేవంత్ ఇవాళ గొప్పలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఊసరవెల్లిలా రేవంత్ రెడ్డి రంగులు మారుస్తున్నాడని మండిపడ్డారు. 30 నెలలుగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లను మరమ్మతు చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండుటెండలోనూ 6400 క్యూసెక్కుల నీరు పోతుందని అన్నారు. మేడిగడ్డ మరమ్మతు చేస్తే కేసీఆర్‌కు పేరొస్తదని తమ్మడిహట్టి అంశం తీసుకొస్తున్నారని తెలిపారు. రాష్ట్రం గురించి రేవంత్ రెడ్డి ఏ మాత్రం ఆలోచించడం లేదని విమర్శించారు.





# బెంగాల్ సిఎంగా సువేందు అధికారి

**కోల్‌కతా,మే9(నినాదం):**

పశ్చిమ బెంగాల్‌లో మొట్టమొదటిసారి కమలదళ సర్కారు కొలువుదీరింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా భాజపా నేత సువేందు అధికారి శనివారం ప్రమాణస్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో సువేందు చేత బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రమాణం చేయించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర 9వ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేశారు. అగ్నిమిత్ర పాల్, దిలీప్ ఘోష్, అశోక్ కిర్తానియా, నిశిత్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రులు జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, యోగి ఆదిత్యనాథ్, రేఖా గుప్తా, భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్ తదితరులు హాజరయ్యారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం సృష్టించిన సంగతి తెలిసిందే. బీజేపీ 207 స్థానాల్లో ఘన విజయం సాధించింది. అధికార తృణమ□ల్ కాంగ్రెస్ పార్టీ 80 సీట్లకే పరిమితం అయింది. సువేందు అధికారి రెండు చోట్ల పోటీ చేశారు. నందిగ్రామ్, భవానీపూర్ నుంచి ఆయన బరిలో నిలిచారు. భవానీపూర్ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం కావటం విశేషం. సువేందు భవానీపూర్‌లో మమతాపై 15 వేల ఓట్ల మెజార్టీతో గెలుపు సాధించారు. అవివాహితుడైన 55 ఏళ్ల సువేందు.. బెంగాల్ కు 9వ సీఎంగా ప్రమాణం చేశారు. ఈ పదవి చేపట్టిన తొలి భాజపా నేతగా అరుదైన చరిత్ర సృష్టించారు. 1970 డిసెంబరు 15న బెంగాల్ తూర్పు మేదినీపూర్ జిల్లాలో సువేందు జన్మించారు. 1998లో మమతా బెనర్జీ స్థాపించిన తృణమ□ల్ కాంగ్రెస్‌లో చేరారు. అప్పటినుంచి దీదీకి నమ్మినబంటులా మారారు. 2004లో తమలుక్ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2006లో తొలిసారి కాంథీ దక్షిణ్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత రెండుసార్లు ఎంపీగా గెలిచి లోక్‌సభకు వెళ్లారు.గతంలో మమతా బెనర్జీ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు. మమత మేనల్లుడి కారణంగా ఆమెతో విభేదించి.. 2020లో టీఎంసీని వీడి కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటినుంచి రాష్ట్రంలో భాజపాను ముందుండి నడిపించారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో, తాజా ఎన్నికల్లో భవానీపూర్‌లో మమతా బెనర్జీని రెండుసార్లు ఓడించి సంచలనం సృష్టించారు.

# నేడు ప్రధాని మోడీ రాక

**నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధింపు**

**డ్రోన్లు, కెమెరాలు, బ్యాగులపై నిషేధం**

**2వేలమంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు**

**మల్కాజిగిరి డిసిపి సుమతి వెల్లడి**

హైదరాబాద్ : భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం భాగ్యనగర పర్యటనకు రానున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొని ప్రసంగించ నున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో అటు పోలీసులు, ఇటు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశాయి. ప్రధాని మోదీ ఆదివారం మధ్యాహ్నం 2:50 నిమిషాలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా సభ జరిగే పరేడ్ గ్రౌండ్స్‌కు బయలుదేరుతారు. ప్రధాని పర్యటనను దృష్టిలో ఉంచుకుని పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో మ□డంచెల భద్రతా వలయాన్ని నిర్మించారు. సుమారు 2,000 మందికి పైగా పోలీసులతో పాటు, ప్రత్యేక రక్షణ బృందాలు, స్నైపర్లు, మఫ్టీ పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ రంగంలోకి దిగాయి. ప్రధాని పర్యటన, బహిరంగ సభ కారణంగా సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. ముఖ్యంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి పరేడ్ గ్రౌండ్స్ వరకు వెళ్లే ప్రధాన రహదారులతో పాటూ సికింద్రాబాద్ పరిసరాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించనున్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు

## బహిరంగ సభ

హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభకు నగర యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. ఈ సభకు సంబంధించి భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై మల్కాజిగిరి డిసిపి సుమతి కీలక వివరాలను వెల్లడించారు. సభను ప్రశాంతంగా నిర్వహించేందుకు సుమారు 2,000 మంది పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా సభా ప్రాంగణంలోకి డ్రోన్లు, కెమెరాలు, బ్యాగులను తీసుకురావడంపై నిషేధం విధించారు. బహిరంగ సభ దృష్ట్యా.. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకూ పరేడ్ గ్రౌండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని సీపీ స్పష్టం చేశారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడకుండా ముందుగానే ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రోడ్లపై ఎక్కడైనా వాహనాలను పార్క్ చేస్తే.. వాటిని వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. సభకు వచ్చే వారి కోసం ప్రత్యేకంగా 12 పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశామని, వాహనదారులు పార్కింగ్ స్థలాలను సులభంగా గుర్తించేందుకు వీలుగా అక్కడ క్యూఆర్ (ఖీఖీ) కోడ్‌లను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని వాహనదారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు.

# హర్మ్యూజ్ వద్ద నావలో మంటలు

న్యూఢిల్లీ, నినాదం: హోర్ముజ్ జలసంధికి సమీపంలో ఒక నావలో మంటలు చెలరేగడంతో ఒక భారతీయ నావికుడు కన్నుమూసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ ఘటనలో మరో నలుగురు గాయాలపాలైనట్టు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రమాద సమయంలో నావలో 18 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. మంటలు చెలరేగటానికి గల కారణాలు మాత్రం ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనలో గాయపడ్డ వారికి దుబాయ్‌లో వైద్య చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై దుబాయ్‌లోని భారతీయ కాన్సులేట్ కూడా స్పందించింది. క్షతగాత్రులను ఆసుపత్రిలో పరామర్శించామని తెలిపింది. నావ యజమానితో నిత్యం అందుబాటులో ఉన్నామని కూడా పేర్కొంది. అన్ని రకాల సాయాలను అందిస్తున్నామని తెలిపింది. ఈ ఘటన విచారకరమని కూడా పేర్కొంది. ఇరాన్, య ఎస్ మధ్య హోర్ముజ్ వేదికగా ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్న వేళ ఈ పరిణామానికి ప్రాధాన్యం ఏర్పడింది. శుక్రవారం హోర్ముజ్‌లో ఇరాన్, య ఎస్ దళాలు పరస్పరం కాల్పులకు దిగిన విషయం తెలిసిందే. మొదట కాల్పులకు దిగింది అమెరికాయేనని ఇరాన్ ఆరోపించింది. నౌకలను, సాధారణ పౌరులను అమెరికా టా `గ్గం చేసిందని ఆరోపించింది. కానీ ఇరాన్ దాడులకు తాము ప్రతిదాడులు మాత్రమే చేశామని అమెరికా తేల్చి చెప్పింది. ఈ కాల్పులను చిన్న విషయంగా కొట్టిపారేసిన య స్ అధ్యక్షుడు ట్రంప్ ఆ తరువాత ఇరాన్‌కు గట్టి హెచ్చరిక చేశారు. చర్చలను మళ్లీ ప్రారంభించకపోతే ఇలాంటి దాడులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

**ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై దృష్టి సారించాలి**
**విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి**
**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**






**గద్వాల బ్యూరో మే 9( నినాదం)**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, సెన్సస్, విద్యా వారోత్సవాలపై శనివారం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ అన్ని జిల్లాలలో వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ కు ఒక్క రోజే మిగిలి ఉండడంతో ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో పది లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వీరంతా స్వీయ గణన చేసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సిఎస్ కోరారు.

గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ 66 శాతం పూర్తయిందని, పంచాయతీ కార్యదర్శుల సహకారం కూడా తీసుకొని, ప్రక్రియ వేగవంతం చేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యా వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. సెన్సస్ పై సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లకు గూగుల్ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి స్వామి కుమార్, వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, మార్కెటింగ్ శాఖ అధికారి పుష్పమ్మ, డిఆర్డిఓ ముషాహిదా బేగం, డిఐఈఓ హృదయ రాజ్, డీఈవో విజయలక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

# సొంత గూటికి బిఆర్ఎస్ నాయకులు



**ఆర్మూర్, మే 9 ( నినాదం):**

బాల్కొండ నియోజకవర్గం ఏరుగట్ల మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సున్నాపు అంజయ్య, జిట్ట ఓయిన రాజు, నాయుడు పోశెట్టి, పలువురు నాయకులు మండల కేంద్రమైన వేల్పూర్ గ్రామంలో గల మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో తిరిగి బి.ఆర్.ఎస్. పార్టీ లోకి తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే స్వాగతించి వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా బి.ఆర్.ఎస్. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కల్లబొల్లి హామీలు ఇచ్చి, ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో, ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజా వ్యతిరేకత ఏర్పడుతుందని, టీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందించిన పథకాలు, మళ్లీ టిఆర్ఎస్ కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని వారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల ఆరు నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీలను ఇప్పటివరకు పూర్తి స్థాయిలో అమలు చేయలేదని, అమీల అమల్లో పూర్తిగా విఫలమైందన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఇచ్చిన ఏ ఒక్క హామీని సరిగా అమలు చేయలేదని, కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కనీస గుర్తింపు లేదని, టిఆర్ఎస్ పార్టీలోనే కార్యకర్తలకు సమాన స్థాయి గుర్తింపు ఉందని వారన్నారు. తెలంగాణలో ప్రజలు కేసీఆర్ పరిపాలననే శ్రీరామరక్ష అంటూ, మళ్లీ కేసీఆర్ ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలు టిఆర్ఎస్ పార్టీ పాలనను కోరుకుంటున్నారని వారన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఏ. రాజాపూర్ణానందం, ఎయిర్ గట్ల గ్రామ సర్పంచ్ ఉపేందర్, మాజీ జెడ్పిటిసి గుల్లే రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ డాక్టర్ మధు, పార్టీ అధ్యక్షులు దేవుని నరసయ్య, సొసైటీ చైర్మన్ బర్మా నరసయ్య, ప్రభాకర్, కూస లింబాద్రి, పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, తదితరులు, పాల్గొన్నారు.

# "మన సమాచారం.. మన భవిష్యత్తు"

**జనగణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**
**జనగణన దేశాభివృద్ధికి పునాది..**
**స్వీయ గణనలో నమోదు చేసుకోండి**
**మే 10 వరకు స్వీయ గణన.. ప్రజలకు అదనపు కలెక్టర్ పిలుపు**








**ఖమ్మం ప్రతినిధి, మే 9 (నినాదం )**

జనగణన ప్రతి పౌరుడి బాధ్యత అని, సమగ్ర సమాచారం దేశాభి వృద్ధికి పునాది అవుతుందని జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా జనగణన స్వీయ గణన ప్రక్రియలో పాల్గొని దేశ అభివృద్ధికి తోడ్పడాల ని ఆయన పిలుపునిచ్చారు. జనగణనపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు శనివారం ఉదయం ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం నుంచి జడ్పీ సెంటర్ వరకు నిర్వహించిన అవగాహన వాక్ ర్యాలీని అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులు, విద్యార్థులు, వాకర్స్, యువత, ప్రజలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, జనగణన ప్రక్రియలో భాగంగా స్వీయ గణన విధానం ఈ నెల 10వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా నమోదు చేసుకొని స్వీయ గణన శాతాన్ని పెంచాలని కోరారు. మే 11వ తేదీ నుంచి ఇంటింటి గణన ప్రక్రియ ప్రారంభం కానుందని, ఇందులో భాగంగా అధికారులు ప్రజల నుంచి పూర్తి వివరాలు సేకరిస్తారని చెప్పారు.ఇంటింటి గణనలో మొత్తం 34 ప్రశ్నలు ఉంటాయని, ప్రజలు అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుం దని స్పష్టం చేశారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా అన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వాలని సూచించారు. జనగణనకు సంబంధించిన సందేహాల నివృత్తి కోసం ప్రత్యేక సహాయ కేంద్రం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జిల్లాలోని ప్రతి కుటుంబం సరైన వివరాలు అందించి జనగణన విజయవంతానికి సహకరించాలని కోరిన ఆయన, జనగణన ద్వారా ప్రభుత్వానికి ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితు లపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందని చెప్పారు. తద్వారా సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుందని వివరించారు.దేశ అభివృద్ధికి ఖచ్చితమైన గణాంకాలు ఎంతో అవసరమని, "మన సమాచారం – మన భవిష్యత్తు" అనే భావనతో ప్రతి ఒక్కరూ జనగణన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీవో శ్రీనివాస్, డీఎస్వో సునీల్ రెడ్డి, ఎస్ఓ శ్రీధర్, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనిల్ కుమార్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు, యువత, విద్యార్థులు, నగర ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అయిజలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

**ఒకే రోజులో 4 అగ్ని ప్రమాదాలు**
**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.రామచంద్రారెడ్డి**



**గద్వాల ప్రతినిధి మే 9 (నినాదం)**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీలో 10 వార్డు దుర్గ నగర్ లో దుర్గమ్మ గుడి సమీపంలో ఉన్న చొప్పదొడ్లలో ఉన్న గడ్డివాములు ప్రమాదం శాతు అగ్ని ప్రమాదం సంభవించి దాదాపు పది గడ్డివాములు దగ్ధమయ్యాయి ఈ సమాచారం తెలుసుకున్న వెంటనే బిజెపి నాయకులు యస్.రామచంద్రారెడ్డి అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనంతరం రామ చంద్రారెడ్డి మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుండి అయిజ లో ఫైర్ స్టేషన్ కావాలి కావాలి అని ఎన్ని సార్లు మొరపెట్టుకున్న గతం లో కాని ఇప్పుడు కాని రాష్ట్ర లో ఉన్న అధికార పార్టీలు కనీసం పట్టించుకోవడం లేదు కేవలం శనివారం అయిజ మండలం మున్సిపల్లో అయిజ గడ్డివాములు, కేశవరం, మస్తాన్ తోట, రేణుక ధాబా వెనకాల అగ్ని ప్రమాదాలు జరిగాయి నాలుగు అగ్ని ప్రమాదాలు జరిగాయి. మొన్న కు మొన్న అయిజ లో డ్రిప్ ఫ్యాక్టరీ ప్రమాదంకు గురియై 4 కోట్లు రూపాయల విలువైన ఆస్తి అగ్నికి అహుతి అయినది. ప్రభుత్వం వెంటనే అయిజ కు ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయండి లేని పక్షం లో పెద్ద ఎత్తున పోరాటం చేసి సాధించుకుంటాం అని వారు అన్నారు. ఈ కార్యక్రమం అయిజ పట్టణం & మండల అధ్యక్షులు తెలుగు నర్సింహా, గోపాలకృష్ణ,లక్ష్మణ్ గౌడ్, రాజశేఖర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యతోనే ఉన్నత భవిష్యత్

**వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ**

**వైరా మే 9 (నినాదం)**

విద్యతోనే ఉన్నత భవిష్యత్తు సాధ్యమవుతుందని, వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, వైరా ఎస్సై పుప్పాల రామారావు లు పేర్కొన్నారు. బ్రాహ్మణపల్లి అగ్రహారం, ఎనిమిదవ వార్డులో పదో తరగతి పరీక్షల్లో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ అవార్డు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన సభలో వారు మాట్లాడారు. వార్డు కౌన్సిలర్ చిలకా కోటయ్య అధ్యక్షతన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్ విగ్రహాల ప్రాంగణంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఉదారపు రిత్విక( 550), బాలమర్తి జెస్సికా( 548 ), నల్లగట్ల కమల్( 540), కోలా అఖిల్, షేక్ రహీం, మోదుగు రేఖ (529), ఎండ్రాతి వెంకటేశ్వర్లు, ధనుశ్రీ లతోపాటు పలువురు విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు.



# మహారాణా ప్రతాప్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తా...

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా**

**నిజామాబాద్ ప్రతినిధి, మే 9 ( నినాదం) :**

నగరంలో మహారాణా ప్రతాప్ సింగ్ విగ్రహ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. మహారాణా ప్రతాప్ జయంతిని పురస్కరించుకొని నగరంలోని ఎల్లమ్మ గుట్ట చౌరస్తాలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చరిత్రలో అత్యంత ధైర్యవంతుడైన రాజుల్లో మహారాణా ప్రతాప్ ఒకరన్నారు. స్వామిమాణం దేశభక్తి ధైర్య సాహసాలకు ఆయన ప్రత్యేకగా నిలిచారని కొనియాడారు. మొగల్ చక్రవర్తి అక్బర్ ఆధిపత్యానికి ఎదురుగా నిలిచి స్వాతంత్రం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని తెలిపారు. ప్రధానంగా హల్దీ గాటి యుద్ధం ఆయన వీరత్వానికి గుర్తుగా నిలిచిందన్నారు. ఆయన రాజ్యం కోల్పోయిన ఆత్మగౌరవాన్ని కోల్పోలేదన్నారు. శత్రువులకు తలవంచకుండా అడవుల్లో కష్టాలు పడుతూ జీవించాలని గుర్తు చేశారు. నేటి యువత మహారాణా ప్రతాప్ సింగ్ జీవిత నాదశంగా తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొందిల రజక సంఘం అధ్యక్షుడు బొందిల బలరాం సింగ్, కార్యదర్శి నరేష్ సింగ్ కోశాధికారి మహేందర్ సింగ్, ఉపాధ్యక్షుడు తులసిరాం, విజయ్ సింగ్, రమేష్ సింగ్, లఖన్ సింగ్, బీజేపీ కార్పొరేటర్ మఠం పవన్, బంటు ప్రీతి ప్రవీణ్, నాయకులు పవన్ ముందడ, గోసేవ ప్రతినిధి ధాత్రిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మోర్తాడ్ మండల మాజీ ఎంపీపీ కన్నుమూత

**కన్నీటి వీడుకోలుతో అంత్యక్రియలు**



**ఆర్మూర్, మే 9 ( నినాదం):**

తెలంగాణ ఉద్యమకారులు, ప్రజా నాయకుడు కీర్తిశేషులు దివంగత నాయకుడు కనకం నారాయణ సతీమణి మోర్తాడ్ మండల మాజీ ఎంపీపీ కనకం గంగా నర్సు శనివారం ఉదయం వేకువ జామున కన్నుమూశారు. మాజీ ఎంపీపీ కనకం గంగ నర్సు అంత్యక్రియలకు వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, గ్రామ ప్రజలు అంత్యక్రియలకు విచ్చేసి కన్నీటి వీడ్కోలు మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు మాజీ ఎంపీపీ కనకం గంగ నర్సు కుటుంబ సభ్యులను ఓదార్చి,పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

# ప్రమాదవశాత్తు రైతుల చొప్పదొడ్లు దగ్ధం

**గద్వాల ప్రతినిధి మే 9 (నినాదం)**



జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీలో 10 వార్డు దుర్గ నగర్ లో దుర్గమ్మ గుడి సమీపంలో ఉన్న రైతుల చొప్పదొడ్లలోని గడ్డివాములు అగ్ని ప్రమాదం సంభవించి సుమారు పది గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఇట్టి సమాచారాన్ని అందుకున్న మున్సిపాలిటీ కౌన్సిలర్లు మాస్టర్ షేక్షావలి ఆచారి, మద్దిలేటి, చిన్ని కృష్ణ, అక్కడికి చేరుకొని ఫైర్ ఇంజన్ కి సమాచారం ఇచ్చారు అలాగే మున్సిపాలిటీ నుండి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి త్వరగా ప్రమాదాన్ని అరికట్టేలా చేశారు. ఈ ప్రమాదం స్థలానికి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాంబశివుడు, మాల మల్లికార్జున్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కురువ వీరేష్ చేరుకొని మంటలను అదుపు చేసేందుకు వారి ప్రయత్నాలు చేశారు.

# హజ్రత్ సయ్యద్ షాహ్ అలీ పహెల్వాన్ ఉరుసు మహోత్సవాలు ప్రారంభం



**గద్వాల ప్రతినిధి మే 9 (నినాదం)**

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్లో ప్రసిద్ధిగాంచిన హజ్రత్ సయ్యద్ షాహ్ అలీ పహెల్వాన్ 775వ ఉరుసు ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. మే 9 నుంచి 11వ తేదీ వరకు 3 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఉరుసు కార్యక్రమాలు గంధోత్సవం – మే 9, 2026 శనివారం సమయం రాత్రి 7:00 గంటలకు ప్రారంభం ఉరుసు ముంతజిమ్ షాహ్ అహ్మద్ ఉవైస్ బియాబాని రిఫాయి అల్ ఖాద్రీ గారి ఇంటి నుంచి గంధం ఊరేగింపు ప్రారంభమై తహసీల్ ఆఫీస్ మీదుగా సయ్యద్ షాహ్ సలీమ్ ఉద్దీన్ అహ్మద్ ఖాద్రీ సాహెబ్ గంధం తీసుకొని సర్ ముబారక్ దర్గాకు చేరుకుంటారు తిరిగి తహసీల్ ఆఫీస్ నుంచి ధడ్ ముబారక్ దర్గాకు గంధం చేరుతుంది అలాగే చిన్న కిస్తీలు – మే 10, 2026 ఆదివారం సమయం సాయంత్రం 5:30 గంటలకు హజ్రత్ సయ్యద్ షాహ్ వలి ర.అ. గంధం షాహ్ అహ్మద్ ఉవైస్ బియాబాని రిఫాయి అల్ ఖాద్రీ ఇంటి నుంచి బయలుదేరుతుంది ప్రత్యేక ఖవ్వాలి రాత్రి 9:00 గంటలకు ఉంటుంది. పెద్ద కిస్తీలు – మే 11, 2026 సోమవారం సమయం సాయంత్రం 3:30 గంటలకు పెద్ద కిస్తీల ఊరేగింపు జరుగుతుంది. మతసామరస్యానికి ప్రతీకగా జరిగే ఈ ఉరుసుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రానున్నారు. ఉరుసు సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్గా కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు.

# వీహెచ్ ఆమరణదీక్షకు ఆకుల గాంధీ సంఘీభావం

**ఖమ్మం, మే 09(నినాదం ):**



దేశ జనాభాలో 60 శాతానికిపైగా ఉన్న ఓబీసీల న్యాయమైన హక్కుల సాధనకు పీసీసీ మాజీ అధ్యక్షులు, రాజ్య సభ మాజీ సభ్యులు, ప్రభుత్వ సలహాదారు వీ.హనుమంతరావు చేపట్టిన ఆమరణ దీక్షకు మున్నూరుకాపు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ సంఘీభావం ప్రకటించారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 80 ఏళ్లు కావస్తున్నా కూడా జనాభాలో అత్యధిక శాతంగా వెనుకబడిన కులాలకు రాజ్యాధికారంలో సరైన వాటా దక్కకపోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు.తెలంగాణలో తాము అధికారంలోకి వస్తే బీసీ నాయకుడిని ముఖ్యమంత్రిని చేస్తామని బీజేపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో,విద్యా,ఉద్యోగ రంగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ వాగ్దానాలు చేయడాన్ని ఈ సందర్భంగా గాంధీ గుర్తు చేశారు.ఎన్నికల సమయంలో,ఆ తర్వాత అధికారంలోకి వచ్చాక బీసీలకు ఇచ్చిన హామీ మేరకు కేంద్ర ప్రభుత్వంపై మరింత వత్తిడి తీసుకువచ్చి పార్లమెంటులో చట్టం చేయడం ద్వారా రిజర్వేషన్లను 42 శాతానికి పెరిగేందుకు చిత్తశుద్ధితో కృషి సల్పాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గాంధీ విజ్ఞప్తి చేశారు.జనగణనలో కులగణనను కూడా భాగంగా చేర్చాలని, తద్వారా చట్టసభల్లో ఓబీసీలతో పాటుగా మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని గాంధీ డిమాండ్ చేశారు.అలాగే, కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్నారు.రాజ్యాధికారంలో ఓబీసీలకు సముచిత వాటా కోసం, న్యాయమైన హక్కుల సాధనకు వీహెచ్ చేపట్టిన ఆమరణ దీక్షకు ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన, మైనారిటీ వర్గాల ప్రజలు తమ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని, సంఘీభావం తెలపాలని ఆకుల గాంధీ కోరారు.

# కాంగ్రెస్ పార్టీ రఘునాధపాలెం మండల అధ్యక్షులుగా కేలోతు దేవ్ సింగ్ నియమకం

**ఖమ్మం, మే 9 (నినాదం ):**



రఘునాధపాలెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కేలోతు దేవి సింగ్ నియమిస్తూ రాష్ట్ర పార్టీ నిర్ణయం తీసుకుంది. శనివారం తెలంగాణ రాష్ట్ర పీసీసీ సభ్యులు మహేష్ కుమార్ గౌడ్, మండల అధ్యక్షులు జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలో భాగంగా రఘునాథ పాలెం మండల అధ్యక్షులుగా కేలోత్ దేవ్ సింగ్ నాయక్ ని నియమించి నియమక పత్రాన్ని వారికి అందజేశారు. గత ప్రభుత్వంలో ఇర్లపూడి కాంగ్రెస్ పార్టీ సర్పంచుగా విధులు నిర్వహించి గ్రామపంచాయతీలో అనేక సేవలు అందించి ప్రజల మనసును గెలుచుకున్నారు. ప్రస్తుతం ఆయన భార్య ఇర్లపూడి సర్పంచ్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నా మీద నమ్మకంతో పార్టీ అధ్యక్షునిగా నియమించినందుకు బాధ్యతయుతంగా పనిచేస్తానని ఆయన అన్నారు. నన్ను మండల అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరావు, మరియు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగేందర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# మరో ప్రాణం బలి తీసుకునే లోపు చర్యలు తీసుకోండి

**బోనకల్ చౌరస్తాలో డివైడర్--రింగు ఏర్పాటు చేయాలని**
**బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ డిమాండ్**

**మధిర, మే 9 (నినాదం):**



బోనకల్ గ్రామంలో ప్రమాదాలకు కేంద్రంగా మారుతున్న ప్రధాన చౌరస్తాలో వెంటనే రింగు లేదా డివైడర్ ఏర్పాటు చేయాలని బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ అధికారులను డిమాండ్ చేశారు. శనివారం ఉదయం బోనకల్ గ్రామ నివాసి నిమ్మ తోట సొందు బోనకల్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి స్టేట్ బ్యాంకు వైపు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన డీసీఎం వాహనం అతను ప్రయాణిస్తున్న టీవీఎస్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సొందుతలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనతో గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోనకల్ ప్రధాన చౌరస్తాలో రోజురోజుకు ట్రాఫిక్ పెరుగుతున్నప్పటికీ రోడ్డు భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగిన సంబంధిత అధికారులు స్పందించకపోవడం బాధాకరమని మండిపడుతున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ ఇంకా ఎన్ని ప్రమాదాలు జరిగితే అధికారులు మేల్కొంటారు...? ప్రజల ప్రాణాలు కాపాడేందుకు వెంటనే రింగు లేదా డివైడర్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలి అని డిమాండ్ చేశారు. ప్రజల కోసం ప్రమాదకరంగా మారిన ఈ చౌరస్తాలో శాశ్వత పరిష్కారం కోసం అధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలుకోరుతున్నారు.

# ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుండి వచ్చే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి

**నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య**

**నిజామాబాద్ ప్రతినిధి, మే 9 (నినాదం)**



ఇతర రాష్ట్రాలు, జిల్లాలు లేదా ప్రాంతాల నుండి వచ్చి పని చేసుకునే కార్మికులు, అద్దెదారులు, ఉద్యోగుల విషయంలో గృహ యజమానులు, వ్యాపార సంస్థలు, కాంట్రాక్టర్లు, యాజమాన్యాలు తప్పనిసరిగా అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సూచించారు. వారి పూర్తి వివరాలు సేకరించడం ద్వారా భద్రతా పరమైన సమస్యలను ముందుగానే గుర్తించి నివారించవచ్చని శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి కోసం వచ్చే వ్యక్తుల పేరు, శాశ్వత చిరునామా, ఆధార్ కార్డు ప్రతులు, మొబైల్ నంబర్లు, కుటుంబ వివరాలు, పని చేసే స్థలం, వచ్చిన తేదీ వంటి వివరాలను తప్పనిసరిగా నమోదు చేసి తమ వద్ద భద్రపరచుకోవాలని సూచించారు. అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్లో కూడా వారి వివరాలు నమోదు చేయించాలని తెలిపారు. అద్దె ఇళ్లలో నివసించే వారు, నిర్మాణ పనుల్లో పనిచేసే కార్మికులు, హోటళ్లు, లాడ్జీలు, పరిశ్రమలు, ఇతర వ్యాపార సంస్థల్లో పనిచేసే వారి వివరాలను యాజమాన్యాలు నిరంతరం పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, వారి ప్రవర్తనలో మార్పులు గమనించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం తెలిసినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల అప్రమత్తతతోనే నేరాలను అరికట్టడం, శాంతిభద్రతలను కాపాడడం సులభమవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించి సమాజ భద్రతకు తోడ్పడాలని అన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉద్యోగ , అవకాశాలు కల్పించడమే లక్ష్యం

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**



**కల్వకుర్తి మే 9 (నినాదం)**

కల్వకుర్తి నియోజకవర్గంలో ఉన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు తుక్కుగూడలో ఉన్న ప్రముఖ అంతర్జాతీయ ఎలక్ట్రానిక్ కంపెనీ ఫాక్స్ కాన్ లో నిరుద్యోగ యువతకు నిర్వహించిన ఇంటర్వ్యూ కార్యక్రమంలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొని ఇంటర్వ్యూ ల ప్రక్రియను పరిశీలించారుఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రతి కుటుంబంలో ఒకరూ ప్రభుత్వ, ప్రైవేట్ ఏదో ఒక దాంట్లో ఉద్యోగస్తులై ఉండాలనేదే తన సంకల్పమని తెలిపారు. అందుకోసం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శిక్షణా కార్యక్రమాలు, జాబ్ మేళాలు, నిరుద్యోగులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు ఇంటర్వ్యూ కు కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాలు వెల్దండ నుండి 6 గురు, ఆమనగల్ నుండి 9 గురు, కడ్తల్ నుండి 2, కల్వకుర్తి నుండి ఇద్దరు మొత్తం 19 మంది ఇంటర్వ్యూ కు హాజరయ్యారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధుల బృందం, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్ పాల్గొన్నారు

## తమిళనాట

# భేతాళ ప్రశ్నలు ?

సంపాదకీయం

తమిళనాట ప్రతిష్ఠంభనకు చిన్న పార్టీలు ఆడుతున్న పెద్ద డ్రామాలు కలుషిత రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. లెఫ్ట్ పార్టీలు, ముస్లిం పార్టీ సహా ఇతర చిన్న పార్టీలు ఒకటి అరా సీటు సంపాదించినా బేరాలాడుతున్న తీరు వల్ల తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటుకు ఆటంకాలు వస్తున్నాయి. ఈ క్రమంలో తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై ఇంకా సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. టీవీకేకు ఏఎంఎంకే మద్దతు ఇచ్చినట్లు వస్తున్న వార్తలను ఆ పార్టీ అధినేత దినకరన్ తోసిపుచ్చారు. తమ ఎమ్మెల్యే మద్దతిస్తున్నారని పేర్కొంటూ గవర్నర్‌కు టీవీకే నేతలు జిరాక్స్ కాపీ ఇచ్చినట్లు తెలుస్తోందన్నారు. అయితే, అసలైన లేఖ ఎక్కడుందో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అది లభిస్తేనే వాస్తవాలు బయటపడతా యన్నారు. లేఖపై తాను సంతకం చేస్తున్నట్లు టీవీకే విడుదల చేసిన వీడియోపై ఏఎంఎంకే ఎమ్మెల్యే కామరాజ్ స్పందిస్తూ.. అది కృత్రిమ మేధ ఆధారిత వీడియో అని ఆరోపించారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమంటూ టీవీకే అధినేత విజయ్ వరుసగా గవర్నర్‌ను కలుస్తుండటంపై డీఎంకే విమర్శలు గుప్పించింది. గవర్నర్‌ను సంప్రదించడానికి ముందే ఇతర పార్టీల మద్దతును కూడగట్టుకోవాలని సూచించింది. ఎమ్మెల్యేల మద్దతు లేకుండా గవర్నర్‌కు లేఖ ఎందుకు ఇవ్వడమని ప్రశ్నించింది. రాష్ట్రంలో నెలకొన్న అసాధారణ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో.. అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ నేతృత్వంలోని టీవీకేను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించా లని పీఎంకే వ్యవస్థాపకుడు రామదాస్ పేర్కొన్నారు. ప్రజాతీర్పును ప్రతిఒక్కరూ గౌరవించాల్సిందే నన్నారు. ప్రభుత్వ ఏర్పాటు పక్రియలో జాప్యం చేయొద్దని.. వెంటనే దీనిని పూర్తిచేయాలంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ మెజార్టీ లేక ప్రభుత్వ ఏర్పాటులో ఇబ్బందులు పడుతున్న విజయ్.. త్వరలో వీసీకే చీఫ్‌ను కలవనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈసందర్భంగా తమకు మద్దతు ఇవ్వాలని కోరనున్నట్లు తెలిసింది. ప్రజా తీర్పును వమ్ము చేసేలా చిన్న పార్టీలు దోబూచులాడు తున్నాయి. మద్దతుకు ఓకే చెప్పి గవర్నర్‌కు లేఖలు అందించడంలో వెనక్కి తగ్గాయి. దీంతో మెజార్టీ విషయంలో గవర్నర్ సంతృప్తి చెందక పోవడంతో ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియలో ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. 234 స్థానాలున్న అసెంబ్లీలో 108 స్థానాల్లో విజయ దుందుభి మోగించింది. అధికారం పొందడానికి అవసరమైన మేజిక్ ఫిగర్ కు కేవలం పదకొండు స్థానాలు తక్కువ. ఇటువంటి పరిస్థితిలో అసెంబ్లీలో అతి పెద్ద పార్టీగా అవతరించిన పార్టీ నేతను ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించడం అన్నది కేవలం ఆనవాయితీ మాత్రమే. గతంలో అటల్ బిహారి వాజ్‌పేయి నాయకత్వంలోని బిజెపికి నాటి రాష్ట్రపతి అటువంటి అవకాశం ఇవ్వడం 13 రోజుల్లో మెజారిటీ రుజువు చేసుకోలేక వాజ్‌పేయి రాజీనామా చేసిన విషయం అందరికీ తెలిసిందే! దేశంలోనూ వివిధ రాష్ట్రాల్లోనూ ఇటువంటి దృష్టాంతాలెన్నో జరిగాయి. అయితే ప్రమాణానాఇకి ముందు మద్దతు లేఖలతో సం÷-యా బలం తెలుసుకోవడం గవర్నర్ విధి. దీనిని ఎవ్వరూ తప్పు పట్టాల్సిన పనిలేదు. తమిళనాడు ప్రజలు విజయ్ నాయకత్వంలోని టివికె పార్టీకి మె.ఆర్టీ సీట్లు కట్టబెట్టారు. ఫలితాలు వచ్చిన మరునాడే అతి పెద్ద పార్టీగా వచ్చిన తమను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజయ్ చేసిన విజ్ఞప్తిని గవర్నర్ ఆహ్వానిస్తూనే మద్దతు లేఖలు కోరారు. అయితే విజయ్ కూడా ఈ విషయంలో కొంత డ్రామాలు ఆడుతున్నట్లుగా ఉంది. అయిదు సీట్లున్న కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉన్నప్పటికీ మెజారిటీకి అవసరమైన మద్దతు మాత్రం చూపడం లేదు. తమిళ ప్రజా తీర్పును అమలు చేయడానికి తమిళనాట గందరగోళం సృష్టించాలని తమిళ పార్టీలే యత్నిస్తున్నాయి. వామపక్షాలు బేషరతు నిర్ణయం తీసుకొని టివికె ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ప్రకటించాయి. విసికె మద్దతు లేఖ ఇస్తే మేజిక్ ఫిగర్ చేరుకోవడం సులువవుతుంది. ఈ క్రమంలో తమిళనాడులో నూతన ప్రభుత్వం ఏర్పాటుపై ఇంకా ప్రతిష్టంభన వీడలేదు. విజయ్ నేతృత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ.. ప్రభుత్వ ఏర్పాటుకు సతమతమవుతోంది. చిన్న పార్టీల మద్దతు ఉందని చెబుతూ మూడు రోజుల్లో మూడుసార్లు గవర్నర్‌ను కలిసినా.. ప్రభుత్వ ఏర్పాటుకు ఆ రాష్ట్ర లోక్‌భవన్ నుంచి పిలుపు రాకపోవడం తమిళ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠగా మారింది. ఇదంతా కేవలం మద్దతు ఇస్తున్న పార్టీల లేఖలు సమకూర్చడంలో చేస్తున్న జాప్యంగానే చయేడాలి.

# అమ్మంటే ఒక అపురూప కావ్యం?

విశ్వసృష్టిలో వెలకట్టలేని ఏకైక పదం 'అమ్మ'. కాలాలు మారినా, నాగరికతలు రూపాంతరం చెందినా, విలువల సమీకరణలు తారుమారైనా నిశ్చలంగా, నిస్వార్థంగా నిలిచే శక్తి మాతృత్వం. తల్లి అంటే కేవలం ఒక వ్యక్తి కాదు, అది ఒక అనుభూతి, ఒక అపురూప కావ్యం, సకల జీవకోటికి ప్రాణాధారమైన అమృతధార. భారతీయ సంస్కృతిలో "మాతృదేవోభవ" అని తల్లిని దైవం కంటే ముందే స్మరించుకోవడం మన సంస్కారానికి నిదర్శనం. ఆధునిక కాలంలో ప్రతి ఏటా మే నెల రెండో ఆదివారాన్ని 'అంతర్జాతీయ మాతృ దినోత్సవం'గా జరుపుకోవడం ఒక ఆనవాయితీగా మారింది. 2026 సంవత్సరంలో మే 10వ తేదీన ఈ వేడుకను జరుపుకుంటున్న తరుణంలో, మాతృత్వంలోని అంతరార్థాన్ని, దాని చారిత్రక పరిణామక్రమాన్ని, సమాజ నిర్మాణంలో తల్లి పోషిస్తున్న అసాధారణ పాత్రను లోతుగా విశ్లేషించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.?మాతృ దినోత్సవ మూలాలు ప్రాచీన గ్రీకు, రోమన్ సంస్కృతులలో కనిపిస్తాయి. గ్రీకులు దేవతల తల్లి అయిన 'రియా'ను ఆరాధించేవారు. అయితే, ప్రస్తుత రూపంలో ఉన్న మాతృ దినోత్సవానికి పునాదులు అమెరికాలో పడ్డాయి. సామాజిక కార్యకర్త ఆన్ రీవ్స్ జార్విస్ తల్లుల ఆరోగ్యం, పారిశుధ్యం కోసం 'మదర్స్ డే వర్క్ క్లబ్స్' నిర్వహించేవారు. ఆమె మరణానంతరం, తన తల్లి చేసిన సేవలకు గుర్తింపుగా, తల్లులందరినీ గౌరవించేందుకు ఒక రోజు ఉండాలని ఆమె కుమార్తె అన్నా జార్విస్ అవిశ్రాంతంగా పోరాడారు. ఈ ఉద్యమ ఫలితంగా 1908లో వెస్ట్ వర్జీనియాలోని గ్రాఫ్టన్‌లోని ఆండ్రూస్ మెథడిస్ట్ చర్చిలో మొదటిసారిగా అధికారికంగా ఈ కార్యక్రమం జరిగింది. అన్నా జార్విస్ పట్టుదల చూసి, 1914లో అప్పటి అమెరికా అధ్యక్షుడు వుడ్రో విల్సన్ మే రెండో ఆదివారాన్ని జాతీయ సెలవు దినంగా ప్రకటించారు. నేడు ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా దేశాలు ఈ సంప్రదాయాన్ని అనుసరిస్తూ, మాతృత్వాన్ని పండగలా జరుపుకుంటున్నాయి.?భారతీయ ఇతిహాసాలు, పురాణాల పుటల్లో తల్లికి లభించిన స్థానం అనన్యం. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అన్న రామాయణ శ్లోకం తల్లిని,



మాతృభూమిని స్వర్గం కంటే మిన్నగా ప్రబోధించింది. కౌసల్య శిక్షణలో రాముడు మర్యాదా పురుషోత్తముడిగా, జిజాబాయి మార్గదర్శకత్వంలో శివాజీ ఛత్రపతిగా, భువనేశ్వరీ దేవి ఆశీస్సులతో నరేంద్రుడు స్వామి వివేకానందగా రూపుదిద్దుకున్నారు. అంటే, ఒక వ్యక్తిని సమాజానికి ఉపయోగపడే శక్తిగా మలచడంలో తల్లి కేవలం జన్మనిచ్చే దానితో ఆగిపోకుండా, సంస్కార నిర్మాణకర్తగా నిలుస్తోంది. దేశాన్ని 'భారతమాత'గా, భాషను 'తెలుగు తల్లి'గా, ప్రకృతిని 'ప్రకృతి మాత'గా భావించే విశాల దృక్పథం భారతీయులది. ఈ క్రమంలో మాతృ దినోత్సవం మనకు పరాయి దేశపు పండుగ కాదు, మన రక్తంలోనే ఉన్న గౌరవ భావానికి ఒక నూతన అభివ్యక్తి మాత్రమే.?గణాంకాల పరంగా చూస్తే, ప్రపంచ జనాభాలో సగం ఉన్న మహిళల్లో మెజారిటీ తల్లులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా మహిళల పనిగంటల్లో అత్యధిక భాగం 'అన్‌పెయిడ్ కేర్ వర్క్' (ప్రతిఫలం లేని సేవలు) కిందకే వస్తుంది. భారతదేశంలో 2021 అంచనాల ప్రకారం 67 కోట్లకు పైగా ఉన్న మహిళా జనాభాలో, గ్రామీణ ప్రాంతాల్లోని తల్లులు వ్యవసాయంలో 30-40 శాతం శ్రమశక్తిని అందిస్తున్నారు. అయినప్పటికీ, ఇంటి పనిని ఆర్థిక కోణంలో ఎవరూ లెక్కించడం లేదు. ఒక గృహిణి చేసే వంట, ఇంటి నిర్వహణ, శిశు సంరక్షణ, వృద్ధుల సేవలను గనుక జీడీపీలో చేర్చితే, దేశ ఆర్థిక ముఖచిత్రమే మారిపోతుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. తల్లి చేసే సేవకు వెల కట్టలేము కానీ, ఆమె శ్రమకు సామాజిక గుర్తింపు కల్పించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత.?ఆధునిక శాస్త్ర విజ్ఞానం సైతం తల్లి ప్రాధాన్యతను గట్టిగా సమర్థిస్తోంది. శిశువు గర్భంలో ఉన్న సమయం నుండి తల్లి మానసిక స్థితి శిశువు మెదడు అభివృద్ధిపై ప్రభావం చూపుతుందని 'ఎపిజెనెటిక్స్' వంటి శాస్త్రాలు నిరూపించాయి. శిశువు పుట్టిన తర్వాత లభించే తల్లి స్పర్శ, పాలు పిల్లల్లో రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని, సామాజిక భద్రతా భావాన్ని కలిగిస్తాయి. కరోనా వంటి విపత్కర కాలంలో తల్లుల పాత్ర మరింత స్పష్టమైంది. ఆసుపత్రుల్లో నర్సులుగా, డాక్టర్లుగా సేవలు అందిస్తూనే, ఇళ్లలో కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని కాపాడటంలో తల్లులు కవచంలా నిలిచారు. క్లిష్ట పరిస్థితుల్లో సైతం నిబ్బరంగా ఉంటూ ధైర్యాన్ని నూరిపోసే మాతృశక్తి సమాజానికి వెన్నెముక వంటిది.?సాంకేతికత పెరిగిన నేటి యుగంలో సంబంధాల మధ్య దూరం పెరుగుతోంది. అణుకుటుంబాల సంస్కృతి, జీవనపోరాటంలో భాగంగా దూర ప్రాంతాలకు వలస వెళ్లడం వల్ల తల్లిదండ్రుల పట్ల బాధ్యత తగ్గుతోందనే ఆవేదన వ్యక్తమవుతోంది. పెరుగుతున్న వృద్ధాశ్రమాల సంఖ్య సామాజిక విలువల పతనానికి అద్దం పడుతోంది. మాతృ దినోత్సవం అంటే కేవలం సోషల్ మీడియాలో ఫోటోలు పెట్టడం లేదా ఖరీదైన బహుమతులు ఇవ్వడం మాత్రమే కాదు. వృద్ధాప్యంలో ఉన్న తల్లికి తోడుగా నిలవడం, ఆమె ఆరోగ్య అవసరాలను గుర్తించడం, కనీసం రోజుకు కొద్దిసేపు ప్రేమగా మాట్లాడటం అసలైన గౌరవం. తల్లికి కావాల్సింది ఆర్థిక సంపద కంటే, తన సంతానం నుండి లభించే ఆత్మీయత మాత్రమే.ప్రస్తుతం తల్లుల బాధ్యతలు ద్విగుణీకృతమయ్యాయి. ఒకవైపు ఉద్యోగాల్లో రాణిస్తూ, మరోవైపు ఇంటి బాధ్యతలను భుజాన వేసుకుంటున్న 'వర్కింగ్ మదర్స్' సంఖ్య నేడు ప్రపంచవ్యాప్తంగా 47 శాతానికి చేరింది. అయితే వీరికి కార్యాలయాల్లో తగిన మౌలిక సదుపాయాలు, ప్రసూతి సెలవులు, సమాన వేతనం వంటి అంశాల్లో ఇంకా వివక్ష ఎదురవుతూనే ఉంది. మాతృత్వాన్ని గౌరవించడమంటే, ఆ తల్లికి సామాజికంగా, ఆర్థికంగా భద్రత కల్పించడం కూడా. మహిళా చైతన్యం పెరిగిన ఈ రోజుల్లో, తల్లులకు నిర్ణయాధికారాల్లో భాగస్వామ్యం కల్పించడం, వారి అభిరుచులకు ప్రాధాన్యత ఇవ్వడం నాగరిక సమాజ లక్షణం.తెలుగు సాహిత్యంలోనూ తల్లి ప్రేమ అజరామరంగా వర్ణించబడింది. "అమ్మంటే అంతులేని అనురాగం" అని సినీ కవులు మొదలుకొని, ఆధునిక కవుల వరకు ప్రతి ఒక్కరూ అమ్మ మనసును అక్షరబద్ధం చేశారు. గ్రామీణ జానపదాల్లో "అమ్మా అని పలికినంతలోన అఖిల పాపాలు హరియించు" అనే సందేశం మాతృత్వం పట్ల ఉన్న భక్తిని చాటుతుంది. సాహిత్యం, కళలు, విజ్ఞానం---రంగం ఏదైనా తల్లి లేనిదే మనుగడ లేదనేది సత్యం.ముగింపుగా చెప్పాలంటే, మాతృ దినోత్సవం ఒక రోజు వేడుక కాదు, అది జీవితాంతం కొనసాగాల్సిన ఒక కృతజ్ఞతా యజ్ఞం. తల్లి త్యాగానికి మనం ఇచ్చే ప్రతిఫలం ఏదీ ఆమె రుణాన్ని తీర్చలేదు. కానీ, ఆమెను గౌరవించే సంస్కృతిని తదుపరి తరాలకు అందించడం మన బాధ్యత. 'అమ్మ' అనే అక్షరం లోని మధురిమను, ఆమె చూపించే నిస్వార్థ ప్రేమను గుర్తిస్తూ, సమాజంలో తల్లితనపు విలువను పెంపొందించుకోవాలి. ప్రతి తల్లి ముఖంలో చిరునవ్వు కనిపించినప్పుడే ఆ సమాజం సుసంపన్నంగా, సుభిక్షంగా ఉంటుంది. మాతృమూర్తులందరికీ వందనం చేయడం అంటే, సాక్షాత్తూ సృష్టికర్తకు నమస్కరించడమే. ఈ 2026 మాతృ దినోత్సవం ప్రతి ఇంట్లో ప్రేమానురాగాల మేలుకొలుపు కావాలని ఆకాంక్షిద్దాం.

-రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్
9440595494

# అతిపెద్ద పార్టీ అయినా ప్రతిపక్షంలో ఉన్నాం

### పార్లమెంటులో ప్రమోద్ మహాజన్ ఛతురోక్తులు



**న్యూఢిల్లీ, మే 9(ఆర్ఎన్ఎ):** భారత రాజకీయాలపై దివంగత భాజపా నేత ప్రమోద్ మహాజన్ గతంలో ఓసారి పార్లమెంటులో చేసిన ప్రసంగం ప్రస్తుతం వైరల్‌గా మారింది. వాజ్‌పేయ్ 13 రోజుల పాలన అనంతరం మెజార్టీ నిరూపించుకోవ డంలో విఫలం కావడంతో విపక్షంలో కూర్చుకున్నారు. 1997 ఏప్రిల్ 11న లోక్‌సభలో విశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా నాటి భాజపా నేత ప్రమోద్ మహాజన్ ప్రసంగిస్తూ సంకీర్ణ రాజకీయాల్లో వైరుధ్యాల గురించి తనదైన శైలిలో వివరించారు. ఈ క్రమంలో గతంలో పార్లమెంటరీ బృందం చైనా పర్యటన విషయాలను ఉదహరించారు. భారత ప్రజాస్వామ్యం ఎలా పనిచేస్తుందనే విషయాన్ని తెలుసుకునేందుకు చైనా ప్రతినిధులు ఆసక్తి చూపించారని.. వారికి ఆ విషయాలను ప్రమోద్ వివరించిన తీరు సభలో హాస్యం పండించింది. నేను ప్రమోద్ మహాజన్. లోక్‌సభ సభ్యుడిని. అతిపెద్ద రాజకీయ పార్టీకి చెందిన నేతను. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నాను. కాంగ్రెస్ ఎంపీ శ్రీబల్లవ్ పాణిగ్రహిని చూపిస్తూ.. ఆయన రెండో అతిపెద్ద పార్టీకి చెందిన వారు. ప్రభుత్వం బయట ఉన్నప్పటికీ.. ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారు. సీపీఎం నేత ఎంఏ బేబీని పరిచయం చేస్తూ.. ఆయన మూడో అతిపెద్ద పార్టీకి చెందినవారు. కూటమిలో ఉన్నారు కానీ ప్రభుత్వంలో లేరు. చివరగా.. రమాకాంత్ ఖలాప్ (నాడు మహారాష్ట్రవాదీ గోమంతక్ పార్టీ నేత). ఆ పార్టీకి చెందిన ఒకే ఒక సభ్యుడు. కానీ, ప్రభుత్వంలో ఉన్నారు' అని ప్రమోద్ మహాజన్ వివరించడంతో సభలో నవ్వులు విరిశాయి. 1996 లోక్‌సభ ఎన్నికల్లో అతిపెద్ద రాజకీయ పార్టీగా భాజపా అవతరించినప్పటికీ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ రాలేదు. ప్రభుత్వ ఏర్పాటుకు నాటి రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ ఆహ్వానించడంతో వాజ్‌పేయీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అయితే, ప్రాంతీయ పార్టీల మద్దతు లభిస్తుందని ఆయన భావించిన ప్పటికీ.. వారు తోడుగా నిలవకపోవడంతో ప్రభుత్వం కూలిపోయింది. దీంతో 13 రోజులకే వాజ్‌పేయీ రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత భాజపా, కాంగ్రెస్ మినహా మిగతా పార్టీలు యునైటెడ్ ఫ్రంట్‌గా ఏర్పాటవగా దేవెగౌడ ప్రధాని అయ్యారు. ఆ సమయంలో కాంగ్రెస్ ఈ ప్రభుత్వానికి వెలుపలి నుంచి మద్దతు ప్రకటించింది.

# గడ్డి మందు వలన మరణిస్తున్న రైతులు

**-సైంటిస్టులకు అంతు చిక్కని**
**పారా క్యాట్, మందు మర్మం**
**-రోడ్డున పడుతున్న కుటుంబాలు**



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రలలోనే కాకుండా ఇతర రాష్ట్ర లలో కూడ వ్యవసాయం పొలాలలో పంటలు పండించేందుకు రైతులకు అడ్డంకి ఇబ్బందిగా ఉన్న గడ్డి (గరక)ని తొలగించేందుకు పారాక్వాట్, డైక్లో రైడ్ లను వాడుతున్న రసాయనిక మందును పూర్తి స్థాయి లో నిషేధించాలని దేశావ్యాప్తంగా నిరసనగా వ్యక్తం అవుతున్నది ఇది ప్రధానంగ రైతుల పొలం గట్టు మీద ఉండే గడ్డిని నివారించేందుకు అలాగే, ఈ మధ్య పొలంలో కలుపులు తీయకుండనే పారా క్యాట్, డైక్లోరై డ్ రసాయనిక గడ్డి మందును రైతులు అధిక స్థాయిలో వాడుతున్నరు . దీనివల్ల రైతులకు ఉపయోగం అయిన ప్పటికీ ప్రమాదం కూడా తీవ్ర స్థాయిలో ఉంటున్నది .ప్యారా క్యాట్' వ్యవసాయంలో ఉపయోగించే ఒక శక్తివంతమైన రసాయన మందు ఇది కలుపు మొక్క లను నాశనం చేయడానికి విస్తృతంగా ఉపయోగించబ డుతుంది దీనిని పిచికారీ చేసిన పది నిమిషాలలో పచ్చటి మొక్కల భాగాలు త్వరగా నల్లగా మారి కుళ్ళుగా మారుతుంది. పంటలలో, తోటలలో ప్లాంటేషన్లలో కలుపు మొక్కల నివారణకుఉపయోగిస్తారు. హానికం మైన ఈ లిక్విడ్ ఇది మనుషులకు, జంతువులకు అత్యంత విషపూరితమైనది. దీనిని పొరపాటున తీసుకోవడం లేదా చర్మం ద్వారా పీల్చుకోవడం ప్రాణాంతకం వాడేటప్పుడు తగిన జాగ్రత్తలు మాస్కు గ్లౌజులు,తీసుకోవడం తప్పనిసరి పారాక్వాట్ వాడకం దాని అధిక విషపూరిత స్వభావం వల్ల కొన్ని రాష్ట్రశీ లలో నియంత్రించబ డింది.? విషపూరితమైన గడ్డి మందులను వరి పొలాల చుట్టు వ్యవసాయంలో అధికంగా వాడకం వల్ల వరి పొలాల పై పొలాలలో స్ప్రే చేస్తున్న మనుష్యులకు అనేక రకాల ఇబ్బందు లు,వ్యాధులు సోకుతున్నాయి. చుట్టు ప్రాంతాలకు వ్యాప్తించి రైతులకు కళ్ల వెంట నీరు,దురద, ముక్కుల ద్వారా, శ్వాసకోశ వ్యాదులు,కిడ్నీలు దెబ్బ తినడమే కాకుండా శరీరంపై దురద,దద్దులు. మంటలు వ్యాప్తిస్తు న్నయి, గట్టుమీద ఉన్న గడ్డి (గరక)తింటున్న పశువులు గేదెలు,సైతం పలు వ్యాధులు వ్యాప్తించి చనిపోతున్న యి,పంట పొలాలలో పని చేసే రైతులు సైతం ఈ మందు బారిన పడిన వారు ఆర్థికఇబ్బందు లతో,అవస్థలుపడుతు దగ్గు దమ్ములతో హాస్పిటల్ చుట్టు తిరుగుతు మరణించిన సంఘటనలు అలాగే గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండ ,పట్టణాలలో అప్పుల బాధలతో సైతం చిన్న చిన్న సమస్యలను తట్టుకోలేక ఆర్థికంగా మానసికంగా కృంగిపోతు గడ్డి మందు త్రాగి మరణించిన సంఘటనలు న్నయి.కుటుంబాల కలహా లు, మానసికంగ కుంగి పోతు చిన్న సమస్యలను సైతం తట్టుకోలేక తొందరగా చనిపోయే విధంగా గడ్డి మందు త్రాగి మరణిస్తున్న సంఘటనలు కోకొల్లలుగా ఉన్నయి ఏది ఏమైనప్పటికీ అప్పులు తెచ్చి పంటలకు పెట్టుబడి పెట్టినప్పటికి ప్రకృతి విసురుతున్న గాలుల కు, నష్టాలకు పంట చేతికి రాక అప్పుల బాధలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతులను బతికిం చెందుకు కుటింబికులు, బంధువులు నానతంటలు పడి హాస్పిటల్కు తరలించిప్పటికి పారా క్యాట్ గడ్డిమందు త్రాగిందని డాక్టర్లు తెలుసుకున్న తర్వాత బ్రతుకుతడని హామీ ఇవ్వలేమని చేతులు ఎత్తివేస్తునే వైద్యం అందించడం కోసం లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నరు ఏది ఏమైనాప్పటికి ప్రాణహానికి కలి గించే ప్రమాదకరమైన పారాక్వాట్, డైక్లో రైడ్ మరణా ంతక గడ్డి మం దును వెంటనే కేంద్ర ప్రభుత్వం స్థాయిలో నిర్మూలన చేపట్టాలని వ్యవ సాయ దారులు డాక్టర్లు బాధితులు కోరుతున్నరు..



-బాలసాని రాజయ్య.
సీనియర్ జర్నలిస్ట్
9866102315

## తమిళనాట

# కొనసాగుతున్న సందిగ్ధత

### విజయ్ తీరుపై డిఎంకె ఆగ్రహం



**చెన్నై, మే9(ఆర్ఎన్ఎ):**తమిళనాడులో కొత్త ప్రభు త్వం ఏర్పాటుపై ఇంకా సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమంటూ టీవీకే అధినేత విజయ్ వరుసగా గవర్నర్‌ను కలుస్తుం డటంపై డీఎంకే విమర్శలు గుప్పించింది. గవర్నర్‌ను సంప్రదించడానికి ముందే ఇతర పార్టీల మద్దతును కూడగట్టుకో వాలని సూచిం చింది. ఎమ్మెల్యేల మద్దతు లేకుండా గవర్నర్‌కు లేఖ ఎందుకు ఇవ్వడమని ప్రశ్నిం చింది. రాష్ట్రంలో నెలకొన్న అసాధారణ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో.. అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ నేతృత్వంలోని టీవీకేను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించాలని పీఎంకే వ్యవస్థాపకుడు రామదాస్ పేర్కొన్నారు. ప్రజాతీర్పును ప్రతిఒక్కరూ గౌరవించాల్సిందేనన్నారు. ప్రభుత్వ ఏర్పాటు పక్రియలో జాప్యం చేయొద్దని.. వెంటనే దీనిని పూర్తిచేయాలంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ మేజార్టీ లేక ప్రభుత్వ ఏర్పాటులో ఇబ్బందులుప డుతున్న విజయ్.. త్వరలో వీసీకే చీఫ్‌ను కలవ నున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈసందర్భంగా తమ కు మద్దతు ఇవ్వాలని కోరనున్నట్లు తెలిసింది. టీవీకే కు ఏఎంఎంకే మద్దతు ఇచ్చినట్లు వస్తున్న వార్తలను ఆ పార్టీ అధినేత దినకరన్ తోసిపుచ్చారు. తమ ఎమ్మెల్యే మద్దతిస్తున్నారని పేర్కొంటూ గవర్నర్‌కు టీవీకే నేతలు జిరాక్స్ కాపీ ఇచ్చినట్లు తెలుస్తోంద న్నారు. అయితే, అసలైన లేఖ ఎక్కడుందో బయట పెట్టాలని డిమాండ్ చేశారు. అది లభిస్తేనే వాస్త వాలు బయటపడతాయన్నారు. లేఖపై తాను సంతకం చేస్తున్నట్లు టీవీకే విడుదల చేసిన వీడియోపై ఏఎంఎంకే ఎమ్మెల్యే కామరాజ్ స్పందిస్తూ.. అది కృత్రిమ మేధ ఆధారిత వీడియో అని ఆరోపిం చారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై గవర్నర్‌కు ఫిర్యా దు చేశామన్నారు.

# శతాధిక నాటక రచయిత కొర్రపాటి



**మే 10...కొర్రపాటి గంగాధరరావు జయంతి**

సమాజంలో పేరుకు పోయిన చెడు భావజాలాన్ని నివారించే సాధనంగా నాటకాన్ని భావించి, నాటక రంగ అభివృద్ధికి విశేష కృషి సల్పారు కొర్రపాటి గంగాధరరావు. ఇందుకోసం నాటక సంస్థను స్థాపించి ఎందరో నటులను కళాకారులను తీర్చి దిద్దారు. నాటకోద్యమాన్ని నలు చెరుగులా విస్తరింప చేశారు. కొర్రపాటి గంగాధరరావు (మే 10, 1922 - జనవరి 26, 1986) నటులు, దర్శకులు, శతాధిక నాటక రచయిత. ఆయన 1922, మే 10న మచిలీపట్నంలో జన్మించారు. ఏలూరు, మద్రాసులో చదివారు. ఎల్.ఐ.ఎం. పరీక్షలో ఉత్తీర్ణులై వైద్యవృత్తిని చేపట్టి బాపట్లలో నివాసమున్నారు.తెలుగు నాటక సాహిత్యంలో వందకుపైగా నాటకాలు, నాటికలు రచించిన మొదటి రచయిత కొర్రపాటి. 1955-65 ప్రాంతంలో రంగస్థల ప్రదర్శనల అనుగుణమైన రచనలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా నాటకొద్యమాన్ని బలోపేతం చేయడంలో పూర్తి సమయాన్ని కేటాయించారు. కళావని అనే నాటక సంస్థ ద్వారా అనేకమంది యువ కళాకారులను నాటక రంగానికి పరిచయం చేశారు.ఆయన నాటకాలలో ఎన్నో ఉత్తమ రచనలుగా బహుమతులు అందుకున్నాయి. నాటక రంగాన్ని గురించి, నాటక ప్రదర్శన విధానాల గురించి అనేక వ్యాసాలను రచించి నాటక కళాభివృద్ధికి కృషిచేశారు. నాటకాన్ని ఒక పదునైన ఆయుధంగా సమాజంలోని చెడ్డ అలవాట్లపై ప్రయోగించాలని ఆయన ఏకైక ఆశయం. కళావని అనే నాటక సమాజాన్ని స్థాపించి, దానికి అధ్యక్షులుగా, దర్శకులుగా వ్యవహరించారు. కళాభారతి అనే సాంస్కృతిక సంస్థకు, బాపట్ల ఫిల్మ్‌క్లబ్ కు అధ్యక్షులుగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. లంబడోళ్ళ రాందాసు, బోధిశ్రీ, ధంసా, నాలుగు నాలుగు నలభై నాలుగు, స్వర్గసీమ, శాంతి తోరణం, నారీ స్వేర్ బ్రహ్మచారి, అమృత మధనం, లకుమాదేవి- కుమారగిరి, నవతా!మానవతా అనే నవలలు రచించారు. ఇవేకాక బ్రహ్మచారి పెళ్ళాం, యమలోకంలో సావిత్రి, పతి-పత్ని, వేగుచుక్క, డాక్టర్ గారి అమ్మాయి, సినిమా తారా, చేదుకో మల్లయ్య చేదుకో, ద్వి పాత్ర, పరకాయ ప్రవేశం, ఖబడ్డార్ ఖూనీకోర్ మొదలైన అముద్రిత నవలలు కూడా రచించారు.

-రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్
ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్
9440595494

# పశ్చిమ బెంగాల్‌లో బిజెపి విజయం చారిత్రాత్మకమైంది

ఎంతో ఆసక్తికరంగా, ఉత్కంఠగా జరిగిన పశ్చిమ బెంగాల్ ఎన్నికలలో ప్రజలు బిజెపిని ఆశీర్వదించారు. పశ్చిమ బెంగాల్ లో బిజెపి సాధించిన ఈ అద్భుతమైన విజయం భారతదేశ రాజకీయ చరిత్రలో చాలాకాలం గుర్తుండిపోతుంది. మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారం కోసం విశ్వ ప్రయత్నాలు చేసినప్పటికీ పశ్చిమ బెంగాల్ అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రజలు బిజెపికే పట్టం కట్టారు. 2014 వ సంవత్సరంలో కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలో కాంగ్రెస్ తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు క్రమక్రమంగా బలహీనపడుతూ వస్తున్నాయి. ఒక్కప్పుడు దేశ రాజకీయాలలో ఒక వెలుగు వెలిగిన కమ్యూనిస్టు పార్టీ నేడు దేశంలో ఉనికి ప్రశ్నార్థకంగా మారిపోయింది. కేరళంలో ఓటమితో కమ్యూనిస్టు పాలిత రాష్ట్రాల సంఖ్య సున్నాకు పరిమితమైంది. ఒరిస్సాలో అనేక సంవత్సరాల పాటు అధికారంలో కొనసాగిన నవీన్ పట్నాయక్ ను గద్దె దించి తొలిసారి ఆ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో అరవింద్ కేజ్రీవాల్ ను గద్దె దించి అధికారాన్ని కైవసం చేసుకుంది. తాజాగా పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ కోటను బద్దలు కొట్టి ఆ రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు




చేసింది.దేశ ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ప్రమాణస్వీకారం చేసిన తర్వాత నుండి క్రమక్రమంగా బిజెపి పాలిత రాష్ట్రాల సంఖ్య పెరుగుతూ వస్తుంది. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నందున రాష్ట్రాలలో కూడా బిజెపి ప్రభుత్వం వస్తేనే రెండు ప్రభుత్వాలు సమన్వయంతో కలిసి పనిచేస్తాయనే వాస్తవాన్ని ప్రజలు గ్రహించారు. అందుకే ప్రజలు డబుల్ ఇంజిన్ సర్కార్ కు మొగ్గు చూపుతున్నారనేది ఈ ఎన్నికల ఫలితాలతో స్పష్టమైంది. నాలుగు రాష్ట్రాలకు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి జరిగిన ఎన్నికలు తీవ్ర ఆసక్తిని రేకెత్తించగా అన్నింటికంటే మించి పశ్చిమ బెంగాల్ ఎన్నికలపైనే అందరి దృష్టి నెలకొన్నది. అధికారం కోసం నువ్వా - నేనా అన్నట్లు తృణమూల్ కాంగ్రెస్, భాజాపాల మధ్య జరిగిన ఓట్ల యుద్ధంలో ప్రజలు బిజెపికే జై కొట్టారు. ఒక్కప్పుడు కమ్యూనిస్టుల కంచుకోట అయిన పశ్చిమ బెంగాల్ లో మొదటి నుండి బిజెపి ప్రస్థానం అంత ఈజీగా జరగలేదు. 2011 లో జరిగిన ఎన్నికలలో సున్నాకే పరిమితమైన బిజెపి, 2016 లో 3 సీట్లను, 2021 ఎన్నికలలో 77 సీట్లను గెలుచుకోగా, 2026 లో 206 స్థానాలలో ఘనవిజయం సాధించి ఆ రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. తాజాగా పశ్చిమ బెంగాల్ విజయంతో బిజెపి పాలిత రాష్ట్రాల సంఖ్య 15 కు చేరుకోగా, ఎన్‌డిఏ పాలిత రాష్ట్రాల సంఖ్య 21 కి చేరుకుంది. ఒక్కప్పుడు ఉనికే లేని రాష్ట్రాలలో నేడు బీజేపీ అధికారంలో కొనసాగుతుందంటే అది సాధారణ విషయం కాదు. కేరళంలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారతీయ జనతా పార్టీ 3 స్థానాలను కైవసం చేసుకుంది. 2016 లో పశ్చిమ బెంగాల్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కూడా బీజేపీ 3 స్థానాలనే గెల్చుకోని నేడు ఏ విధంగా అయితే పశ్చిమ బెంగాల్ లో అధికారంలోకి వచ్చామో భవిష్యత్ లో కూడా పశ్చిమ బెంగాల్ మాదిరిగా కేరళంలో కూడా అధికారంలోకి వస్తామని ఈ ఎన్నికల ఫలితాలను చూస్తే అర్థం అవుతుంది. అస్సాంలో వరుసగా మూడవసారి భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం, పుదుచ్చేరిలో మరోసారి ఎన్‌డిఏ ప్రభుత్వం రావడం హర్షించదగ్గ విషయం. దాదాపు 12 సంవత్సరాల నుండి నరేం ద్రమోదీ ప్రభుత్వం అందిస్తున్న సమర్థవంతమైన పరిపాలనతో ఈ దేశం అభివృద్ధిలో మరోస్థాయికి చేరింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో భారత్ ముందువరుసలో ఉంది. నరేంద్రమోదీ అందిస్తున్న సమర్థవంతమైన నాయకత్వాన్ని దేశ ప్రజలతో పాటు ప్రపంచంలోని అనేక దేశాల నాయకులు ప్రశంసిస్తున్నారు.



కేతూరి శ్రీరామ్,
-ఎంఏ పొలిటికల్ సైన్స్,
ఉస్మానియా యూనివర్సిటీ.

# అమ్మ..



అమ్మ అనేది ఒక పదం కాదు... అది త్యాగం, ప్రేమ, ఆప్యాయతల మహాకావ్యం. ఆకాశం కంటే విశాలమైన హృదయంతో, తన స్వప్నాలను త్యాగం చేసి పిల్లల భవిష్యత్తును నిర్మించే దేవత అమ్మ. రామపురానికి చెందిన సుమతి లాంటి ఎందరో తల్లులు తమ కష్టాలను మట్టిలో కలిపి, పిల్లల విజయాలకు పునాదిగా నిలుస్తున్నారు. పిల్లల నవ్వులోనే తమ ప్రపంచాన్ని చూసే అమ్మల ఔన్నత్యాన్ని గుర్తు చేసుకునే రోజు మదర్స్ డే. తల్లి ప్రేమకు అవధులు లేవని, ఆమె త్యాగానికి కొలమానాలు లేవని ప్రతి మనసు గుర్తుచేసుకునే ప్రత్యేక సందర్భమిది.ఈ సందర్భంగా నినాదం పలువురు ప్రముఖ మహిళల్ని పలకరించగా,తల్లి ఘనత వ్యక్తీకరణలో తాము సైతం అంటూ వారూ వారి వారి అభిప్రాయాలు,అనుభూతులను ఈ విధంగా పంచుకున్నారు.

- ఇందిరా ప్రియదర్శిని (నినాదం బ్యూరో చీఫ్)

# ఉంటేనే బ్రహ్మకైనా జన్మ

## శైలజా రామయ్యర్, ఐఎఎస్



మాతృదినోత్సవం సంవత్సరంలో ఒక రోజు మాత్రమే అయినా, నా జీవితంలో మా అమ్మే అత్యంత ముఖ్యమైన వ్యక్తి. 1950లలోనే డబుల్ డిగ్రీ పూర్తి చేసి పట్టుదలతో ముందుకు సాగిన ఆమె నుంచి ధైర్యం, క్రమశిక్షణ, పరిపూర్ణత నేర్చుకున్నాను. తల్లులందరికీ నా హ్యాట్సాఫ్. మాతృత్వం దేవుడు ఇచ్చిన గొప్ప వరం. పిల్లలు కలిగిన తర్వాతే నిస్వార్థ ప్రేమ అర్థమవుతుంది. నా పిల్లల నుంచే నేను ఎన్నో విషయాలు నేర్చుకుంటుంటాను. అవసరమైతే 'సారీ' చెప్పడంలో తప్పు లేదని తెలుసుకున్నాను. తల్లులకు నా సందేశం—పిల్లలతో స్నేహితుల్లా ఉండండి. పిల్లలకు చెప్పేదేమిటంటే... తల్లిదండ్రులే నిజమైన స్ఫూర్తి. వారిని ప్రేమగా చూసుకోవడం మన బాధ్యత.

## బి. సుమతి, పోలీస్ కమిషనర్



మదర్స్ డే ప్రతి ఒక్కరికీ ప్రత్యేకమైన రోజు. ఎందుకంటే "అమ్మ" ప్రతి మనిషి హృదయంలో అమూల్యమైన స్థానం కలిగిన వ్యక్తి. ఈ రోజు మన భావాలను ప్రేమగా వ్యక్తపరచుకునే మంచి అవకాశం. ఈ కాలంలో ఉద్యోగం, మాతృత్వం సమతుల్యం చేయడం మహిళలకు పెద్ద సవాలు. పిల్లలకు ధైర్యం, నైతిక విలువలు నేర్పించే తల్లులు సమాజానికి అవసరం. మహిళకు మరో మహిళ నుంచి లభించే మద్దతు ఎంతో విలువైనది. నా ఇద్దరు కూతుళ్లతో నాకు ఎంతో ఆత్మీయ బంధం ఉంది. నిజానికి నేను వారికి గైడ్ కంటే, ఈ ఆధునిక ప్రపంచాన్ని అర్థం చేసుకోవడంలో వారే నాకు మార్గదర్శకులు. ప్రతి తల్లి ఒక "షీ–హీరో".

## సునీత ఉపద్రష్ట



నాకు ప్రతి రోజూ మదర్స్ డేనే. అమ్మ ప్రేమ, ఆప్యాయతను అర్థం చేసుకుంటే ప్రత్యేకంగా ఒక రోజు అవసరం లేదు. అమ్మగా ఎలా ఉండాలో ప్రకృతి సహజంగానే నేర్పిస్తుంది. నా పిల్లలే నా ప్రపంచం. వారి బాల్యం అందమైన జ్ఞాపకంగా ఉండాలని ఎప్పుడూ ప్రయత్నించాను. సినిమా ఇండస్ట్రీలో కొనసాగుతూ కూడా పిల్లల పెంపకాన్ని సమతుల్యం చేయగలిగాను. అందుకు దేవుడి దయతో పాటు మా అమ్మానాన్నల సపోర్ట్ కూడా ఉంది. తల్లిదండ్రులను చూసుకోవడం కనీస బాధ్యత. ఉన్నంతలో పంచుకుంటూ బాధ్యతగా జీవించడం ప్రతి తరానికి అవసరం.

## దీపికా రెడ్డి



మాతృదినోత్సవం మన జీవితానికి ప్రేమ, ప్రేరణ ఇచ్చే అమ్మ గొప్పతనాన్ని గుర్తు చేసే రోజు. తన కలలను పక్కన పెట్టి పిల్లల భవిష్యత్తు కోసం పోరాడేది అమ్మే. నా కవల పిల్లలు అభినవ్, శ్లోక నా బలం, నా ప్రేరణ. మా అమ్మ రాధికా రెడ్డి నుంచి మొదలైన నాట్య ప్రయాణం ఇప్పుడు నా కుమార్తె చేతుల్లో కొత్త వెలుగులు చూస్తోంది. కుటుంబం, నాట్య ప్రయాణం—ఈ రెండింటినీ సమతుల్యం చేయడమే నా జీవన మంత్రం. పిల్లలతో ప్రేమగా సమయం గడపండి. మంచి విలువలు నేర్పి బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దాలి.

## పద్మజా రెడ్డి



మదర్స్ డే నాకు ఎంతో భావోద్వేగభరితమైన రోజు. అమ్మ స్థానాన్ని ఎవ్వరూ భర్తీ చేయలేరు. ఎంత బిజీగా ఉన్నా అమ్మతో మాట్లాడకపోతే ఆ రోజు పూర్తయినట్టు అనిపించదు. మాతృత్వం త్యాగాలు, ప్రేమ, నిద్రలేని రాత్రులతో నిండిన భావన. కానీ బిడ్డ "అమ్మ" అని పిలిచినప్పుడు అన్నీ మరచిపోతాం. అమ్మతనం నన్ను మరింత బలమైన వ్యక్తిగా మార్చింది. ప్రతి తల్లికి నా సందేశం—మీ ప్రేమ ఈ ప్రపంచంలో అత్యంత పవిత్రమైన శక్తి. మీపై మీరు ఎప్పుడూ సందేహపడొద్దు.

## డా. అనగాని మంజుల



మదర్స్ డే మాతృత్వాన్ని గౌరవించే ప్రత్యేక సందర్భం. నా జీవితంలో నా కుమార్తె ఎప్పుడూ మొదటి స్థానంలో ఉంటుంది. ఆమె కోసం నా ప్రాక్టీస్‌ను తగ్గించుకున్న సందర్భాలూ ఉన్నాయి. కుటుంబం, కెరీర్ మధ్య సమతౌల్యం ఒక నిరంతర ప్రక్రియ. మంచి టీమ్, బాధ్యతల పంచకం తల్లిగా ఒత్తిడిని తగ్గిస్తాయి. ప్రతి తల్లికి నా సందేశం—ఇతరులతో పోల్చుకోవద్దు. గిల్ట్ లేకుండా తల్లితనాన్ని ఆస్వాదించండి.

## డాక్టర్ స్నేహ ప్రసాద్



కొన్నిసార్లు నేను తల్లినా, ఇంకా ఎవరికో కూతురునా అని నన్నే నేను ప్రశ్నించుకుంటాను. చివరకు అర్థమైంది—నేను రెండూ. నా కూతురు పుట్టిన తర్వాత నా జీవితం మారిపోయింది. ఆమె నవ్వు నా విజయం, ఆమె భయం నా బాధ్యత. అదే సమయంలో నా అంతరంగంలో ఇంకా ఓ కూతురు కూడా ఉంది. ఇది సంఘర్షణ కాదు... రెండు పాత్రల మధ్య అందమైన సమతుల్యత.

## రాశి



నా దృష్టిలో ప్రతి రోజూ మదర్స్ డేనే. తల్లి లేకపోతే మన ఉనికే ఉండదు. ఒక్కరోజు జరుపుకుంటే అమ్మ రుణం తీరిపోదు. నా జీవితంలో అత్యంత ప్రత్యేకమైన క్షణం నా బిడ్డ పుట్టిన సమయం. ఆ అనుభూతిని మాటల్లో చెప్పలేం. పిల్లలపై ప్రేమకు హద్దులు ఉండవు. బిడ్డను నేనే చూసుకోవాలనే ఉద్దేశంతో కెరీర్‌కు కొంత విరామం ఇచ్చాను. నా దృష్టిలో కనిపించే దేవత అమ్మే.

## పాయల్ రాజ్‌పుత్



నాకు ప్రతి రోజూ మాతృ దినోత్సవమే. మదర్స్ డే రోజున కుటుంబంతో కలిసి టైమ్ గడుపుతాం. అమ్మ ఎప్పుడూ "నిన్ను నువ్వు నమ్ముకో" అని చెప్పేది. ఆ మాటలు నాకు ఎప్పుడూ స్ఫూర్తి. వయసు పెరిగే కొద్దీ మా బంధం స్నేహంగా మారింది. ఇప్పటికీ అమ్మ భోజనం చేశావా అని గుర్తు చేస్తూనే ఉంటుంది. పిల్లలు ఉండి కూడా తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో ఉంచడం సరికాదు. వారి కనీస అవసరాలు చూసుకోవడం పిల్లల బాధ్యత.

## సన



తల్లి ప్రేమను మించినది ఈ ప్రపంచంలో లేదు. మా అమ్మను కోల్పోయి ఆరు సంవత్సరాలు అయినా ఆ బాధ నుంచి ఇంకా బయటపడలేకపోతున్నాను. నా పిల్లలను ధైర్యంగా పెంచాను. మార్కుల కంటే మంచి మనసు ముఖ్యమని నేర్పించాను. షూటింగ్స్‌తో బిజీగా ఉన్నా పిల్లల విషయంలో ఎప్పుడూ శ్రద్ధ తీసుకునేదాన్ని. ప్రతి తల్లిదండ్రికి కావాల్సింది పిల్లల ప్రేమ, సమయమే. అమ్మ ఉన్నప్పుడు మహారాణిలా చూసుకున్నాననే తృప్తి నాకు ఉంది.

## రహస్య గోర్కే



మదర్స్ డే నాకు ఎంతో భావోద్వేగభరితమైన రోజు. ఒకప్పుడు మా అమ్మకు శుభాకాంక్షలు చెప్పేదాన్ని. ఇప్పుడు "అమ్మ" అని పిలవబడటం నా జీవితానికి కొత్త అర్థం ఇచ్చింది. కెరీర్ ఎంత బిజీగా ఉన్నా నా బిడ్డ నా వెంట ఉండటం నాకు ఎంతో ముఖ్యం. నా బిడ్డ నాపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ నిలబెట్టుకోవాలని భావిస్తాను. ప్రతి తల్లికి నా సందేశం—బయటి సూచనల కంటే మీ మనసు, డాక్టర్ సలహానే వినండి. మీరు అద్భుతమైన తల్లులే.

## పూనమ్ కౌర్



మదర్స్ డే కేవలం వేడుక కాదు... మనలను బలమైన వ్యక్తులుగా తీర్చిదిద్దిన తల్లిని గౌరవించే రోజు. నాన్న మరణం తర్వాత అమ్మ ఎన్నో కష్టాలు పడి నన్ను పెంచింది. అలాంటి తల్లిని వృద్ధాప్యంలో ఒంటరిగా వదిలేయడం ఊహించలేను. వృద్ధులైన తల్లిదండ్రులు భారం కాదు. క్రమశిక్షణ, పోరాట పటిమ, ఆత్మగౌరవం—all నాకు అమ్మ నుంచే వచ్చాయి. ఇప్పుడు మా బంధం ఇద్దరు యోధుల్లా మారింది.

## రష్మీ



మదర్స్ డేను ప్రత్యేకంగా జరుపుకునే అలవాటు లేదు. కానీ అమ్మ పుట్టినరోజును మాత్రం ఘనంగా జరుపుకుంటాం. మా అమ్మతో నాకు అద్భుతమైన అనుబంధం ఉంది. ఆమెలోని ధైర్యం, సానుకూల దృక్పథం నాకు వచ్చాయి. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని ఆమె ఎప్పుడూ గుర్తు చేస్తుంటారు. ప్రపంచంలో అమ్మకు ఇవ్వగలిగే గొప్ప బహుమతి "సమయం" మాత్రమే.

## చాందినీ భగవాన్నని



నాదృష్టిలో ప్రతి రోజూ మదర్స్ డేనే. మదర్స్ డే రోజున మాత్రం మా అమ్మ ఏ పని చేయకుండా రాణిలా విశ్రాంతి తీసుకునేలా చూస్తాను. మా అమ్మ నాకు నేర్పిన గొప్ప విషయం వినయం. "ఎంత పెద్ద స్థాయికి వెళ్లినా ఒదిగి ఉండాలి" అని ఆమె ఎప్పుడూ చెబుతుంది. తల్లిదండ్రులను చూసుకోవడం బాధ్యత మాత్రమే కాదు, మన కర్తవ్యం కూడా.

## హారిక అలేఖ్య



మదర్స్ డే నాకు ఒక రోజు కాదు... నేను, మా అమ్మ ప్రతిరోజూ మదర్స్ డే చేసుకుంటాం. తల్లి ప్రేమ మాటల్లో చెప్పలేనిది. ఈసారి మా అమ్మ కోరుకున్న గిఫ్ట్ కూడా ప్రత్యేకమే—"నువ్వు షూటింగ్‌లో బిజీగా ఉంటే చాలు బిడ్డా" అని చెప్పింది. తల్లి ప్రేమ అంత నిస్వార్థమైనది. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం బాధాకరం. వారిని ప్రేమగా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.

**మాతృదినోత్సవ శుభాకాంక్షలు**




# ఎస్‌బీఐ త్రైమాసిక లాభంలో 6% వృద్ధి

### డివిడెండు రూ.17.35




స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), 2025–26 మార్చి త్రైమాసికంలో రూ.19,684 కోట్ల స్టాండలోన్ నికర లాభాన్ని నమోదు చేసింది. 2024–25 ఇదే కాల లాభం రూ.18,643 కోట్లతో పోలిస్తే ఇది 6% అధికం. నికర వడ్డీ మార్జిన్(ఎన్ఐఎమ్)తో పాటు ట్రెజరీ ఆదాయం తగ్గడం వల్లే లాభం పరిమితమైంది. ఏకీకృత ప్రాతిపదికన లాభం రూ.19,600.46 కోట్ల నుంచి రూ.19,648.87 కోట్లకు పెరిగింది. డిసెంబరు త్రైమాసికంలోని రూ.21,317 కోట్లతో పోలిస్తే ఇది తక్కువే. బ్యాంకు మొత్తం ఆదాయం రూ.1,43,876 కోట్ల నుంచి రూ.1,40,412 కోట్లకు పరిమితమైంది. ఇందులో వడ్డీ ఆదాయం రూ.1,19,666 కోట్ల నుంచి రూ.1,23,098 కోట్లకు పెరిగింది.

### రుణ వృద్ధి లక్ష్యం కొనసాగింపు

పశ్చిమాసియా ఉద్రిక్తతల వంటి సవాళ్లు ఎదురవుతున్నా 2026–27 రుణ వృద్ధి లక్ష్యాన్ని 13–15% వద్దే కొనసాగిస్తున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. నికర వడ్డీ మార్జిన్ లక్ష్యాన్ని 3 శాతంగా పెట్టుకున్నామన్నారు. ఇరాన్ ఉద్రిక్తతలు 6 నెలలకు మించి కొనసాగితే స్థూల ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతుందనీ వివరించారు. అత్యవసర రుణ హామీ పథకం కింద రూ.80,000 కోట్ల వరకు రుణాలిచ్చేందుకు సిద్ధంగా ఉన్నా, అనిశ్చితి కారణంగా ఎక్కువ మంది రుణ స్వీకర్తలు ముందుకు రాకపోవచ్చని ఆయన అంచనా వేశారు.

### పూర్తి ఆర్థిక సంవత్సరంలో

2025–26లో స్టాండలోన్ పద్ధతిన నికర లాభం రూ.80,032 కోట్లకు చేరుకుంది. 2024–25 లాభం రూ.70,901 కోట్ల కంటే ఇది 13% ఎక్కువ. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.17.35 డివిడెండును బ్యాంకు బోర్డు ప్రకటించింది. రికార్డు తేదీ మే 16.

### తగ్గిన మొండి బకాయిలు

మార్చి చివరకు స్థూల నిరర్థక ఆస్తులు(జీఎన్‌పీఏలు) మొత్తం రుణాల్లో 1.49 శాతంగా ఉన్నాయి. 2025 మార్చి ఆఖరుకు ఇవి 1.82 శాతంగా ఉన్నాయి. నికర ఎన్‌పీఏలు 0.47% నుంచి 0.39 శాతానికి దిగివచ్చాయి.

# సూచీలకు నష్టాలు



పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు మళ్లీ పెరగడంతో, ఇంధన సరఫరాకు ఆటంకాలు ఏర్పడొచ్చనే ఆందోళనల వల్ల దేశీయ సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలకు తోడు విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కొనసాగడం సెంటిమెంటును బలహీనపర్చింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 71 పైసలు పెరిగి 93.51 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 1% పెరిగి 101.01 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.51 లక్షల కోట్లు తగ్గి రూ.473.46 లక్షల కోట్ల (5.01 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

### ఆద్యంతం నష్టాల్లోనే..

ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 77,631.94 పాయింట్ల వద్ద నష్టాల్లో (క్రితం ముగింపు 77,844.52) ఆరంభమైంది. అదే ధోరణిలో స్వల్ప శ్రేణికి పరిమితమై కదలాడింది. ఒక దశలో 77,146.43 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి దిగివచ్చింది. చివరకు 516.33 పాయింట్ల నష్టంతో 77,328.19 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 150.50 పాయింట్లు కోల్పోయి 24,176.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,126.65 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని, 24,253.80 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 414.69 పాయింట్లు, నిఫ్టీ 178.60 పాయింట్లు చొప్పున పెరిగాయి.

### సగానికి పైగా నష్టాల్లో..

సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో సగానికి పైగా కంపెనీల షేర్లు నష్టాల్లో ముగిశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.84%, బజాజ్ ఫైనాన్స్ 1.8%, యాక్సిస్ బ్యాంక్ 1.78%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.62%, ఎల్‌అండ్‌టీ 1.22%, మహీంద్రా అండ్ మహీంద్రా 1.22%, టాటా స్టీల్ 1.2% నష్టపోయాయి. టైటన్ 4.76%, ఏషియన్ పెయింట్స్ 2.8%, అదానీ పోర్ట్స్ 1.58%, ఇన్ఫోసిస్ 1.44% చొప్పున పెరిగాయి.

### టైటన్ కళకళ.. ఎస్‌బీఐ డీలా

జనవరి– మార్చి త్రైమాసిక ఫలితాల ప్రభావంతో బీఎస్ఈలో ఎస్‌బీఐ షేరు 6.62% నష్టపోయి రూ.1,019.55 వద్ద ముగిసింది. ఇక టైటాన్ షేరు 4.76% పెరిగి రూ.4,513.40 వద్ద ముగిసింది.

### ఆన్ఈఎంఐ టెక్ షేర్లు శుభారంభం

డిజిటల్ రుణాల ప్లాట్‌ఫామ్ 'కిష్త్'ను నిర్వహిస్తున్న ఆన్ఈఎంఐ టెక్నాలజీ సొల్యూషన్స్ లిమిటెడ్ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదైన రోజే రాణించాయి. ఇష్యూ ధర రూ.171 కాగా, శుక్రవారం బీఎస్ఈలో ఈ షేరు 11.69% అధికంగా రూ.191 వద్ద నమోదైంది. ఆ తర్వాత 32.95% వరకు పెరిగి రూ.227.35 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 21.87% లాభంతో రూ.208.40 వద్ద ముగిసింది.



# అనిల్ అంబానీకి షాక్

### రిలయన్స్ కార్యాలయాల్లో సీబీఐ సోదాలు

ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన కార్యాలయాల్లో సీబీఐ సోదాలు నిర్వహిస్తోంది. అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ కంపెనీలైన రిలయన్స్ టెలికాం లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లపై నమోదైన కేసులకు సంబంధించి ఈ సోదాలు జరిపినట్లు తెలుస్తోంది. బ్యాంక్ మోసం కేసు లో ముంబయిలోని ఆయనకు సంబంధించిన 17 ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించినట్లు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) శనివారం తెలిపింది. కంపెనీల డైరెక్టర్ల నివాసాలు మధ్యవర్తిత్వం వహించిన సంస్థల కార్యాలయాల్లోనూ సోదాలు జరుపుతున్నట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు. ఒకే చిరునామా నుంచి పలు మధ్యవర్తి కంపెనీలు పనిచేస్తున్నట్లు గుర్తించామని.. దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. వేల కోట్ల రూపాయల మోసాలకు పాల్పడినట్లు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసీ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్‌పై ఇప్పటికే ఏడు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే సీబీఐ ఇప్పటికే పలుమార్లు అనిల్ అంబానీ కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది.

# విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట

**తెల్లాపూర్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొన్న శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**





**పటాన్చెరు, మే9 (నినాదం) :** సమాజ నిర్మాణంలో విశ్వబ్రాహ్మణుల సేవలు అత్యంత ప్రశంసనీ యమని.. వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం తెల్లాపూర్ డివిజన్ పరిధిలో గల శ్రీ శ్రీ శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సన్మానించారు.

# కార్మికుల పక్షపాతిగా.. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిలిచింది

**సరైన ధరలు లేకపోవడంతో సెంట్రింగ్ కార్మికుల అవస్థలు**

**మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి**



**జవహర్ నగర్, మే9 (నినాదం):** కార్మికుల పక్షపాతిగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిలిచిందని ప్రజా పాలనలో కార్మికులకు పనులు దొరకక పోవడంతో పూట గడవ డం కష్టమవు తుందని సెంట్రింగ్ కార్మికులు రోడ్ల మీదకి వచ్చే రోజులు వస్తున్నాయని సరైన ధరలు పెంచి ఆదుకోవాలని తెలం గాణ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి డిమాండ్ చేశారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లోని బాలాజీ నగర్ సెంట్రింగ్ కార్మికులకు సరైన ధరలు చెల్లించాలని కోరుతూ మాజీ మేయర్ మేకల కావ్య యువ జన విభాగం అధ్యక్షుడు భార్గవరామ్ ఆధ్వర్యం లో శనివారం ఎమ్మెల్యే మల్లారెడ్డి సమక్షంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తున్నాయని వారి బాధలను పట్టించుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈనెల 16 నుండి సమ్మె చేస్తా మని కార్మికులు తెలిపారు. కార్మికులు తమ డిమాండ్లను వినతి పత్రంలో వివరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ కార్మికులు పాల్గొన్నారు.

# రెండోవార్డు అభివృద్ధికి నిధులు కేటాయించండి

**ముఖ్యమంత్రికి వినపత్రం అందజేసిన కౌన్సిలర్ ఆర్.వాణిశ్రీ**



**కొడంగల్, మే 9(నినాదం) :** కొడంగల్ మున్సిపల్ రెండో వార్డు అభివృద్ధి కి నిధులు కేటాయిం చాలని వార్డు కౌన్సిలర్ ఆర్. వాణిశ్రీ యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం కొడంగల్ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థా పన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్య మంత్రి ని కలిసి వినతిపత్రం అందజేశారు. గాడిబాయి శివాల యం అభివృద్ధి, బండల ఎల్లమ్మ దేవాలయం నుండి తెలంగ్ వాడి ,కేజిబివి పాఠశాల మీదుగా గౌరారం వరకు కొత్తగా నిర్మిస్తున్న రోడ్డుకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, బండల ఎల్లమ్మ దేవాలయం, అయ్యప్ప స్వామి దేవాలయం అభివృద్ధి, యాదవ కమ్యూనిటి భవన నిర్మాణం వంటి తదితర అంశాలను వినతిపత్రం లో పేర్కొన్నారు.

# హెచ్ఎండీఏ పరిధిలో.. క్రైస్తవులకు స్మశాన వాటిక స్థలాలను కేటాయించాలి..




**హైదరాబాద్ ప్రతినిధి, మే9 (నినాదం) :** క్రైస్తవుల కు హెచ్ఎండీఏ పరిధిలో స్మశాన వాటిక స్థలాలను ప్రభుత్వం కేటాయించాలని డాక్టర్ రివెండర్ సీహెచ్. షాలేం శరత్ , జనరల్ సెక్రటరీ రివెండర్ ఎస్. రాజకుమార్ లు అన్నారు. ఈ మేరకు శనివారం కేడీ కాలనీ లో కార్వాన్ నియోజకవర్గం పాస్టర్స్ ఫెలోషిప్ తరపున ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ.. రాష్ట్రం లో క్రైస్తవ సమాజశీ ఎప్పుడు కాంగ్రెస్ పార్టీ కి మద్దతు ఇస్తూ వస్తుందన్నారు. క్రైస్తవ సమాజం కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించిందని పేర్కొన్నారు. కాగా క్రిస్తవ సంఘము తరపున హెచ్ఎండీఏ పరిధిలో నలు దిక్కులా పదేసి ఎకరాల స్థలం స్మశాన వాటికల కోసం కేటాయించాలన్నారు. నగరంలో క్రైస్తవ స్మశాన వాటికలు నిండి పోవడం తో క్రైస్తవులు చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమం లో వైస్ ప్రెసిడెంట్ రివెండర్ ఎన్. వి. సొలొమోను రాజ్, జాయింట్ సెక్రటరీ పి. తిమోతి, పాస్టర్ రివెండర్ ఎస్. దీపక్ రావు తదితరులు పాల్గొన్నారు.

# బేగం బజార్ మార్కెట్లలో ఉచిత పార్కింగ్ స్టాండ్లు పెట్టాలి

**గూడ్స్ ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ)గోషామహల్ అధ్యక్షులు బి. సత్యనారాయణ డిప్యూటీ మున్సిపల్ కమీషనర్‌కు వినతి**

**హైదరాబాద్ ప్రతినిధి, మే9 (నినాదం) :** బేగం బజార్ మార్కెట్లలో వాహనదారులకు ఉచిత పార్కింగ్ స్టాండ్లు ఏర్పాటు చేసి వినియోగధారుల ఇబ్బందులు పరిష్కరించాలని గూడ్స్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ ( సీఐటీయూ ) గోషామహల్ జోన్ అధ్యక్షులు బొజ్జ. సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆయన నేతృత్వంలో సీఐటీయూ జోన్ సీనియర్ నాయకులు పి. నాగేశ్వర్, ఎల్ కోటయ్య తదితరులతో కలిసి జీహెచ్ఎంసీ గోషామహల్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ ఉమాప్రకాష్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బేగం బజార్ కు వివిధ రకాల సరుకు కొనుగోలు చేయడానికి 2,3,4 చక్రాల వాహనాలపై వచ్చి వెళ్లే వారి వాహనాలు పార్కింగ్ చేయడానికి జీహెచ్ఎంసీ అధికారులు 99 రోజుల ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఉచిత పార్కింగ్ షెడ్లు నిర్మించాలన్నారు. తద్వారా మార్కెట్లో ట్రాఫిక్ రద్దీ నియంత్రించవచ్చన్నారు. పార్కింగ్ కు ఉంచాల్సిన సెల్లార్లలో సరుకులు నిల్వ చేసి వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బేగం బజార్ లోని ఫిష్ మార్కెట్ కు 2 వైపులా, వార్డ్ ఆఫీస్ దగ్గర, కొల్సవాడి, ఛర్తన్ మార్కెట్, అజీజ్ ప్లాజా తదితర వ్యాపార ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ స్థలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొవాలన్నారు. ఆ స్థలాల్లో ఉచిత పార్కింగ్ స్థాండ్లు ఏర్పరిస్తే శాశ్వత పరిష్కారం లభిస్తదన్నారు. పార్కింగ్ స్థలం లేకపోవడంతో నిత్యం 3, 4 గూడ్స్ వాహన కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్లో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గూడ్స్ ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్స్ యూనియన్ ( సీఐటీయూ ) నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండ

# పార్టీ శ్రేణులు అప్రమత్తతో పనిచేయాలి

**బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**



**కుత్బుల్లాపూర్, మే9(నినాదం) :** బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 127-రంగారెడ్డి నగర్ డివిజన్ లోని ఆదర్శ్ నగర్ కమ్యూనిటీ హాల్ లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పై నిర్వహించిన రంగారెడ్డి నగర్ డివిజన్ కు చెందిన నాయకులు, బిఎల్ఏ ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద ముఖ్యఅతిథిగా హాజరై స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్( సర్) కార్యక్రమ నిర్వాహణ, పాటించ వలసిన నియమ, నిబంధనలు, సర్ కార్యక్రమ ప్రాముఖ్యత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. 2002 జనాభా ప్రాతిపదికన ఎన్నికల సంఘం అద్వర్యంలో నిర్వహిస్తున్న ఈ (సర్) కార్యక్రమంలో నిజమైన ఓటర్లను గుర్తించడంతో పాటు, డూప్లికేట్ ఓట్లు, పర్మినెంట్ మైగ్రేటెడ్ ఓట్లు, అసలు మనుషులు లేని పేర్లతో ఉన్న ఓట్లను గుర్తించడం, కుటుంబ సభ్యుల ఓట్లను మ్యాపింగ్ చేయడం, కొత్త ఓటర్లను చేర్చడం, ఏమైనా చేర్పులు, మార్పులు ఉంటే వాటిని సరిదిద్దేలా నాయకులు, బిఎల్ఏలు, సంక్షేమ సంఘాల నాయకులు, సీనియర్ సిటిజన్స్, యువత ఒక బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రజలను చైతన్య పరుస్తూ, అధికారులను సమన్వయ పరుచుకుంటూ సర్ కార్యక్రమాన్ని సద్వినియోగ పరుచుకోవాలనేలా పనిచేయాల న్నారు. ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా నాయకులు, బిఎల్ఏలు అప్రమత్తతో పనిచేయాలన్నారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో పార్టీ బలోపేతంకై చేపట్టనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం, నూతన కమిటీల నియామకంతో పాటు పార్టీ బలోపేతానికి మరింత ప్రజల్లోకి ఎలా దూసుకు వెళాలనే అంశాలపై చేపట్టవలసిన కార్యాచర ణను వివరించారు. మాజీ కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్, మాజీ డివిజన్ అధ్య క్షులు ఎర్వ శంకరయ్య, డివిజన్ ప్రధాన కార్య దర్శి సుధాకర్, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభను విజయవంతం చేయండి

**నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి**



**కీసర, మే9 (నినాదం) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 10 న నగరంలోని పేరెంట్ గ్రౌండ్ లో జరిగే భారీ సభకు విచేస్తునందున బిజెపి శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్ర రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున అమలు అవుతున్నాయ న్నారు. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభకు బిజెపి శ్రేణులు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

# ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**కోచ్ కరణం గణేష్ రవికుమార్**



**వెల్దుర్తి , మే9 (నినాదం) :** వేసవి ఉచిత శిక్షణ శిబిరంలో భాగంగా చేగుంట లోని దీప్తి విద్యాలయం హైస్కూల్ లో ఫెన్సింగ్ (కత్తియుద్ధం) లో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని కోచ్ కరణం గణేష్ రవికుమార్ తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొనే వారు క్రీడాకారులు,క్రీడాకారిణిలు ఆరు సంవత్సరాల పైబడిన వారి నుంచి 14 సంవత్సరాలలోపు బాల బాలికలు ఎవరైనా పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొన్న వాళ్ళకి మంచి క్రీడాకారులుగా, క్రీడాకారిణిలుగా తీర్చిదిద్ది జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పథకాలు సాధించేటట్టు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ శిక్షణ శిబిరం మే 2వ తేదీ నుండి జూన్ 7వ తేదీ వరకు ఉంటుందని ప్రతి రోజు 50 మంది క్రీడాకారులు,క్రీడాకారిణిలు పాల్గొంటున్నారని, ఈ శిక్షణ కార్యక్రమం ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల 30 నిమిషాల నుంచి ఏడు గంటల వరకు ఉంటుందని ఈ ఫెన్సింగ్ (కత్తియుద్ధం) క్రీడకు సంబంధించి ఉమ్మడి మెదక్ జిల్లాలో చేగుంటలో మాత్రమే ఉన్నదని ప్రతి ఒక్కరు ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు సంతోష్, నిశాంత్ పాల్గొన్నారు

# నిమ్జ్ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**మౌలిక సదుపాయాలు, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు కాంట్రాక్టర్‌కి ఆదేశాలు**

**నిమ్జ్ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష**



**సంగారెడ్డి బ్యూరో, మే9 (నినాదం):** జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ (నిమ్జ్ ) పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలనీ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. అవసరమైన యంత్రాలు, ఎక్విప్మెంట్‌ను పెంచి ఇన్ఫ్రాస్ట్రక్చర్ వర్క్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మౌలిక వసతుల ఏర్పాట్లలో ఎలాంటి జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శనివారం కలెక్టర్ జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వీరారెడ్డి తో కలిసి జహీరాబాద్ రెవెన్యు డివిజనల్ అధికారి కార్యాలయంలో నిమ్జ్, పరిధిలోని భూముల అభివృద్ధి, సేకరించిన భూముల ప్రస్తుత స్థితి, పెండింగ్ సమస్యలు, స్వాధీనం చేసుకున్న భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు తదితర అంశాలపై టీజీఐఐసీ, నిమ్జ్, రెవెన్యూ మరియు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు నిమ్జ్ భూముల మ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్, ఇప్పటివరకు సేకరించిన భూములు, ఇంకా సేకరించాల్సిన భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించి పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తిచేయాలని తెలిపారు. సేకరించిన భూమిలో చుట్టు పూర్తి స్థాయిలో ఫెన్సింగ్ వేయాలని సూచించారు. ఈ సమావేశంలో టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీరారెడ్డి, జోనల్ మేనేజర్ విఠల్, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలాక్షి, రెవెన్యూ డివిజనల్ అధికారి దేవుజ, సంబంధిత మండలాల తహసీల్దార్లు, పోలీస్ శాఖ అధికారులు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మేడిగడ్డ మరమ్మతులు చేతగాక.. తమ్మిడిహట్టి వద్ద కాంగ్రెస్ డ్రామాలు

**150 మీటర్లకు ఒప్పందం జరిగితే కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో తట్టెడు మట్టైనా ఎందుకు తీయలేదు?**

**కాంగ్రెస్ మంత్రులకు ప్రాజెక్టులపై కనీస అవగాహన లేదు.. ఎవరికి తోచినట్లు వాళ్లు మాట్లాడుతున్నారు**

**బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్,మాజీ మంత్రి హరీశ్ రావు**



**సిద్దిపేట, మే 9(నినాదం):** తమ్మిడిహట్టి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని, బీఆర్ఎస్ పై చేస్తున్న దుష్ప్రచారాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మేడిగడ్డ వద్ద కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయకుండా రాష్ట్ర ప్రయోజనాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం గాలికి వదిలేసిందని, వచ్చే ఏడాది రాబోయే కరువును ఎదుర్కోవాలంటే మేడిగడ్డ రిపేర్లు వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా తమ్మిడిహట్టి వద్ద కాంగ్రెస్ మంత్రుల హడావిడి చూసిన తర్వాత ఒక విషయం అర్థమవుతోంది.. పని తక్కువ ప్రచారం ఎక్కువ. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు వాగుడు తప్ప చేతలు శూన్యం అని ఎల్ నినో ప్రభావంతో కరువు వస్తుందని తెలిసినప్పుడు హడావిడిగా బాయి తవ్వినట్లు కాకుండా, ముందస్తుగా మేడిగడ్డ రిపేర్లు చేయాలి.అన్నారు తమ్మిడిహట్టి కడుతున్నట్లు పేపర్లకు ఫోజులిస్తున్నారు. కురచ బుద్ధితో బీఆర్ఎస్ పై బురద జల్లే కార్యక్రమం తప్ప వారు చేస్తున్నది శూన్యం.అన్నారు.150 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి ఒప్పందం జరిగిందని మంత్రి వివేక్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. అన్నారు ఒప్పందం ఉంటే, ఉమ్మడి రాష్ట్రంలో ఏడున్నరేండ్లు అధికారంలో ఉండి కూడా తట్టెడు మట్టైనా ఎందుకు తవ్వలేదు? అన్నారు ఈ రెండున్నరేళ్లుగా డ్రామాలు చేస్తూ పనులు ఎందుకు స్టార్ట్ చేయలేదు? 30 నెలలుగా కాంగ్రెస్ పార్టీని ఎవరు ఆపారు. ప్రశ్నించారు? మహారాష్ట్ర సీఎం పృథ్వీరాజ్ చవాన్ అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు. మాతో ఒప్పందం లేకుండా ఏకపక్షంగా పనులు చేస్తున్నారు, ఇవన్నీ నిర్వీర్యం అయిపోతాయి, మీరు ఏ పని చేసినా అది వృథా అవుతుంది అని స్పష్టంగా చెప్పారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ నేతలు అగ్రిమెంట్ అయిపోయిందని పచ్చి అబద్ధాలు ఆడుతున్నారు. కిరణ్ కుమార్ రెడ్డి ఉన్నప్పుడే అగ్రిమెంట్ అయి ఉంటే తమ్మిడిహట్టి దగ్గర పనులు ప్రారంభించకుండా.. తోక పనులను ఎందుకు ప్రారంభించారు? చేవెళ్ల దగ్గర ఎందుకు తవ్వారు. మేం మంత్రులం ఏం మాట్లాడినా ప్రజలు నమ్ముతారని అతి విశ్వాసంతో వాళ్లు మాట్లాడుతున్నట్లుంది. తమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టు కడితే గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లికి నీళ్లు పోతాయి అని మంత్రి జూపల్లి కృష్ణారావు అంటున్నాడు. కనీస అవగాహన లేకుండా మాట్లాడి ఆయన తన అవివేకాన్ని బయటపెట్టుకున్నాడు.అన్నారు హైదరాబాద్ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తమ్మిడిహట్టి దగ్గర బ్యారేజ్ కట్టి సుందిళ్ల బ్యారేజ్ కి నీళ్లు తెస్తాం అంటారు. సీఎం రేవంత్ రెడ్డి ఏమో తమ్మిడిహట్టి నుండి ఎల్లంపల్లికి లిఫ్టుతో నీళ్లు తెస్తామంటాడు. మంత్రి జూపల్లి ఏమో లిఫ్ట్ అవసరం లేదు, గ్రావిటీ ద్వారా వస్తాయి అంటారు. ఎవరు చెప్పేది నిజం. ఈ అజ్ఞానపు మాటలతో రాష్ట్ర పరువు తీస్తున్నారు. అన్నారు కేసీఆర్ తన పుట్టినరోజు నాడే రాష్ట్ర ప్రయోజనాల కోసం మహారాష్ట్ర ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఒక రాష్ట్రాన్ని ఒప్పించే పద్ధతి ఇది. మీలా లేఖలు రాయడం కాదు. తమ్మిడిహట్టి వద్ద ఎకో సెన్సిటివ్ జోన్ ఉంది, వైల్డ్ లైఫ్ ఫారెస్ట్ ఉంది. సుప్రీంకోర్టు తీర్పు రావాలి. ఈ సాధకబాధకాలు తీర్చకుండా.. మేనిఫెస్టోలో పెట్టి డైలాగులు కొట్టడం తప్ప కాంగ్రెస్ చేసింది ఏమీ లేదు.అన్నారు మాటల కోసమే తప్ప చేతల కోసం కాదు. మీకు చిత్తశుద్ధి ఉంటే బడ్జెట్లో ఎందుకు సరైన నిధులు కేటాయించలేదు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా తమ్మిడిహట్టి జలహారతుల డ్రామాలు కట్టిపెట్టి, వెంటనే మేడిగడ్డ పిల్లర్లకు మరమ్మతులు చేసి రాష్ట్ర రైతాంగానికి సాగు, తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజల సౌలభ్యం కోసం ఫంక్షన్ హాల్స్ ఉపయోగపడాలి



**ఆమనగల్లు,మే 08 (నినాదం):** ప్రజల యొక్క అవసరాలకు శుభకార్యా లకు పంక్షన్ హాల్స్ అందుబాటులో ఉండి ఉపయోగపడాలని కల్వ కుర్తి ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం కడ్తాల్ మండల పరిది లోని రావిచేడ్ గ్రామంలో రావిచేడ్ సర్పంచ్ బొప్పిడి గోపాల్ నూతనంగా ఏర్పాటు చేసిన ఎల్ఎన్జి గార్డెన్ (పంక్షన్ హాల్)ను ఎమ్మెల్యే నారాయ ణరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. పంక్షన్ హాల్స్ సామా న్యులకు అందుబాటు ధరలో ఉండి, ఉత్తమ సేవలందించాలని ఆయన కోరారు. ఈ రోజులో ప్రతి ఒక్కరూ చిన్నా, పెద్ద శుభకా ర్యాలు పంక్షన్ హాల్లోనే జరుపుతున్నారని అన్నా రు. సామాజిక సేవా దృక్పథంతో, యాజమాన్యం వినియోగ దారులకు నాణ్య మైన సేవలందించి మంచి పేరు తెచ్చు కోవా లని ఆయన సూచించారు. పంక్షన్ హాల్ ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర ఎఫ్ ఎస్ సి చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మాజీ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, పిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, పాల్గొన్నారు

# తుది దశకు చేరుకున్న ఎర్రవల్లి రైల్వే స్టేషన్ నిర్మాణం పనులు

**వికారాబాద్ కృష్ణా జిల్లా రైలు మార్గానికి మంచి రోజులు**



**వికారాబాద్, మే9 (నినాదం):** వికారాబాద్ జిల్లా కేంద్రం సమీపంలో ఎర్రవల్లి వద్ద నిర్మిస్తున్న నూతన రైల్వే స్టేషన్ పనులు తుది దశకు చేరు కొనున్నాయి. వికారాబాద్ రైల్వే జంక్షన్ నుండి ముంబాయి వైపు, ఔరంగబాద్ వైపు వెళ్ళే రైలు మార్గాలు ఉన్నాయి. అయితే ఔరంగబాద్ నుండి వచ్చే రైళ్ళు ముంబాయి వైపు వెళ్ళడానికి వికారాబాద్ జంక్షన్ లో రైలు ఇంజన్ మార్చుకుని ముంబాయి వైపు వెళ్ళాల్సి వస్తుంది. దీంతో సమయం వృథాకావడం ప్రయాణికులు నిరీక్షించాల్సి రావడంతో ఇబ్బందిగా భావించిన రైల్వే ఉన్నత అధికారులు వికారాబాద్ మండల పరిధిలోని ఎర్రవల్లి వద్ద రైల్వే స్టేషన్ నిర్మాణం చేసి గంగారం వద్ద ముంబాయి రైలు మార్గానికి అనుసంధానం చేయాలని ప్రతిపాదనలు ఖరారు చేసి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఎర్రవల్లి వద్ద రైల్వే స్టేషన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పనులు పూర్తి కాగానే ఔరంగబాద్ నుండి వస్తున్న రైళ్ళు వికారాబాద్ జంక్షన్లో ఇంజన్ మార్చుకునే అవసరం లేకుండా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా రైళ్ళు నేరుగా ముంబాయి వెళ్ళడానికి మార్గం షుగమనం కానుంది. ఈ నేపథ్యంలో వికారాబాద్ జంక్షన్ లో దిగాల్సిన ప్రయాణికులు ఎర్రవల్లి వద్ద రైలు దిగివెళ్ళాల్సి వస్తుంది. ఈ స్టేషన్ నిర్మాణంతో పరిసర గ్రామాలకు చెందిన ప్రజలకు రైలు సేవలు మరింతగా అందుబాటులోకి రావడమే కాకుండా ఎర్రవల్లి గ్రామం పేరు రైల్వే శాఖలో నమోదు కానున్నది. అంతేకాకుండా రైల్వే స్టేషన్ పరిసరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా పుంజుకునే అవకాశం లేకపోలేదని స్థానిక నాయకులు భావిస్తు న్నారు. దాదాపుగా వికారాబాద్ పట్టణానికి అనుకుని ఉన్న ఈ ప్రాంతం అభివృద్ధికి రైల్వే స్టేషన్ దోహదం చేయనున్నదని అనుకుంటున్నారు. కొత్త అంగుళతో నిర్మాణం చోటు చేసుకుంటున్న ఈ రైల్వే స్టేషన్ భవిష్యత్తులో మరింతగా అభివృద్ధి చెందడం ఖాయమని భావిస్తున్నారు. రైల్వే స్టేషన్ రెవెన్యూ పరిధి ఎర్రవల్లి అయినప్పటికీ కొత్తగాడి గ్రామానికి అనుకుని ఉండటంతో ఈ గ్రామం కూడా మరింతగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉన్నదని స్థానికులు భావిస్తున్నారు. అదే విధంగా ఈ రైలు మార్గంలో గతంలో కొనసాగిన గేటువనంపల్లి వద్ద కూడా రైల్వే స్టేషన్ పునరుద్ధరణకు నోచుకోనుందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సురక్షతమైన తక్కువ ఖర్చుతో లభించే ప్రయాణం తిరిగి పునరావృతం కావడం హర్షనీయమని పరిసర గ్రామాలకు చెందిన వారు అన్నారు. గేటువనంపల్లిలో గతంలో రైల్వేస్టేషన్ ఏర్పాటుతోనే కొజ్జవనంపల్లి పేరు గేటువనంపల్లిగా వాడుకలోకి వచ్చిందని గెజిట్ లో కూడా గ్రామం పేరును గేటువనంపల్లి గా మార్చాలని కూడా గ్రామస్తులు సంబంధిత అధికారులకు వినతి చేశారు. ఇక్కడ స్టేషన్ పునరుద్దరణతో దాదాపు పది గ్రామాల ప్రజలకు రైలు ప్రయాణం అందుబాటులోకి రానున్నదని తెలిపారు. ఇదిలా ఉండగా శుక్రవారం సీ ఎం ఎనుముల రేవంత్ రెడ్డి ఆయన ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ కు వచ్చారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన అధికారిక సమావేశంలో వికారాబాద్ కృష్ణా రైల్వే మార్గం విషయాన్ని ప్రస్తావనకు తెచ్చారు. వికారాబాద్ కృష్ణా జిల్లా లైన్ కు మార్గం సుగమనమైయిందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో వికారాబాద్ జంక్షన్ ఖాతాలోకి కృష్ణ రైలు మార్గం కూడా నమోదు కానున్నదని కృష్ణా రైలు మార్గం పరిసర గ్రామాలకు రైలు సౌకర్యం కలగటంతో పాటు అభివృద్ధికి నోచుకోనున్నాయి. ఈ నేపథ్యంలో సత్వర చర్యలు తీసుకోని రైలు మార్గం నిర్మాణనానికి శ్రీకారం చుట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# కేంద్ర మంత్రి కుమారుడిపై హనీట్రాప్ యత్నం కలకలం

**-పోక్సో కేసుతో బెదిరింపులు..**
**-కోట్ల రూపాయల వసూళ్ల కుట్రపై**
**కరీంనగర్ టూ టౌన్‌లో ఫిర్యాదు**



**కరీంనగర్, మే 9(నినాదం):** కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడిని లక్ష్యంగా చేసుకుని హనీట్రాప్, బెదిరింపులు, డబ్బుల వసూళ్లకు సంబంధించిన వ్యవహారం సంచలనంగా మారింది.ఒక మహిళ తన కుమారైను అడ్డంగా పెట్టుకుని పథకం ప్రకారం బండి సంజయ్ కుమారుడిని ఉచ్చులోకి దింపేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం కోట్ల రూపాయలు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం.ఈ వేధింపులు ఎక్కువ కావడంతో బాధితుడు కరీంనగర్ పోలీసులను ఆశ్రయించారు. తన నుంచి రూ.2 నుంచి రూ.3 కోట్ల వరకు వసూలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని ఫిర్యాదులో పేర్కొ న్నట్లు తెలిసింది. అలాగే, బాలిక వయస్సును తప్పుగా చూపిస్తూ పోక్సో కేసు పెడతామని బెదిరించి, మీడియా ద్వారా ఒత్తిడి తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బులు ఆశించిన మేరకు రాకపోవ డంతోనే ఈ వ్యవహారాన్ని వివాదాస్పదం చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు విచారణ కొనసాగిస్తూ, సంబంధిత మహిళ గతంలో ఇలాంటి ఘటనల్లో పాల్గొన్నారా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు.

# బక్రీద్ ప్రశాంతంగా నిర్వహించాలి

**-సోషల్ మీడియాలో విద్వేష**
**పోస్టులపై చర్యలు**
**డీఎస్పీ పురుషోత్తం రెడ్డి**



ధర్మపురి మే 9( నినాదం )బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జగిత్యాల డీఎస్పీ పురుషోత్తం రెడ్డి సూచించారు. పండుగ సందర్భంగా మత విద్వేషాలను రెచ్చగొట్టే సోషల్ మీడియా పోస్టులు, సందేశాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన సర్కిల్ స్థాయి పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.పండుగ వేళ చెక్‌పోస్టులను మరింత పటిష్టం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వధశాలలు అన్ని అనుమతులు, నిబంధనల మేరకే నిర్వహించాలని పేర్కొన్నారు.సీఐ రామనర్సింహారెడ్డి మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా పశువుల రవాణా పరిమిత స్థాయిలో మాత్రమే జరగాలని సూచించారు. ధర్మపురిలో ఆవుల వధ పూర్తిగా నిషేధించబడిందని స్పష్టం చేశారు. గోరక్ష కమిటీ సభ్యులు స్వచ్ఛంద పెట్రోలింగ్ పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగించరాదన్నారు. పట్టణంలో కొనసాగుతున్న హిందూ ముస్లిం ఐక్యతను కాపాడాలని కోరారు.ఈ సమావేశంలో గ్రంథాలయ చైర్మన్ సంగనభట్ల దినేష్, ఎస్సైలు జి.మహేష్, ఎం.రవీందర్, ఉదయ్‌కుమార్, కృష్ణసాగం రెడ్డి, జి.సతీష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి, వెటర్నరీ వైద్యులు వేణుగోపాల్, వివిధ మతాల పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

**ధాన్యం కొనుగోలు వేగవంతం**
**చేయాలని అధికారులకు**
**కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశాలు**




**కరీంనగర్, మే 9(నినాదం) :** జిల్లాలో రైతులు విక్రయానికి తీసుకొస్తున్న ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోందని తెలిపారు.శనివారం రాత్రి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి కొనుగోలు ప్రక్రియ పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఇటీవల కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లతో కప్పివేయడం, నీరు నిల్వ కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైతే అదనపు రక్షణ ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.తూకం పూర్తయిన ధా న్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో ఎక్కువసేపు నిల్వ ఉంచకుండా వెంటనే సమీప మిల్లులు లేదా నిల్వ కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఇందుకోసం అవసరమైన రవాణా సదుపా యాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యం, జాప్యం లేదా రైతులకు ఇబ్బందులు కలిగితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ కొనుగోలు ప్రక్రియను సజావుగా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, వారి కష్టానికి తగిన ఫలితం అందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.

## మోడీ బహిరంగ సభను

# విజయవంతం చేయండి

**-బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడుఎర్రబెల్లి**
**సంపత్ రావు**



**జమ్మికుంట, మే 9 (నినాదం)** నేడు హైదరాబాద్ జరిగే ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సంపత్ రావు మాట్లా డుతూ కోట్లాది రూపాయలతో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పరుస్తున్న నరేంద్ర మోడీ నాయక త్వాన్ని ప్రతి ఒక్కరు బలపరచాల్సిన అవసరం ఉందని అన్నారు. నరేంద్ర మోడీ రాక భారతీయ జన తా పార్టీ శ్రేనులకు కొత్త ఉత్సాహం ఇస్తుందని, ఈ బహిరంగ సభ తో తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులు జరుగుతాయని జోష్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా అప్పు ల పాలు చేసిందని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయ డంలో పూర్తిగా వైఫల్యం చెందిం దని,ఈ రెండు పార్టీల పైన తెలంగాణ ప్రజలకు పూర్తిగా విశ్వాసం పోయిందని తెలిపారు. తెలంగాణ ప్రజలు నరేంద్ర మోడీ పరిపాలన పట్ల విశ్వాసం వ్యక్తం చేస్తూ రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపికి అండగా నిలబడతారని సంపత్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ శ్రేణులు, మోడీ అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

**-రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన**
**కాంగ్రెస్ కార్యకర్త.. వైద్యానికి 20 లక్షల రూపాయలు**
**-ప్రభుత్వం మంత్రులు స్పందించాలని నాయకుల విజ్ఞప్తి**



**జమ్మికుంట మే 9 (నినాదం) :** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన సలీం పాషా గత మూడు రోజుల క్రితం హుజురాబాద్ నుండి జమ్మికుంటకు వస్తుండగా తోకలపల్లి వద్ద కారు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలై అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. కుటుంబ సభ్యులు మిత్రులు కలిసి హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో 20 సంవత్సరాల కాలం పాటు క్రియాశీలక సభ్యునిగా పనిచేస్తూ ఎక్కడ కాంగ్రెస్ పార్టీ సమావేశాలు సభలు ఉన్న అక్కడికి వెళ్లడంతో పాటు స్థానికంగా పార్టీ బలోపేతానికి కృషి చేయడమే కాకుండా అందరితో కలిసి ఉండే సలీంకు పెద్ద కష్టం రావడంతో కుటుంబ సభ్యులు మిత్రులు ఆందోళన చెందుతున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న సలీంకు వైద్యం చేసేందుకు దాదాపు 20 లక్షల రూపాయల ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఐదు లక్షల రూపాయలు వైద్యం చేయించారు. ప్రతినిత్యం 30 వేల రూపాయలు ఖర్చు అవుతుందని ఆర్థిక పరిస్థితి భారంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పార్టీ కోసం పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన కార్యకర్తకు అండగా ఉండి ఆదుకోవాలని స్థానిక నాయకులు కోరుతున్నారు. జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకొని పార్టీ నే నమ్ముకుని బతుకుతున్న కార్యకర్తకు అండగా ఉండాలని పలువురు కోరుతున్నారు. సహాయం చేయాలనుకునే దాతలు 9618 887420, సహాయం చేయాలని కోరారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**-రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శక కొనుగోళ్లు**
**- కలెక్టర్ బి సత్యప్రసాద్**



**ధర్మపురి మే 9(నినాదం ) :** వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. తూకం వేసిన ధా న్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే రైస్‌మిల్లులకు తరలిం చాలని సూచించారు.శనివారం ధర్మపురి మండలం పెద్దనక్కల పేట, దోనూరు, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియ, నిల్వలు, రవాణా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.మ్యాచర్ వచ్చిన వెంటనే ధాన్యాన్ని తూకం వేసి మిల్లులకు తరలించాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి రైతులకు సకాలంలో సేవలు అందించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ఆన్‌లైన్ డేటా ఎంట్రీ పూర్తి చేసి రైతుల ఖాతాల్లో త్వరగా డబ్బులు జమయ్యేలా చూడాలని ఆదేశించారు.అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల సమయంలో రైతులు చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద నిలవకుండా అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశిం చారు.ఈ పరిశీలనలో మండల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బీజేపీ దాడులకు నిరసనగా బంద్



**కరీంనగర్, మే 9(నినాదం):** కరీంన గర్‌లో రాజ కీయ ఉద్రిక్తతలు నెలకొన్నాయి. బీజేపీ దాడులకు నిరసనగా బీఆర్ఎస్ శ్రేణులు జిల్లా వ్యాప్తం గా ఆందోళ నలు చేపట్టాయి. పలు వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించగా, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ పార్టీ నాయకులతో కలిసి నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన ఆధ్వ ర్యంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది కార్యకర్తలతో కలిసి గంగుల కమలాకర్ నివాసా నికి బయలేరిన రవీందర్ సింగ్‌ను పోలీ సులు మధ్యలోనే అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. రవీందర్ సింగ్ ను అదుపులోకి తీసుకోవడంపై బీఆర్ఎస్ కార్య కర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

# దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్న బిఆర్ఎస్, బీజేపీ

**కరీంనగర్ బంద్ పిలుపు దేనికి సంకేతం..**
**కౌశిక్ రెడ్డి రాజకీయం కోసం ఎవరినైనా బలి చేస్తాడు.**
**కెటిఆర్ ఫ్రస్టేషన్ తో సీఎం పై విమర్శలు**
**బిజెపీ, బిఆర్ఎస్‌లు రెండు ఒకటే**
**నియోజకవర్గం ఇంచార్జ్ ప్రణవ్**




**జమ్మికుంట, మే 9 (నినాదం):** బీజేపీ,బిఆర్ఎస్ పార్టీలు లోలోపల ఒప్పందం కుదుర్చుకొని పైకి వ్యక్తి గత విమర్శలు చేస్తున్నట్టు నటించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ విమర్శించారు. శనివారం హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ బంద్‌కు బిఆర్ఎస్ నాయకులు పిలునివ్వడం దేనికి సంకేతమని, ప్రజల కష్టాలు తీర్చడానికి ఈ బంద్ ఆ లేక వ్యక్తిగత బలప్రదర్శన చూపెట్టడా నికి, చిల్లర రాజకీయం చేయడానికి ఈ బంద్ చేస్తున్నారో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు తెలపాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో సహేతుక విమర్శలు ఉండాలి కానీ వ్యక్తి గత విషయాలు,విమర్శలు చేయ డం మం చిది కాదని, మొదట నుండి చెప్పున్నట్లు బీఆర్ఎస్,బీజేపీ పార్టీలు రెండూ దొందు దొందే అని పైకి కొట్లాడి నట్టు నటించినా లోపలికి ఒక్కటే అని అన్నారు. పీఎంజె షాపు లో బాధితులకు న్యాయం చేస్తామని, అలాగే నిందితులను అతి త్వరలో పట్టుకుంటామని పోలీసులు విచార ణగా చేపట్టి,తమ విధి నిర్వహణ వారు చేస్తున్నారని,స్వయంగా ముఖ్యమంత్రే,హోంశాఖ మంత్రిగా ఉండడం ఈ కేసులో నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. పోలీసుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడడం మంచిది కాద ని, దొంగతనాన్ని కూడా రాజకీయం కోసం వాడుకోవడం ఎంత వరకు సబబు అని మండ పడ్డారు.సోషల్ మీడియాలో రీల్స్ మీద ఉన్న ధ్యాస ప్రజల సమస్యల మీద కౌశిక్ రెడ్డికి లేదని,వావిలాల సమీపంలో అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులను పరామర్శించే సమయంలో లేదా అని మండిపడ్డారు.

**కరీంనగర్ జిల్లా ప్రశాంతంగా ఉంది..ఎలాంటి ఆందోళన లేదు..**

బాధ్యతాయుత పదవిలో ఉన్న కేంద్ర హోం మంత్రి సహాయ మంత్రి బండి సంజయ్, హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలి తప్ప,కరీంనగర్ జిల్లాలో ఏదో జరుగుతుంది అన్నట్టు సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేయడం సబబుకాదని,అలాంటిది ఏం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండు స్వరేళ్లలో నేర నియంత్రణకు అనేక చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు.కౌశిక్ రెడ్డికి పోలీసు వాహనాలను ముందు వెనకాల ఉంచుకోవాలనే సోకు ఉందని అందుకే ఇలా హైలెట్ కావాలని లేనివి ఉన్నట్టుగా కల్పిస్తున్నాడని అన్నారు. హుజురాబాద్‌లో మొఖం లేక కరీంనగర్ వెళ్ళి అక్కడ చిల్లర రాజకీయ వేషాలు వేస్తున్నాడని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో హుజురాబాద్ ఎమ్మెల్యే అంటే ఛీ ఛీ అనే స్థాయికి తీసుకొచ్చాడనీ,ఎమ్మెల్యేగా అయి ప్రజలను పీడించడం తప్ప ప్రజలకు చేసింది ఏం లేదని మండిపడ్డారు.

**కేటీఆర్‌కు అధికార దాహం పెరిగింది**

వరంగల్‌లో జరిగిన బీఆర్ఎస్ రైతుల సమావేశంలో కాంగ్రెస్ పై విమర్శలు చూస్తుంటే కేటీఆర్ లో అధికార దాహం స్పష్టంగా కనిపిస్తుందని,ఎంత ఫ్రస్టేషన్ ఉందో అర్థం అవుతుందని,బహుశా కౌశిక్ రెడ్డి గాలి కేటీఆర్ కు కూడా సోకినట్టుందని అందుకే ఇలా పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడని అన్నారు.కేటీఆర్ మాట్లాడిన మాటలను హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ పక్షాన బేషరతుగా ఖండిస్తున్నామని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రైతు ప్రభుత్వమని అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోపే రుణమాఫీ చేశామని పదేళ్లలో వారు చేయలేని రుణమాఫీ ఒకే సంవత్సరంలో 22,000/- వేల కోట్ల చేశామని,బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వరి వేస్తే ఉరి అని ఆనాడు అంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సన్నవడ్లు పండిస్తే క్వింటాకి 500 రూపాయలు ఇచ్చి రైతులను ఆదుకున్నామ ని,సన్న బియ్యం ఇస్తున్నామని,రైతు భరోసా ద్వారా రైతులను ఆదుకున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,డైరెక్టర్లు,ఉప అధ్యక్షులు, జిల్లా అధికార ప్రతినిదులు, మండల, పట్టణఅధ్యక్షులు,మహిళ అధ్యకురాల్లు, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మెట్ పల్లిలో

# సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

**-రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అన్ని వార్డుల**
**అభివృద్ధి: జువ్వాడి నర్సింగరావు**



**మెట్‌పల్లి, మే 9 (నినాదం) :** మున్సిపల్ కార్యాలయం ఈశాన్య గేటు వద్ద రూ.1.60 లక్షల వ్యయంతో మున్సిపల్ జనరల్ ఫండ్ ద్వారా చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు పనులను రాష్ట్ర వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, మున్సి పల్ చైర్మన్ మైలారపు లింబాద్రి శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పార్టీలకు అతీతంగా మున్సిపల్ అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని తెలిపారు. పట్టణ ప్రజలు, 26 వార్డుల కౌన్సిలర్ల సహకారంతో అన్ని వార్డుల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ముఖ్యమంత్రి సహకారంతో మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు మాసుల ప్రవీణ్, బత్తుల నరేష్, ఖాజా అజీముద్దీన్, పందిరి రమేష్, గుడికందుల అజయ్, రెబస్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మవాడ ప్రభుత్వ పాఠశాలకు బోర్‌వెల్ సౌకర్యం

**కరీంనగర్, మే 9(నినాదం):** కరీంనగర్ పట్టణంలోని 39వ డివిజన్ పోచమ్మవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నీటి అవసరాల కోసం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో బోర్‌వెల్ ఏర్పాటు చేశారు. శనివారం స్థానిక కార్పొరేటర్ మాసం గణేష్ బోర్‌వెల్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే స్పందించి బోర్‌వెల్ మంజూరు చేశారని తెలిపారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సహకరించిన బండి సంజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



# సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**బుగ్గారం, మే9,(నినాదం)..** బుగ్గారం మండల కేంద్రంలో అంగీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో వచ్చిన సీసీ రోడ్డు పనులు శనివారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. తదనంతరం కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు నగునూరి నర్సాగౌడ్ మాట్లాడుతూ మండల కేంద్రంలో మిగిలిన సీసీ రోడ్లు అభివృద్ధి పనులు త్వరలోనే మంత్రి దృష్టికి తీసుకెళ్లి పూర్తి అయ్యేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ ఎంపిటిసి నగునూరి రామగౌడ్,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జంగ శ్రీనివాస్,తాడేపు లింగన్న, వార్డు మెంబర్ జక్కుల లింగన్న, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజన్న కాంగ్రెస్ శ్రేణులు నాయకులు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలి

**మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల**
**నరసయ్యకు నేతల సూచనలు**



**కరీంనగర్, మే 9(నినాదం):** కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఆకుల నరసయ్య శనివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ విజయ రమణారావులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నరసయ్యకు శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. అనంతరం నరసయ్య మంత్రి, విప్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించారు.అలాగే మాజీ ఎమ్మెల్సీ టి. సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్‌ను కూడా ఆకుల నరసయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కరీంనగర్ మార్కెట్ కమిటీకి మంచి పేరు తీసుకురావాలని ఆకుల నరసయ్యకు సూచించారు. మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు అండగా నిలుస్తూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

## హుస్నాబాద్ విద్యుత్ డిఈ

# కార్యాలయంలో 'మార్ఫింగ్' కీచకుడు





**హుస్నాబాద్, (నినాదం):** మహిళా ఉద్యోగులే టార్గెట్.. కంప్యూటర్ ఆపరేటర్ వికృత లీలలు బట్టబయలు!హుస్నాబాద్ పట్టణంలోని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ (ఐజు) కార్యాలయంలో వెలుగులు నింపాల్సిన చోట ఓ కామాంధుడు చీకటి పనులు చేస్తూ అడ్డంగా దొరికిపోయాడు. గత కొన్నేళ్లుగా తనతో పాటు పనిచేసే మహిళా ఉద్యోగులనే లక్ష్యంగా చేసుకుని, వారి ఫోటోలను రహస్యంగా తీసి వికృతానందాన్ని పొందుతున్న కంప్యూటర్ ఆపరేటర్ మహేష్ ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. కార్యాలయ పనుల సాకుతో మహిళల కదలికలను నిశితంగా గమనిస్తూ, తన సెల్ ఫోన్ లో వారి ఫోటోలను బంధించి, ఆ తర్వాత వాటిని అశ్లీల చిత్రాలుగా మార్ఫింగ్ చేయడం ఇతగాడికి నిత్యకృత్యంగా మారింది. కేవలం ఫోటోలు తీయడమే కాకుండా, వాటిని ఎడిట్ చేసి పైశాచిక ఆనందం పొందుతున్న ఈ నిందితుడి తీరుపై అనుమానం వచ్చిన మహిళా ఉద్యోగులు, ధైర్యంగా ముందుకు వచ్చి డి.ఈ. కృష్ణయ్యకు ఫిర్యాదు చేయడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది.బాధితుల ఫిర్యాదు మేరకు హుస్నాబాద్ పోలీసులు రంగంలోకి దిగి మహేష్‌ను అదుపులోకి తీసుకోగా, ప్రాథమిక తనిఖీల్లోనే దిగ్భ్రాంతికరమైన విషయాలు బయటపడ్డాయి. నిందితుడి మొబైల్ ఫోన్ మరియు సిస్టమ్‌ను పరిశీలించిన అధికారులకు వందలాది మార్ఫింగ్ ఫోటోలు లభ్యమైనట్లు సమాచారం. ఆఫీసులో నమ్మకంగా ఉంటూనే తోటి ఉద్యోగినుల ఆత్మగౌరవంతో ఆడుకుంటున్న ఈ 'కీచక' ఆపరేటర్ వ్యవహారం చూసి తోటి సిబ్బంది సైతం నివ్వెరపోతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడి వెనుక ఇంకా ఎవరి హస్తమైనా ఉందా అనే కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశారు. ఒక బాధ్యతాయుతమైన ప్రభుత్వ కార్యాలయంలో మహిళా సిబ్బందికే రక్షణ లేకుండా పోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిందితుడిని కఠినంగా శిక్షించాలని బాధితులు మరియు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిందితుడుపై కేసు నమోదు చేసినట్టు సీఐ శ్రీనివాస్ ఎస్ఐ తెలిపారు.

## బిఆర్ఎస్ బంద్‌కు ప్రజల మద్దతు

**-బిఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్**



**కరీంనగర్, మే 9(నినాదం ):** కరీంనగర్ నగర బంద్‌కు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలపడంతో బంద్ విజయవంతమైందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. రైతులు, కార్మికులు, వ్యాపార వర్గాలు, ట్రేడ్ అసోసియేషన్లు, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా తమ కార్యకలాపాలను నిలిపివేసి బంద్‌లో పాల్గొన్నాయని తెలిపారు.బంద్‌ను విఫలం చేస్తామని ముందుగా ప్రకటించిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రజా మద్దతు చూసి మౌనం పాటించారని విమర్శిం చారు. ప్రజల ఒత్తిడితో బంద్‌ను అడ్డు కునే ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు.కరీంనగర్‌లో శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ బంద్ నిర్వహించామని, ప్రజలు కూడా అదే భావనతో సహకరించారని తెలిపారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ కలిసి బీఆర్ఎస్‌ను రాజకీయంగా దెబ్బతీయాలని ప్రయత్నించినప్పటికీ, ప్రజలు ఆ కుట్రలను తిప్పికొట్టి బంద్‌కు మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు.

### ఎల్లమ్మ ఆలయ

## డైరెక్టర్ల నిజాయితీ

**హుస్నాబాద్ మే 9 ( నినాదం);-**హుస్నాబాద్ స్థానిక ఎల్లమ్మ దేవాలయంలో సిబ్బంది, డైరెక్టర్లు తమ నిజాయితీని చాటుకున్నారు. ఆలయ దర్శనానికి వచ్చిన గంప మౌనిక పొరపాటున తన బ్యాగును ఆలయ ప్రాంగణంలోనే మరిచిపోయారు. ఆ బ్యాగులో సుమారు 15 తులాల బంగారు ఆభరణాలు మరియు 15, 000 రూపాయల నగదు ఉన్నాయి.సొత్తు ఉన్న బ్యాగును గుర్తించిన ఆలయ సిబ్బంది, దానిని భద్రపరిచి బాధితురాలికి సమాచారం అందించారు. అనంతరం ఆలయ డైరెక్టర్లు గట్టు సాయి, ప్రభాకర్, రవీందర్, రాజిరెడ్డి, కిషన్ నాయక్, వెంకటస్వామి మరియు అర్చకుడు పరమేశ్వర్ సమక్షంలో సదరు భక్తురాలికి నగదు, నగలను క్షేమంగా అప్పగించారు.లక్షల రూపాయల విలువైన బంగారాన్ని తిరిగి అప్పగించి ఆదర్శంగా నిలిచిన ఆలయ కమిటీని, సిబ్బందిని స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు.

## రాయినిగూడెంలో ఘనంగా రైతు వారం ప్రోగ్రాం





**హుజూర్ నగర్ మే 09 (నినాదం):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ రైతు వారం అనే ప్రోగ్రామ్ హుజూర్నగర్ మండలం రాయన్న గూడెం గ్రామంలో నిర్వహించడం జరిగింది. గ్రామం సూరల్ దేవి చెరువు దగ్గర ఈ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ ప్రోగ్రాం ను సర్పంచి గుండు రామంజి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కి ముఖ్య అతిథిగ ఇరిగేషన్ ఈ ఈ రామ్ కిషోర్ ,డిఈ నవికాంత్ మేళ్లచెరువు చింతలపాలెం డి ఈ హరి కృష్ణ హుజూర్నగర్ మఠంపల్లి డి ఈ వెంకటేశ్వర్లు ఏ ఈలు జీవన్ కుమార్ వీరబాబు సిద్దార్థ గ్రామ ఉప సర్పంచ్ పిడమర్తి నాగరాజు మాజీ ఎంపిటిసి సందీప్ మాజీ సర్పంచ్ కడప దేవదానం కార్యదర్శి సునీత గ్రామ శాఖ అధ్యక్షుడు గుండు శంభయ్య గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు అమరారపు కర్ణాకర్ గుండు గురవయ్య త్రిమెతిరాజు కంపాటి రాజు వర్క్ ఇన్స్పెక్టర్లు లస్కార్లు గ్రామ మమ్ములో రైతులు గుండు వీరస్వామి గుండు అశోకు గుండు నరేష్ గుండు ప్రవీను గుండు అంజయ్య మేకపోతుల రాంబాబు కుక్కడపు శ్రీను మేకపోతుల బాలయ్య గుండు అంజయ్య గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి నిత్య కళ్యాణం



**హుజూర్ నగర్ (మఠంపల్లి) మే 09( నినాదం):** శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం, మట్టపల్లి మహాక్షేత్రం నందు శనివారం శ్రీ స్వామి వారికి ప్రాతఃకాలమున నిత్యాభిషేకములు, నిత్య హోమములు జరిగినవి. తదుపరి నిత్య కళ్యాణం దేవాలయ అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభా చార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజనేయ చార్యులు వార్లచే శాస్త్రోతముగా నిర్వహించబడినది. దేవాలయం అన్నదానంలో 230 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగినది.

## గారెపల్లిలో ఉచిత పశు వైద్య శిబిరం



**కాటారం, మే 09(నినాదం ):** మండలకేంద్రంలోని గారెపల్లిలోని గొల్లవాడలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గర్భ నిర్ధారణ, గర్భధారణ సేవలు, పశువుల ఆరోగ్య సమస్యలకు చికిత్స అందించారు. మేలు జాతి దూడల సంరక్షణ, పోషణ, పరిశుభ్రతపై రైతులకు అవగాహన కల్పించారు. పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేసి వాటి సాగు విధానంపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పంతకాని సడవలి, మండల పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్, సిబ్బంది గోపాల మిత్ర శ్రీనివాస్, రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

# ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

**ధాన్యం కొనుగోలు వేగవంతం**

**15 రోజుల్లో కొనుగోలు పూర్తి చేయాలి**

**ఎమ్మెల్యే బాలు నాయక్, జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్**



**నల్లగొండ ప్రతినిధి మే 9(నినాదం):** యాసంగి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం 15 రోజుల్లో దాన్యం కొనుగోలు పూర్తి చేయాలి దేవరకొండ శాసనసభ్యులు బాల నాయక్, జిల్లా కలెక్టర్. బి చంద్రశేఖర్ అన్నారు. శనివారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు 457 కొనుగోలు కేంద్రాల ద్వారా 3.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. మొత్తం 6.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని ముందస్తు అంచనా వేసినట్లు పేర్కొన్నారు. మిగిలిపోయిన ధాన్యం కొనుగోళ్లు వచ్చే 15 రోజుల్లో పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. దేవరకొండ డివిజన్ పరిధిలో స్థానిక ఎమ్మెల్యే సహకారంతో మిల్లర్ల సమన్వయం ద్వారా ధాన్యం వేగంగా మిల్లులకు తరలించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అవసరమైన చోట హమాలీల సంఖ్యను పెంచడంతో పాటు, అదనంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యం కళ్లాల్లో ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా త్వరితగతిన తరలింపు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం అమ్మిన రైతులకు చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయని, ఇప్పటివరకు రూ487 కోట్లు చెల్లించామని తెలిపారు. డివిజన్ పరిధిలోని 12 మిల్లులకు చెందిన మిల్లర్లు ధాన్యం సేకరణలో పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలని పేర్కొంటూ అదనంగా 30 లారీలను పెంచామని, ప్రస్తుతం మొత్తం 100 లారీలతో 24 గంటల వ్యవధిలో ధాన్యం అన్‌లోడింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ రైతు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొంటుందని,ఒక వేళ వర్షానికి ధాన్యం తడిచినా కొంటుందని తెలిపారు. దేవరకొండ నియోజకవర్గానికి ఈసారి సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, ఇప్పటివరకు 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. డిండి ప్రాంతంలో ఇంకా వరి కోతలు కొనసాగుతున్నాయని, అక్కడినుండి వచ్చే ధాన్యం కొనుగోలుకు అనుగుణంగా కలెక్టర్, జేసీ ఆధ్వర్యంలో చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. నియోజకవర్గంలోని 12 మిల్లుల మిల్లర్లు ధాన్యం స్వీకరణలో భాగస్వామ్యం కావాలని కోరారు.ప్రస్తుతం ఉన్న 70 లారీలు సరిపోకపోతే మరిన్ని లారీలు కూడా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఏ కేంద్రంలో ధాన్యం ఎక్కువగా ఉంటే అక్కడికి వెంటనే లారీలు పంపిస్తామని చెప్పారు. వచ్చే పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చిత్తశుద్ధితో పనిచేస్తోందని. మిల్లర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రతి గింజ కొనుగోలు చేసి రైతులను ఆదుకోవచ్చుని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశనికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఇంచార్జ్ ఆర్డిఓ రమణారెడ్డి ,డిఎస్ఓ వెంకటేష్, డిఎం రాంపత్తి నాయక్, డిసిఓ పత్యా నాయక్ , మార్కెటింగ్ ఏడి ఛాయాదేవి, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, డిటి ముబీన్,రైస్ మిల్లర్ల తరపున వెంకన్న, శ్రీనివాస్,అధికారులు,తదితరులు హాజరయ్యారు.

## ప్రతిఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలి





**మాజీ మంత్రి రెడ్యానాయక్**

**ఎల్లంపేటలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన**

**అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులు**

**డోర్నకల్ /మరిపెడ మే 09(నినాదం):** ప్రతిఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రి రెడ్యానాయక్ అన్నారు. శనివారం మరిపెడ మండలంలోని ఎల్లంపేట గ్రామపంచాయతీలో శ్రీ గుమ్మ మహేశ్వర స్వామి ధ్వజస్తంభన, గణపతి పార్వతి సుబ్రహ్మణ్యేశ్వర నవగ్రహ సహిత గ్రామ దేవతల నాబిసిల బొడ్రాయి,భూలక్ష్మి,శ్రీ లక్ష్మీ సమేత ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గండి రాధమ్మ తనయుడు పిఎసిఎస్ వైస్ చైర్మన్ గండి మహేష్ గౌడ్ శాలువాతో సత్కరించారు.వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.ధ్వజస్తంభ ప్రతిష్టాపనలలో పాల్గొన్న భక్తులకు మాజీ మంత్రి రెడ్యానాయక్ ఆప్యాయంగా పలకరిస్తూ,ప్రతి ఒక్కరు దైవచింతనా కలిగి ఉండాలని అన్నారు. ఎల్లంపేట గ్రామం దైవచింతనలో మునిగిపోయింది.ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో నూతన వస్త్రాలు ధరించి మొక్కుకున్నారు.బీఆర్ఎస్ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని దర్శించుకున్నారు.వారి వెంట సీనియర్ నాయకులు రాముడు అచ్చుతారావు,గుగులోత్ వేంకన్నా,నారెడ్డి సుదర్శన్ రెడ్డి, మాణిక్యం,తేజవత్ రవీందర్,తాళ్లపల్లి రఘు,తాళ్లపల్లి శ్రీను,బీఆర్ఎస్ నాయకులు,యువకులు ఇంకా తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవారిని దర్శించుకున్న నీలం షమీ రావు ఐఏఎస్



**హన్మకొండ,మే9 (నినాదం):** చారిత్రాత్మకమైన వరంగల్ నగరంలోని శ్రీ భద్రకాళీ దేవస్థనాన్ని నీలం షమీ రావు, ఐ.ఏ.ఎస్., సెక్రెటరీ, మినిస్ట్రీ అఫ్ టెక్స్టైల్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా షమీ రావుకి ఆలయ ఈఓ రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషులు పూర్ణకుంభం, మంగళవాద్యాలతో ఆమెకు ఘనస్వాగతం పలికారు. షమీరావు వెంట అనిల్ కుమార్, డైరెక్టర్, టెక్స్టైల్స్, శశాంక్, ఎం.డి., టి.జి.ఐ.ఐ.సి తదితరులున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం ఆలయ మహామండపంలో ప్రధానార్చకులు భద్రకాళి శేష ఆధ్వర్యంలో అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. అనంతరం ఇటీవల నూతనంగా నియమించబడిన తెలంగాణా రాష్ట్ర బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బస్వరాజు శ్రీనివాస్ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం ఆలయ మహామండపంలో మమదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు ఓరుగంటి పూర్ణచందర్, మయూరి రామేశ్వరావు శ్రీనాథ్ తదితరులున్నారు.

## కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

**వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ రామకృష్ణారావు**



**భూపాలపల్లి ప్రతినిధి, మే 09(నినాదం):** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎస్ రామ కృష్ణా రావు తెలిపారు. ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, సెన్సస్, విద్యా వారోత్సవాలపై శనివారం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌర సరఫరాలు, విద్యా, డిఆర్డీఓ తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ అన్ని జిల్లాలలో వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ కు ఒక్క రోజే మిగిలి ఉండడంతో ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో పది లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వీరంతా స్వీయ గణన చేసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సిఎస్ అధికారులను ఆదేశించారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పౌర సరఫరాలు, విద్యా, డిఆర్డీఓ తదితర అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యా వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. సెన్సెస్ పై సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణా సమావేశాలు నిర్వహించి సన్నద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, డీఈఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారమే ధ్యేయం

**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**



**మిర్యాలగూడ మే 9( నినాదం):** మిర్యాలగూడ పట్టణ ప్రజల దశాబ్దాల ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. శనివారం రాత్రి సాగర్ రోడ్డుపై నూతనంగా నిర్మిస్తున్న డివైడర్ల పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక వన్ టౌన్, టూ టౌన్ సీఐలు,ట్రాఫిక్ పోలీసు అధికారులతో కలిసి ఆయన రహదారి పరిస్థితులను పర్యవేక్షించారు. గత నాలుగు రోజులుగా మారుతున్న ట్రాఫిక్ గమగమనాలు,కొత్త డివైడర్ల వల్ల కలుగుతున్న మార్పులను అధికారులతో కలిసి విశ్లేషించారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అదనపు సిబ్బంది అవసరమని గుర్తించిన ఎమ్మెల్యే, వెంటనే జిల్లా ఎస్పీతో ఫోన్లో మాట్లాడారు. మిర్యాలగూడకు అవసరమైన అదనపు పోలీస్ సిబ్బందిని వెంటనే కేటాయించాలని ఆయన కోరారు. కేవలం జరిమానాలు విధించడం కాకుండా, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కొత్తగా మారుతున్న నిబంధనల వల్ల వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.నో-పార్కింగ్ జోన్లలో వాహనాలు నిలపకుండా చూడాలని, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా వ్యాపారస్తులు నిర్దేశిత పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.పోలీసు యంత్రాంగం ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూనే, ట్రాఫిక్ నిబంధనలను అమలు చేయాలి కోరారు.నేషనల్ హైవే నిబంధనలు,?పట్టణ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేపడుతున్న ఈ చర్యలు భవిష్యత్తులో మిర్యాలగూడ రూపురేఖలను మారుస్తాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వారి వెంట పట్టణ ఒకటవ రెండవ సి ఐ లు నాగభూషణం, సోమ నరసయ్య, ట్రాఫిక్ పోలీసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాజీపేట అండర్ రైల్ బైపాస్ లైన్‌ను వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని





**హనుమకొండ, మే9, (నినాదం):** కాజీపేట కోమటిపల్లి మధ్య నిర్మాణం చేసిన అండర్ రైల్వే వంతెనను ఆదివారం ప్రధాని మోదీ వర్చువల్ గా ప్రారంభించి, జాతికి అంకితం చేయనున్నారు. గత కొన్ని ఏండ్లుగా రైళ్ల రాకపోకల సమయపాలనలో అంతరాయాన్ని నివారించడంలో భాగంగా రైల్వే శాఖ బైపాస్ లైన్లు, రైల్ ఓవర్ రైల్ వంతెనల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే కాజీపేట జంక్షన్?లో రద్దీని తగ్గించడానికి కోమటిపల్లి-కాజీపేట సెక్షన్‌లో రైల్ ఓవర్ రైల్ వంతెనను నిర్మించారు. అండర్ రైల్ వంతెనలంటే నేలపై నుంచి ఒక రైలు ప్రయాణం చేస్తే మరోరైలు కింది నుంచి ప్రయాణం చేస్తుంది. ఇందులో భాగంగానే కోమటిపల్లి-కాజీపేట జంక్షన్ ద్వారా దిల్లీ వైపు నుంచి వచ్చే రైలు మార్గం వడ్డేపల్లి చెరువు దగ్గరకు రాగానే, 'వై ఆకారంలో రెండుగా చీలిపోతుంది. ఒకవైపు వెళ్తే కాజీపేట మార్గం. ఇది కిలోమీటరు దూరం. మరోవైపు వెళ్తే వరంగల్ స్టేషన్. ఇది 10 కిలోమీటర్ల దూరం. దిల్లీ - సికింద్రాబాద్ రైళ్లు కాజీపేట మీదుగా, దిల్లీ - విజయవాడ మార్గంలోని రైళ్లు వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి. మూడు వైపులా రైళ్ల రాకపోకలతో, వడ్డేపల్లి చెరువు ప్రాంతంలో రైల్వే ట్రాక్ రద్దీగా మారుతుంది.మరీ ముఖ్యంగా వరంగల్ వైపు గూడ్సు రైళ్లు వెళ్లేంతవరకు, దిల్లీ, బల్లార్షాల వైపు నుంచి కాజీపేట, సికింద్రాబాద్ వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లను వడ్డేపల్లి చెరువు ప్రాంతం (కాజీపేట స్టేషన్ ఔటర్)లో ఆపుతున్నారు. దీంతో ఆయా రైళ్ల ప్రయాణం ఆలస్యం అవుతోంది. ఈ సమస్యను నివారించి బల్లార్షా - సికింద్రాబాద్, విజయవాడ - బల్లార్షా, సికింద్రాబాద్ - విజయవాడ, ఇలా అన్ని మార్గాల్లో రైళ్లు సాఫీగా రాకపోకలు సాగించేందుకు కోమటిపల్లి - వరంగల్ మధ్య బైపాస్ లైన్‌ను నిర్మించారు. రూ.292 కోట్ల వ్యయంతో, 21.47 కి.మీ. మేరకు భూగర్భ మార్గాన్ని నిర్మించడం జరిగింది.

## కాంప్లెక్స్‌లను ఖాళీ చేయాలని నోటీసులు అందజేత



**తొర్రూరు, మే 9(నినాదం):** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రంలోని స్థానిక జమా మసీద్ ఆవరణంలో ఉన్నటువంటి కాంప్లెక్స్ లలో 1,2,3,5 నెంబర్లు గల షాపుల అగ్రిమెంట్ 15 సంవత్సరాలు పూర్తి అయినందున అట్టి షాపులను ఖాళీ చేయమని గతంలో మజీద్ కమిటీ నుండి షాప్ యజమానులకు మూడుసార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ వారు నోటీసులకు ఎలాంటి వివరణ ఇవ్వకుండా కాలయాపన చేస్తూ మస్జిద్ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తూ మసీదు కమిటీకి వ్యతిరేకంగా పనిచేస్తూ కమిటీ వద్ద షాపులు తీసుకుని షాప్ నెంబర్ 2, షాప్ నెంబర్ 5 యజమానులు సబ్ లీజ్ కు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఇట్టి విషయంపై మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ రెవెన్యూ, కు కలిసి గతంలో కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించడం జరిగింది. అడిషనల్ కలెక్టర్ ఆదేశాలనుసారం అగ్రిమెంట్ పూర్తి అయిన కాంప్లెక్స్ వారు ఈనెల 12న ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో వక్ఫ్ బోర్డు అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ షేక్. సలీం పాషా అగ్రిమెంట్ పూర్తయిన కిరాయిదారులకు నోటీసులను జారీ చేసి అందించిన తదనంతరం మజీద్ ఆవరణంలో నోటీస్ బోర్డు పైన అతికించడం జరిగింది.ఈ సందర్భంగా సలీం పాషా మాట్లాడుతూ తొర్రూరు పట్టణ కేంద్రంలోని స్థానిక జమా మసీద్ ముందు భాగంలో ఉన్నటువంటి కాంప్లెక్స్ లలో కిరాయికి ఉంటున్న వారి అగ్రిమెంట్ 15 సంవత్సరాలు పూర్తి అయిన కాంప్లెక్స్ యజమానులు ఖాళీ చేయకపోవడంతో కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ ను కలిసి వినతి పత్రం ఇవ్వగా అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించి త్రీ మెన్ కమిటీని ఏర్పాటు చేయగా అట్టి కమిటీ సర్వే చేసి ఇచ్చిన సర్వే రిపోర్టు ఆధారాల ప్రకారంగా అగ్రిమెంట్ పూర్తయిన వారి షాపులను ఈనెల 12 మంగళవారం నాడు ఖాళీ చేయమని ఆదేశాలు ఇవ్వడంతో అట్టి షాప్ యజమానులకు నోటీసులను అందజేయడం జరిగిందని,అదేవిధంగా మసీదులో మూడుసార్లు మైకు ద్వారా కాంప్లెక్స్ లలో ఉంటున్న వారికి సమాచారం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు మమ్మద్ మూలాన పాషా, ప్రధాన కార్యదర్శి మమ్మద్ అమీర్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## స్వీయ జనగణన ద్వారా నమోదు చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**భూపాలపల్లి ప్రతినిధి, మే 09(నినాదం):** స్వీయ గణనకు ఒక్క రోజే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ తప్పని సరిగా తమ వివరాలను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. 2027 జనగణనలో భాగంగా ఆన్లైన్ ద్వారా స్వీయ గణన చేసుకునేందుకు ఈ నెల 10వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉన్నదని తెలిపారు. ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకునే ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. వెబ్‌సైట్ ద్వారా ఇంటి వద్ద నుండే సులభంగా స్వీయ గణన నమోదు చేసుకోవాలని అన్నారు. మొబైల్ ఫోన్ ద్వారానే ఈ ప్రక్రియ పూర్తి సులభంగా నమోదు చేయవచ్చని తెలిపారు. గత నెల 26వ తేదీ నుండి ప్రారంభమైన స్వీయ గణన ఆన్లైన్ నమోదు కార్యక్రమం ఈ నెల 10వ తేదీతో ముగుస్తుందని స్పష్టంచేశారు. జనగణన ప్రక్రియలో భాగంగా స్వీయ గణన, అనంతరం గృహాల లెక్కింపు, తదుపరి పూర్తి జనగణన నిర్వహిస్తారని వివరించారు. ఈ నెల 11వ తేదీ నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి హౌస్ లిస్టింగ్ చేపడతారని తెలిపారు. దేశ ప్రణాళిక, భవిష్యత్ అభివృద్ధి, వనరుల పంపిణీకి జనగణన కీలకమని కలెక్టర్ తెలిపారు. అద్దె ఇళ్లలో నివసిస్తున్నవారు కూడా తమ ప్రస్తుత నివాసం నుండే వివరాలు నమోదు చేసుకోవచ్చని సూచించారు.

# స్వీయ జనగణన నేడు ఒకరోజే

- **ప్రతి కుటుంబం విధిగా వివరాలు నమోదు చేసుకోవాలి**
- **కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



**హన్మకొండ,మే,9 (నినాదం):** 2027 జనగణనలో భాగంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ స్వీయ జనగణనకు ఈ నెల 10వ తేదీ రాత్రి 12 గంటల వరకు మాత్రమే అవకాశం ఉన్నందున, హన్మకొండ జిల్లా ప్రజలందరూ తప్పనిసరిగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజలు ఇంటి వద్ద నుంచే సులభంగా హెచ్ టి టి పి ఎస్:// సీ. సెన్సస్. గొ ఇన్ వెబ్‌సైట్ ద్వారా స్వీయ గణన పూర్తి చేసుకోవచ్చని ఆమె తెలిపారు. మొబైల్ ఫోన్ ద్వారానే ఈ ప్రక్రియను సులభంగా పూర్తి చేయవచ్చని, తమకు నచ్చిన భాషను ఎంపిక చేసుకుని కుటుంబ వివరాలను నమోదు చేయవచ్చని పేర్కొన్నారు.గత నెల 26వ తేదీ నుండి ప్రారంభమైన ఈ స్వీయ జనగణన కార్యక్రమం ఈ నెల 10వ తేదీతో ముగియనున్నందున, ఇంకా నమోదు చేయని వారు వెంటనే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. జనగణన ప్రక్రియలో భాగంగా ముందుగా స్వీయ గణన, అనంతరం గృహాల లెక్కింపు, తదుపరి పూర్తి స్థాయి జనగణన చేపడతారనిఆమె వివరించారు.ఈ నెల 11వ తేదీ నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి హౌస్ లిస్టింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారని ఆమె తెలిపారు.దేశ ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పన, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలు, వనరుల సమర్థవంతమైన పంపిణీకి జనగణన అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు.అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారు కూడా తమ ప్రస్తుత నివాసం నుంచే వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జనగణన సందర్భంగా కుటుంబానికి సంబంధించిన సరైన వివరాలను అందించాలని ప్రజలను కోరారు. ప్రజలు అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, అది కేవలం జనాభా లెక్కల కోసం మాత్రమే వినియోగించబడుతుందని ఆమె స్పష్టం చేశారు.ఆన్‌లైన్ నమోదు పూర్తయ్యాక ఎన్యుమరేషన్ ఐడి లభిస్తుందని, ఆ ఐడీ ఆధారంగా ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని తెలిపారు.స్వీయ జనగణనకు ఒక్కరోజే గడువు మిగిలి ఉన్నందున, హన్మకొండ జిల్లా ప్రజలందరూ బాధ్యతగా పాల్గొని ఈ జాతీయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు.





## రోడ్డు ప్రమాదంలో
# ప్రముఖ గైనకాలజిస్ట్ మృతి
### కల్వకుర్తిలో విషాదం.. ప్రజల కన్నీటి వీడ్కోలు

**కల్వకుర్తి మే 9 (నినాదం)**

జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ దాసరి విజయ్ కుమార్ (32) మృతి చెందడం కల్వకుర్తి పట్టణంలో తీవ్ర విషాదాన్ని నింపింది. శనివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ప్రమాదం స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. డాక్టర్ విజయ్ కుమార్ గత కొన్నేళ్లుగా కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్‌గా సేవలందిస్తున్నారు. ప్రతిరోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం పట్టణ పరిధిలోని జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారి సమీపంలోని సీబీఎం కళాశాల వెనుక ఉన్న వందే మాతరం ఫౌండేషన్ వద్ద షటిల్ ఆడి, అనంతరం తన కారులో కల్వకుర్తి వైపు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో జేపీ నగర్ వైపు వెళ్తున్న టీజీ31టీ 2605 నెంబర్ గల నోవైస్ స్కూల్ బస్సు అతివేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న టీఎస్31డి1661 నెంబర్ గల కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న డాక్టర్ విజయ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి ఆయన్ను సమీపంలోని మహిత హాస్పిటల్‌కు తరలించారు. తలకు, గుండె పక్క భాగంలో తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. డాక్టర్ విజయ్ కుమార్ స్వస్థలం కొల్లాపూర్ కాగా, వృత్తిరీత్యా కల్వకుర్తిలో స్థిరపడ్డారు. ఆయన భార్య కల్వకుర్తి మండలం రఘుపతిపేట పీహెచ్‌సీలో వైద్యురాలిగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. నార్మల్ డెలివరీలతో మంచి పేరు డాక్టర్ విజయ్ కుమార్ మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, అనవసర ఆపరేషన్లకు బదులుగా నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యం ఇచ్చేవారని ప్రజలు గుర్తు చేస్తున్నారు.

## అందాపూర్ పాఠశాలలో
# ఈనెల 11 నుంచి వేసవి శిక్షణ శిబిరం

**బోధన్ ప్రతినిధి,మే 9 (నినాదం)**

బోధన్ మండలం అందాపూర్ పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం సూర్యకుమార్ తెలిపారు. ఈనెల 11 నుండి 25 వ తేదీ వరకు ఉదయం 8 గంటలనుండి 12 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. అల్లికలు, సంగీతం, డ్రాయింగ్, సైన్స్ ప్రయోగాలు, శాస్త్రీయ నృత్యం, ఇండోర్ గేమ్స్, యోగ, తదితర అంశాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ధాన్యం సేకరణలో సమస్యలు సృష్టిస్తున్న కేంద్రం
## మద్దతు ధర నిర్ణయించి ఎఫ్‌సిఐతో పీఠముడి
### మొక్కజొన్న రైతుకు పైసా బోనస్ ఇవ్వలేదు.. మంత్రి అడ్లూరి సంచలన వ్యాఖ్యలు

**జగిత్యాల ప్రతినిధి మే 9 నినాదం**

ధాన్యం సేకరణలో కేంద్ర ప్రభుత్వం అనేక సమస్యలు సృష్టిస్తుంది. దీని ఫలితంగా రైతులు రైస్ మిల్లర్లు అధికారులు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఎదురవుతుందని సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం ఫోన్లో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని రైతుల ముందు దోషిగా నిలబెట్టడం కోసం ధాన్యం కొనుగోలు లో తలా తోకలేని నిబంధనలు విధిస్తుందని అన్నారు. 2025 నుంచి 26 వరకు మూడు సీజన్లకు సంబంధించిన దాన్యం గోదాములు నిండిపోయి ఉన్నాయని రైస్ మిల్లర్లు కూడా తమ కెపాసిటీకి మించి దాన్ని తీసుకోమని చెప్తున్నారు అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఎఫ్ సి ఐ రైస్ మిల్లర్లను ఇబ్బందులకు గురి చేస్తుంది అన్నారు.మద్దతు ధర నిర్ణయించి చేతులు దులుపుకుంటుంది అన్నారు. మొక్కజొన్న మద్దతు ధర 2400 గా నిర్ణయం చేసారన్నారు. ప్రభుత్వం రైతుల వద్ద క్వింటాలకు రూ 2400 చొప్పున కొనుగోలు చేసి పౌల్ట్రీ యజమానులకు రూ . 1500 రూపాయల చొప్పున అప్పజెప్పిందన్నారు. పౌల్ట్రీ యజమానులు




సిండికేట్ గా మారి మద్దతు ధర కంటే కిందికి ధరణి దించి కొనుగోలు చేయడంతో విదిలేని పరిస్థితుల్లో ప్రతి ఏటా రూ 2400 కోట్ల నష్టం వాటిల్లుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్న ఈ నష్టం లో కేంద్ర ప్రభుత్వం కనీసం బోనస్ కూడా ఇవ్వడం లేదన్నారు. ఇచ్చే అధికారులు నాణ్యత పేరుతో రైస్ మిల్లర్లను ఇబ్బందులకు గురి చేయడం మూలంగా ధాన్యం మరాటించకుండా గత మూడు సీజన్లో వడ్లు మిల్లులోను గోదాములో ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం బియ్యం లేని తీసుకోవడానికి రైస్ మిల్లర్లకు నెల రోజుల గడువు కేటాయిస్తుందని ఆ గడువులోపు రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోలు వైపు బొగ్గు చూస్తే కొనసాగింపుగా మరో నెల రోజులు పొడిగించకుండా చేయడం మూలంగా ధాన్యం సేకరణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి అన్నారు. నెల రోజులు రైస్ మిల్లులకు అవకాశం ఇచ్చి మరో మూడు నెలల తర్వాత మరో అవకాశం ఇస్తే మిల్లర్లు బియ్యం ఏ విధంగా పెడతారని మంత్రి ప్రశ్నించారు. బిజెపి ఎంపీలు బండి సంజయ్ కిషన్ రెడ్డిలు ఏ రోజు కూడా రాష్ట్రానికి వచ్చే బోనస్ డబ్బుల గురించి గానీ ధాన్యం కొనుగోలు ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడం కోసం గానీ పార్లమెంట్లో తమ వాయిస్ను వినిపించిన పాపాన పోలేదన్నారు. అలాగే టిఆర్ఎస్ ఎంపీలు కూడా బిజెపి ప్రభుత్వానికి భిన్నంగా పార్లమెంట్లో మాట్లాడిన సందర్భాలు లేవన్నారు. బిజెపి బీఆర్ఎస్ ప్రభుత్వాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడితే పర్వాలేదు కానీ రైతులను ఇబ్బంది గురిచేస్తుందని అన్నారు. ఆన్లైన్ విధానం ద్వారా ధాన్యం సేకరణలో అనేక సమస్యలు తలెత్తడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ జీవోను రద్దు చేసి పాత పద్ధతిని కొనసాగించడం కోసం ప్రయత్నించే సమయంలో 20 రోజులు గడిచింది అన్నారు. ఇప్పుడు ధాన్యం సేకరణ పాత పద్ధతిలోనే కొనసాగుతుంది కాబట్టి లక్ష్యాన్ని త్వరగా చేరుకోవడం కోసం రైతులకు ఇబ్బందులు లేకుండా తూకం వేయడానికి అధికారులు వేగంగా పనిచేస్తున్నారన్నారు. అలాగే కరీంనగర్ కాల్పుల గురించి మాట్లాడుతూ బి ఆర్ ఎస్, బిజెపి రాజకీయ డ్రామాలు వాడుతున్నారు. ధాన్యం సేకరణలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న తెలంగాణ రాష్ట్రంపై మోడీ ప్రభుత్వం ఎన్ని అంశాలు విధించిన ఇబ్బందుల గురి చేసిన తట్టుకునే శక్తి ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డికి ఉందని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన టిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు ప్రవచనాలు చెప్తున్నారు అన్నారు. బండి సంజయ్ కేంద్ర సహాయక మంత్రిగా ఉండి కూడా రైతులకు రూపాయి ప్రయోజనం చేయలేదని విమర్శించారు.

# రైతు కంట కన్నీరు పెట్టిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**ఆర్మూర్, మే 9 (నినాదం) :**

బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నేడు కమ్మర్‌పల్లి మండలంలోని బషీరాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా పరిశీలించారు. నెల రోజులుగా ధాన్యం కొనుగోలు కాక కల్లాల్లోనే కుప్పలు తెప్పలుగా పేరుకుపోవడం, అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతుండటంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కొనుగోళ్లపై నిర్లక్ష్య వైఖరి అవలంబించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మండిపడ్డారు. 125 లారీలకు సరిపడా ధాన్యం నిల్వ.. కొనుగోళ్లు మాత్రం నత్తనడకన బషీరాబాద్‌లోనే దాదాపు 125 లారీలకు సరిపడా ధాన్యం నెల రోజులుగా కొనుగోలు కోసం ఎదురుచూస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. వర్షాలు పడుతున్నప్పటికీ ప్రభుత్వం లారీలు, హమాలీలు, టార్పాలిన్ల వంటి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. "రైతులు రాత్రింబవళ్లు కల్లాల దగ్గరే కాపలా కాస్తూ ధాన్యం కాపాడుకునే పరిస్థితి రావడం దురదృష్టకరం. అకాల వర్షాలతో ధాన్యం తడిసి నష్టపోతుంటే ప్రభుత్వం మాత్రం ప్రకటనలకే పరిమితమవుతోంది" అని విమర్శించారు.





**మిల్లర్ల 'తరుగు' దోపిడీపై ఆగ్రహం**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 40 కిలోల బస్తా తీసుకోవాల్సి ఉండగా, రైస్ మిల్లర్లు 43 నుంచి 44 కిలోల వరకు అడుగుతున్నారని రైతులు తన దృష్టికి తీసుకువచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. అంటే క్వింటాల్‌కు సుమారు 10 కిలోల వరకు 'తరుగు' పేరుతో ధాన్యం దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.బాల్కొండ నియోజకవర్గ రైతులకు నేను ఎల్లప్పుడూ అందుబాటులో అండగా ఉంటానని అన్నారు. రైతుల ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యే వరకు నా వంతు పోరాటం రైతుల పక్షాన నిలబడి న్యాయం రైతులకు జరిగే వరకు తన పోరాటం కొనసాగుతుందని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తెలియజేశారు. హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు, కార్యకర్తలు, రైతులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వెనక్కి తిరిగి చూడను..
# తర్వాతి పేజీ మాత్రమే చూస్తాను

NINADAM CINEMA

### కీలక మలుపుగా 'ఈ వేళలో నాలో' పాట

సంగీతంలో లోతు తగ్గిపోయింది

సాధారణ సంభాషణలే నేడు పాటలవుతున్నాయి

గాయని సునీత ఉపద్రష్ట



**తెలుగు సినీ సంగీత ప్రపంచంలో తన మధుర గాత్రంతో మూడు దశాబ్దాలుగా కోట్లాది సంగీతాభిమానులను అలరిస్తున్న ప్రముఖ గాయని సునీత ఉపద్రష్ట. ప్లేబ్యాక్ సింగర్‌గా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారు. స్వరంలోని సున్నితత్వం, భావ వ్యక్తీకరణలోని ప్రత్యేకతతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ఆమె చిరస్థాయిగా నిలిచారు. అనేక హిట్ పాటలతో సంగీత ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన సునీత, కాలానుగుణంగా వచ్చిన మార్పులను అర్థం చేసుకుంటూనే తన ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. నేటి ఆమె పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ముఖాముఖిలో సుస్వరాల సునీత తన మూడు దశాబ్దాల సంగీత ప్రస్థానాన్ని 'నినాదం'తో పంచుకున్నారు.ఇండస్ట్రీలో మార్పులు, ఏఐ ప్రభావం, వ్యక్తిగత అనుభవాలు, భవిష్యత్ ఆలోచనలపై ఆసక్తికర విషయాలను వివరించారు "గతాన్ని లెక్కపెట్టుకోను. తర్వాతి పేజీ ఏంటో మాత్రమే చూస్తాను" అంటూ తన జీవిత తత్వాన్ని వెల్లడించారు.**

> 30 ఏళ్ల ప్రయాణం అంత ఈజీ కాదు. కానీ అభిమానులు చూపిస్తున్న ప్రేమ, ఆశీర్వాదాలు చూస్తే చాలా ఆనందంగా ఉంటుంది. ఎప్పుడూ నాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. నేను ఎప్పుడూ గతాన్ని లెక్కపెట్టుకోను. తర్వాతి పేజీ ఏంటో మాత్రమే చూస్తాను. నా దృష్టి ఎప్పుడూ ముందున్న ప్రయాణంపైనే ఉంటుంది.

**నినాదం:** పుట్టినరోజు శుభాకాంక్షలు. తెలుగు సినీ సంగీత ప్రపంచంలో 30 ఏళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్నారు. ఈ ప్రస్థానం గురించి ఎలా అనిపిస్తోంది?

**సునీత:** ధన్యవాదాలు. మూడు దశాబ్దాలుగా నన్ను, నా పాటను, నా మాటను ఆదరిస్తూ ప్రేమిస్తున్న ప్రతి ఒక్కరికీ ముందుగా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ ప్రయాణం నాకు ఎన్నో అనుభవాలను, విలువైన పాఠాలను నేర్పించింది. 30 ఏళ్ల పాటు ఈ రంగంలో కొనసాగడం అంత సులభం కాదు.

**నినాదం:** మీ సంగీత ప్రయాణంలో టర్నింగ్ పాయింట్‌గా భావించే క్షణం ఏది?

**సునీత:** నా జీవితంలో తొలి పాట 'ఈ వేళలో నాలో' ఒక కీలక మలుపు. అలాగే డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా కొనసాగాలని తీసుకున్న నిర్ణయం కూడా నా కెరీర్‌లో చాలా ముఖ్యమైన మార్పు తీసుకొచ్చింది.

**నినాదం:** ప్లేబ్యాక్ సింగర్‌గా పాట పాడేటప్పుడు పాత్ర భావాన్ని ఎలా అర్థం చేసుకుంటారు?

**సునీత:** దర్శకులు చాలా సందర్భాల్లో పాత్ర భావాన్ని వివరంగా చెబుతారు. అయితే ఎక్కువ సార్లు సాహిత్యం, భాష, సందర్భం అర్థమవుతాయి కాబట్టి, లిరిక్స్‌లోని భావానికి తగ్గ ఎక్స్‌ప్రెషన్స్ సహజంగానే వస్తాయి.

**నినాదం:** మీరు పాడిన పాటల్లో వ్యక్తిగతంగా ఎక్కువ భావోద్వేగంగా అనిపించినవి ఏవి?



**సునీత:** 'మహానటి' సినిమాలోని పాటలు, అలాగే 'సీతారామం' చిత్రంలోని "కన్నుల ముందు నీ కళలే" పాట నాకు ఎంతో ప్రత్యేకం.

**నినాదం:** ఒక పాట రికార్డింగ్‌కు ముందు ఎలా సిద్ధమవుతారు?

**సునీత:** మ్యూజిక్ డైరెక్టర్ చెప్పే విషయాలను త్వరగా అర్థం చేసుకుని నేర్చుకోవడంపైనే ఎక్కువ దృష్టి పెడతాను. అలాగే కొద్దిసేపు మెడిటేషన్ చేసి ప్రశాంతం గా రికార్డింగ్‌కు వెళ్తాను.

**నినాదం:** ఇప్పటికీ పాటలు రాసుకునే అలవాటు కొనసాగిస్తున్నారా?

**సునీత:** అవును. ఖచ్చితంగా కొనసాగిస్తున్నాను.

**నినాదం:** డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా పని చేయడం మీ గానంపై ఎలా ప్రభావం చూపించింది?

**సునీత:** చాలా ప్రభావం చూపించింది. సినిమా పాటల్లో భావంతో పాటు డ్రామాటిక్ ఎలిమెంట్ కూడా ఉంటుంది. ఆ భావాన్ని సరైన స్థాయిలో వ్యక్తపరచడంలో డబ్బింగ్ అనుభవం ఎంతో ఉపయోగపడింది.

**నినాదం:** ఈ 30 ఏళ్లలో ఎంతోమంది సంగీత దర్శకులతో పనిచేశారు. మీకు అత్యంత ఇష్టమైన మ్యూజిక్ డైరెక్టర్ ఎవరు?



**సునీత:** అందరూ నాకు ప్రత్యేకమే.

**నినాదం:** ఒక పాట హిట్ కావడంలో గాయకుడి పాత్ర ఎంతవరకు ఉంటుంది?

**సునీత:** కొన్ని పాటలు ట్యూన్ వల్ల హిట్ అవుతాయి. కొన్ని సాహిత్యం వల్ల గుర్తుండిపోతాయి. మరికొన్ని గాయకుడి గాత్రం వల్ల ప్రేక్షకులకు దగ్గరవుతాయి. మ్యూజిక్ డైరెక్టర్, లిరిసిస్ట్, సింగర్ —— ముగ్గురి పాత్ర కూడా సమానంగా ముఖ్యమే.

**నినాదం:** ఎంతో ఇష్టపడి పాడిన పాట ఆశించిన స్థాయిలో విజయవంతం కాకపోతే బాధపడుతారా?

**సునీత:** నేను ఎప్పుడూ వెనక్కి తిరిగి చూసుకోను. ప్రతి అనుభవాన్ని ఒక పాఠంగా తీసుకుని ముందుకు సాగిపోతాను.

**నినాదం:** సంగీతం నుంచి ఎప్పుడైనా విరామం తీసుకోవాలనిపించిందా?

**సునీత:** భగవంతుడు ఇచ్చిన ప్రతిభను గౌరవిస్తూ దానిపైనే దృష్టి పెట్టాలని అనిపిస్తుంది. నాకు స్థిరమైన జీవితం అంటే చాలా ఇష్టం.



**నినాదం:** ఒకప్పుడు సింగర్స్‌కు ప్రత్యేక గుర్తింపు ఉండేది. ఇప్పుడు ఒక్క పాటతోనే ఓవర్‌నైట్ స్టార్స్ అవుతున్నారు. ఈ మార్పును ఎలా చూస్తారు?

**సునీత:** అప్పట్లో ప్రతి సింగర్‌కు ఒక ప్రత్యేక ఐడెంటిటీ ఉండేది. ఇప్పుడు పరిస్థితులు చాలా అనిశ్చితంగా మారాయి. ఎవరు ఎప్పుడు స్టార్ అవుతారో చెప్పలేం. ఒక పాట హిట్ అయిన తర్వాత కూడా అవకాశాలు కొనసాగుతాయనే హామీ లేదు. అందుకే ఈ ఫీల్డ్‌పై ప్యాషన్ ఉండాలి. అదే సమయంలో మరో ప్రొఫెషన్ కూడా ఉండాలని నేను చెబుతుంటాను.

**నినాదం:** ఈ తరం సంగీతంలో మీరు గమనిస్తున్న అతిపెద్ద మార్పు ఏంటి?

**సునీత:** సాహిత్యంలో లోతు తగ్గిపోయింది. సంగీతంలో ఎలక్ట్రానిక్ ప్రభావం పెరిగింది. ఒకప్పుడు పాటల లైన్ల గురించి కూర్చొని మాట్లాడుకునేంత భావం ఉండేది. ఇప్పుడు సాధారణ సంభాషణలే పాటలుగా మారుతున్నాయి.

**నినాదం:** ఏఐ వాయిస్‌లు, ఆటోట్యూన్ వంటి టెక్నాలజీపై మీ అభిప్రాయం ఏమిటి?

**సునీత:** టెక్నాలజీని సమయాన్ని ఆదా చేసేందుకు ఉపయోగించుకోవాలి. కానీ మనుషుల స్థానంలో మిషన్లు పూర్తిగా పాడటం నాకు వ్యక్తిగతంగా నచ్చదు. అయితే సంగీతంలో కొత్త మార్పులను సహజంగా ఎలా ఉపయోగించుకోవచ్చనే దానిపై పరిశోధన కొనసాగుతూనే ఉంది.

**నినాదం:** సింగింగ్, ప్రొడక్షన్ కాకుండా ఇంకేదైనా చేయాలనే డ్రీమ్ ప్రాజెక్ట్ ఉందా?

**సునీత:** చాలా ఆలోచనలు ఉన్నాయి. కానీ ప్రస్తుతం ప్రత్యేకంగా ఏదో ఒకటి చేయాలనే ప్లాన్ లేదు. సమయం వచ్చినప్పుడు తప్పకుండా చెబుతాను.

**నినాదం:** ఈ తరం సింగర్స్‌కు మీరు ఏమైనా సలహా ఇవ్వాలనుకుంటున్నారా?

**సునీత:** నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న వాళ్లు అడిగితే మాత్రమే నేను నా అనుభవాలను పంచుకుంటాను.

**ఇంటర్వ్యూ:**
**గుంపుల ఇందిరా ప్రియదర్శిని యాదవ్**
**(నినాదం బ్యూరో చీఫ్)**



Printed, Published & Owned by B. Srinivas, Printed at RAHNUMA-E-DECCAN PRESS, H.No.12-2-837/A/3, Asifnagar, Hyderabad., Telangana-500028 Published at Plot S11,3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787